అనుదినం... జనస్వరం

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

పోరాట యోధుడు కాసాని

- మడమ తిప్పని అయిలయ్య
- పేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించిన ఘనుడు
- పేదలు మెచ్చిన నేత జనవరి 25న మృతి
- నేడు సుజాతనగర్‌లో సంస్మరణ సభ 3లో...

16 పేజీలు | ఆదివారం 09 మార్చి 2025 | www.navatelangana.com



కామ్రేడ్ కాసాని అయిలయ్య గారికి

విప్లవ జోహార్లు

నీతి, నిజాయితీకి మారుపేరుగా నిలిచిన మహా నాయకుడు....
మరణించి జీవించే అమర జీవివై, ధృవతారవై మా అందరికీ
మార్గ నిర్దేశకుడివై మా అందరి మధ్య జీవిస్తూనే ఉంటారు.
మార్క్సిస్టు పార్టీ ముద్దుబిడ్డ, నమ్మిన సిద్ధాంతం కోసం
కడవరకు పని చేసిన మచ్చలేని మహానాయకుడు

కామ్రేడ్ కాసాని
అయిలయ్య గారికి
ఇవే మా
విప్లవ జోహార్లు



నర్రా శివరామకృష్ణ
సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు
సుజాతనగర్

చింతలపుడి సాయి

గంగాధర్ కోటేశ్వరరావు
విజయ దుర్గ రైస్
విజయదుర్గ రియల్ ఎస్టేట్స్
సెల్ : 9247888619

కొకొల్లు నాగేశ్వరరావు
మధువన్

AMS ఎంటర్ ప్రైజెస్
(వాజీద్)

ప్రజా నాయకుడు సీపీఎం రాష్ట్ర నేత
కామ్రేడ్ కాసాని అయిలయ్య గారు
మరణం : 25-01-2025

పరుచూరి రామకోటేశ్వరరావు, Rtd. AAO, KTPS, పాల్వంచ



















కాసాని ఉద్యమ పోరాటాలు















పోరాట యోధుడు కాసాని

- మడమ తిప్పని అయిలయ్య
- పేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించిన ఘనుడు
- పేదలు మెచ్చిన నేత
- పలుమార్లు జమీందార్ల హత్యాప్రయత్నాలు
- కడవరకూ ఎర్రజెండా నీడలోనే..
- జనవరి 25న అనారోగ్యంతో మృతి

నవతెలంగాణ-కొత్తగూడెం

1972 వరంగల్ జిల్లా గీసుకొండ మండలం, గంగదేవిపల్లి నుంచి వలస వచ్చిన కాసాని, సుజాతనగర్ పరిసరంలోని రెడ్డిపాలెంలో ఆర్ఎంపి వైద్యులుగా మొదట తన ప్రస్తావాన్ని పారంభించారు. వలస కూలిగా వచ్చిన ఆయన వ్యవసాయం చేయడానికి కొంత భూమిని తీసుకున్నారు. కానీ వ్యవసాయ కూలీలు పడుతున్న కష్టాలను గమనించిన ఆయన చలించిపోయారు. వారికోసం ఏమైన చేయాలని కూలి రేట్లు పెంపు కోసం పోరాటానికి కాలుదువ్వారు. కూలిరేట్లు పెంచాలని తుంగారం, చంద్రుగొండ, సుజాతనగర్, జూలూరుపాడు, సీతంపేట, ఏన్కూరు సింగభూపాలెం, తదితర ప్రాంతాల్లో కూలి రేట్లపెంపుకు పెద్ద ఎత్తున పోరాటాలు ప్రారంభించారు. తొలినాళ్లలో కాలి నడకన సైకిల్ మీద కాసాని, ఆయన భార్య కాసాని లక్ష్మి ఇద్దరు కలిసి వెళ్లి, కంజీర పట్టుకుని వీధివీధిన పాటలు పాడుకుంటూ గ్రామీణ ప్రజల్లో చైతన్యాన్ని రగిలించారు."ఏమి కొనేటట్టు లేదు... ఏం తినేటట్టు లేదు.." అంటూ పాటలు పాడుతూ ప్రజల హృదయాలకు చేరువయ్యారు. కూలీ రేట్లుపెంపునకు పోరాటాలు చేస్తున్న క్రమంలో సుజాతనగర్ ప్రాంతంలో ఆయన నివాసం ఉండడానికి ఇళ్లు అద్దెకు కూడా ఇవ్వని పరిస్థితి నెలకొంది. భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యం చేస్తున్నాడని ఆయనకు అడగడుగునా ఆటంకాలు ఎదురయ్యాయి. ఎక్కడ కూడా నివాసానికి అవకాశాలు లభించలేదు. దీంతో కొంత మంది ప్రజలు స్థలాన్ని చూసి పూరిగుడిసెను ఏర్పాటు చేసి కాసాని కుటుంబానికి నివాసం కోసం ఏర్పాటు చేశారు. ప్రజల ఇష్టాన్ని కాదనలేక ఆ గుడిసెలో తన జీవన ప్రస్థానం, ఉద్యమ పోరాటానికి శ్రీకారం చుట్టాడు.

భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న కాసానిపై హత్యా

▸ మిగతా 4లో...



ఐలయ్య సంస్మరణ సభలో మాట్లాడుతున్న బి.వెంకట్(ఫైల్)

సీపీఐ(ఎం) ఉద్యమాలకు

పెద్దదిక్కు కోల్పోయింది

సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మిలిటెంట్ ఉద్యమాలకు పెట్టింది పేరు. ఈ జిల్లాలో జరిగిన అనేక ఉద్యమాలు పేదలకు, రైతు కూలీలకు, పోడుసాగుదారులకు ఎంతో మేలు చేశాయి. సీపీఐ(ఎం) చేసిన పోరాటాల ఫలితంగా పేద ప్రజలకు ఇల్లు రావడం, ఇళ్ల స్థలాలు అందడం, ఆదివాసీ గిరిజనులకు పోడు పట్టాలు లభించిన సందర్భాలు అనేక ఉన్నాయి. అలాంటి సిపిఎం ఉద్యమ గడ్డపై అనేక ఉద్యమాలను నిర్మించి, పోరాటాలు చేసిన కాసాని ఐలయ్య మరణం సీపీఐ(ఎం)కి నష్టం. ఆయన లేక పోవడం సిపిఎంకు పెద్దదిక్కు కోల్పోయినట్లు అయింది. సిపిఎం జిల్లా పక్షాన ఆయనకు ఘన నివాళులు అర్పిస్తున్నాం.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలోనే కాసాని మృతి దిగ్భ్రాంతికి గురిచేసింది. కాసాని లేని లోటు ఉద్యమాల మీద తీవ్ర ప్రభావం చూపుతుంది... అయినప్పటికీ ఆయన నమ్మిన సిద్ధాంతాలు, ఆయన చూపించిన పోరాటాల బాటలో పేదల పక్షాన, పార్టీ ఎదుగుదలకు పని చేస్తామని కాసానికి ఘన నివాళులర్పిస్తున్న నివాళులు అర్పిస్తున్నాం.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాసాని ఐలయ్య సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులుగా, ఉమ్మడి జిల్లాల కార్యదర్శి వర్గ సభ్యులుగా పనిచేసిన కాలంలో కాసాని ఐలయ్యతో మంచి అనుబంధం ఏర్పడింది. జిల్లా విభజన తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏర్పడిన తర్వాత కాసానితో కలిసి పనిచేయడం వల్ల ఎన్నో పాఠాలు నేర్చుకున్నాం. ఉద్యమాలు, పోరాటాల నిర్మాణానికి ఆయన నుండి అనేక నైపుణ్యం నేర్చుకున్నాం. అయినది పూర్తిగా మాస్ క్యారెక్టర్, ప్రజా ఉద్యమాలు నిర్మించే ఆలోచన, అందుకే ఆయన జననేతగా ప్రజల హృదయాల్లో ఉన్నారు. నిత్యం ప్రజల్లో ఉండడం, తాను మరణించేంత వరకు ప్రజల్లోనే ఉన్నారు. కాసానిని అనేక రుగ్మతలు వెంటాడుతున్నప్పటికీ వాటిని తన శరీరంలోనే అనగ తొక్కుకుంటూ లక్ష్య సాధన కోసం పనిచేసిన గొప్ప ఉద్యమకారుడు. ప్రజల పక్షాన ఉంటూ ప్రజల కోసం ఆలోచన చేయడం ఆయన నుండి నేర్చుకున్నాను నేను.

ఆయన చివరి క్షణం వరకూ పోరాటం చేస్తూనే తుదిశ్వాస విడిచారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు విషయంలో సుజాతనగర్‌లోని ఏడు గ్రామ పంచాయతీలను కలిపేందుకు ప్రయత్నం చేసింది. దీనివలన గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురవుతారని, ఏడు గ్రామ పంచాయతీల విలీనాన్ని చేయవద్దని కాసాని పోరాటాన్ని ప్రారంభించారు. ఇటీవల జనవరి చివర నల్గొండలో జరిగిన సీపీఎం రాష్ట్ర మహాసభలకు జనవరి 24వ తేదీన మేము వెళ్లే సమయంలో మాకు చెప్పిన మాట " తెలంగాణ రాష్ట్ర సిపిఎం పార్టీ సహకారంతో రాష్ట్ర గవర్నర్ దగ్గర సమయం తీసుకుని రావాలని" ఏడు గ్రామ పంచాయతీలను కొత్తగూడెం కార్పొరేషన్‌లో విలీనం చేయకుండా రాష్ట్ర గవర్నర్ కి విన్నవించడానికి ప్రయత్నం చేసే దశలో ఆయన మాకు చివరగా కర్తవ్యాన్ని నిర్దేశించారు. కుటుంబ సమస్యలు ఎన్ని ఉన్నా.... ఆరోగ్య సమస్యలు ఆయనను వెంటాడుతున్నా...నిత్యం ప్రజల కోసం తాను కృషి చేశారు. వర్గ ఉద్యమాలు నిర్మించడంలో ఆయన దిట్ట. 1974లోనే ప్రధానంగా పీడిత, అనగారిన ప్రజల కోసం పోరాటాలు చేశారు. అందులో కీలకంగా కూలీ రేట్లు పెంచాలని, అగ్రవర్గం, భూస్వాముల ఆధిపత్యంపై పోరాటాలు చేయడంతో కాసాని ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆ పోరాటాల ఫలితంగానే ఆయనపై భౌతిక దాడులకు భూస్వాములు తెగపడ్డారు. అయినప్పటికీ చెక్కుచెదరని పోరాటాన్ని సాగించారు. ఆ క్రమంలో ప్రజలు ఆయనను రక్షించుకున్నారు. భౌతిక దాడుల నుండి కాసాని కాపాడు కున్నారు. కాసాని సాగించిన ఉద్యమ పోరాటాన్ని, ఆ వారసత్వాన్ని కొనసాగించడం నేటితరం నాయకులకు కీలకము....

కాసాని తన అభిప్రాయాలను సూటిగా, మొహమాటం లేకుండా నిర్మొహమాటంగా అభిప్రాయాలను స్పష్టంగా చెప్పేవారు. పార్టీ ముందు ఉంచేవారు. పార్టీ నియమాలకు కట్టుబడి ఉన్నారు. ఆయన జీవితం నేటి తరం నాయకులకు ఆదర్శం. భద్రాద్రి కొత్తగూడెం సీపీఎం జిల్లా మహాసభలు ముగిసిన తర్వాత సెక్రటేరియట్ సమావేశం ముగిసిన తొలిసారి సుజాతనగర్‌లోని కాసాని ఇంటికి వెళ్లి అయనని పరామర్శించాం. ఆయనతో మాట్లాడడం. అనేక విషయాల్లో కర్తవ్యం బోధన చేశారు.. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.. పార్టీని పెంచాలని, ప్రజా ఉద్యమాలు, పార్టీ అభివృద్ధి అనేది మీ ముందున్న సవాళ్లు అని నన్ను వెనుదట్టి చెప్పారు. పార్టీని ఐక్యంగా ఉంచడం, ప్రజా పోరాటాలు నిర్మించడంలో మీరు ముందు ఉంటారని నేను నమ్ముతున్నాను... అని చెబుతూ నాకు గురుతర బాధ్యతను నా మీద ఉంచారు కాసాని.

పోరాట యోధుడు కాసాని

(3వ పేజీ తరువాయి)

ప్రయత్నాలు చేయించారు జమీందారులు. అయినప్పటికీ వెనక అడుగువేయకుండా గుండే ధైర్యంతో, ప్రజల మధ్యన నిలబడి పోరాటాలు చేశారు. ఈ క్రమంలో సుజాతనగర్ పంచాయతీకి ఎన్నికలు వచ్చాయి.

రాజకీయ ప్రస్థానం

ఆనాడు జరిగిన ఎన్నికల్లో ప్రజాబంధు, పోరాట యోధుడు కాసాని అయిలయ్య తొలిసారిగా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆనాటి నుండి మొదలు 1980 నుండి 2000 సంవత్సరం వరకు సుమారు 20 సంవత్సరాల పాటు ఏకధాటిగా కాసాని అయిలయ్య సర్పంచ్‌గా ఎన్నికగావడం రాష్ట్రంలోనే చారిత్రక విషయంగా చెప్పవచ్చు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా..., ఎన్ని రాజకీయ పార్టీలు కుట్రలు, కుతంత్రాలు చేసినప్పటికీ అధికార పార్టీలను తలదన్నే విధంగా ప్రజలు సీపీఐ(ఎం) పక్షాన నిలబడ్డారు. ప్రజా మద్దతుతోటి కాసాని సర్పంచ్‌గా ప్రజా పాలన సాగించారు. ఆయన తర్వాత వరుసగా కున్సోత్ ధర్మా 5 సంవత్సరాలు, గండమాల భాస్కర్ మరో ఐదు సంవత్సరాలు, అనంతరం కాసాని భార్య కాసాని లక్ష్మి సర్పంచ్‌గా సేవలందిస్తూనే 2017 మే 4న మృతి చెందారు. అప్పటివరకు సుమారు 35 సంవత్సరాల పాటు సుజాతనగర్ సీపీఐ(ఎం) పంచాయతీగా చరిత్రలో నిలిచింది. దేశంలో పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో సీపీఐ(ఎం) ఎలా పాలించిన చరిత్రను సుజాతనగర్ పంచాయతీ ఆదే రికార్డు నెలకొల్పింది.

పోరాటాల బిడ్డ....

కాసాని పుట్టిందే పోరాటాల కోసం అన్నట్టుగా సాగింది అయినా జీవితం. సీపీఐ(ఎం) నుండి ఏ సమస్య తీసుకున్న అది ప్రజల కోసం ఉంటుందని నమ్మిన వ్యక్తి కాసాని. అందుకే కూలి రేట్ల పెంపు కోసం కూలి రేట్ల పోరాటం, ఇళ్ల స్థలాలు, భూ పోరాటాలు, పోడు భూముల పట్టాల కోసం ఇలా అనేక ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు. తునికాకు పోరాటానికి విశేష కృషి చేశారు. కొత్తగూడెంలో ఇళ్ల స్థలాల పోరాటం సాధించారు. పాత కొత్తగూడెంలో 2000లో 32 ఎకరాలు భూమిని ప్రభుత్వం రైతుల నుండి కొనుగోలు చేసి ఇవ్వాల్సిన పరిస్థితికి ఉద్యమం సాగిందంటే కేవలం కాసాని మడమతిప్పని పోరాటమే కారణం. రైతు నుంచి ప్రభుత్వం ఎకరాకు రూ.1లక్షా 10 వేలు చెల్లించి కొనుగోలు చేయడం ఆ రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. 2008లో కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని పాత కొత్తగూడెంలో ఇళ్ల స్థలాల కోసం జరిగిన పోరాటంలో ప్రభుత్వం ఎకరానికి రూ.8 లక్షలు చొప్పున రైతులకు చెల్లించి, రైతుల నుండి సుమారు 42 ఎకరాల భూమిని రైతుల నుండి కొనుగోలు చేసిన చరిత్ర ఉంది. ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా ప్రభుత్వం స్థలం కొనుగోలు చేసి, పేదలకు పంచిన చరిత్ర కాసాని పోరాటం ద్వారానే సాధ్యమైంది. ఈ ఇళ్ల స్థలాల పోరాటంలో సుమారు 1000 మంది పేదలకు ఇళ్ల స్థలాలు పొందారు. నేడు వారు సంతోషంగా ఉన్నారంటే కేవలం కాసాని మడమతిప్పని పోరాట ఫలితమే.

కాసాని పోరాటం 200 మందికి ఇల్ల స్థలాలు

ఇళ్లస్థలాల కోసం పాల్వంచ మండలంలో చేసిన ఉద్యమం ఫలితంగా మంచికంటి నగర్‌లో సుమారు 50 ఎకరాలలో వేలాది పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు దక్కాయి. కొత్తగూడెం మున్సిపల్ పరిధిలో ప్రగతినగర్‌లో చేసిన పోరాట ఫలితంగా 200 మంది పేదలకు ఇల్లు ఇళ్ల స్థలాలు అందాయి. పాత కొత్తగూడెంలో చేసిన పోరాటంతో మొదటి దశలో 980 మందికి ఫ్లాట్లు అందాయి. అనంతరం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల స్థలాల కోసం చేసిన పోరాటంలో సుమారు 3000 మందికి పట్టాలు పొందారు. సీతంపేట, సుజాతనగర్, రాఘవపురం, సింగభూపాలెం, అంజనాపురం తదితర ప్రాంతాలలో ఇళ్లస్థలాలు పోరాటం ద్వారా పేదవారికి ఇల్లు దక్కిన సందర్భాలు అనేకం ఉన్నాయి. పేదల పక్షాన నిలబడిన కాసాని ఐలయ్య ఉద్యమాలతో పాటు ఆమరణ నిరాహారదీక్షాలకు పూనుకున్నారు.

కేసులు పెట్టేందుకు కుట్రలు

పేదలకు ఇల్లు రావాలని, ఇళ్ల స్థలాలు కావాలని ప్రభుత్వం మెడలు వంచేందుకు ఐదు సార్లు ఆమరణ నిరాహార దీక్ష చేశారు. ఆయన మీద కుట్రలు చేసిన ప్రభుత్వం ల్యాండ్ గ్యాంబ్లింగ్ కేసు పెట్టింది. భూ ఆక్రమణ దారుడిగా ఆయనపై కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. పేదల కోసం ఆయన 13 రోజుల పాటు జైల్లో ఉన్నారు. అంతేకాకుండా ఆయనను తాగుబోతుగా చిత్రీకరించాలని కుట్రలు చేసింది. తప్పతాగి పోలీసుల మీద దురుసుగా ప్రవర్తించాడని కేసులు పెట్టేందుకు ఆయన తాగినట్టుగా ధృవీకరించాలని ప్రభుత్వ వైద్యులను సైతం ప్రలోభాలకు గురిచేసింది. ఈ క్రమంలో ఆనాటి ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శివశంకర్ శసేమిరా... తప్పుడు ధృవీకరణ పత్రాన్ని ఇచ్చేందుకు అంగీకరించలేదు. కాసాని ఐలయ్య లాంటి ఉద్యమకారుడి మీద అపవాదు మోపలేనని తేల్చి చెప్పిన సంఘటన ఉన్నాయి.

రూపాయకే మినరల్ వాటర్

కొత్తగూడెం-కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ పోరాటంలో సైతం ఆయన పాత్ర కనిపిస్తుంది. ఆయన సహచర ఉద్యమకారుడు కొదమసింహం పాండురంగాచార్యులు, ఇతర పార్టీ నాయకులతో కలిసి ఆయన కొవ్వూరు రైల్వేలైన్ కోసం నిరాహార దీక్షలో పాల్గొన్నారు. పోడు సాగుదారుల కోసం జూలూరుపాడు, రేగళ్ల ప్రాంతాలలో పోరాటం చేశారు. జైలుకు వెళ్లి వచ్చారు. కాసాని ఐలయ్య సర్పంచ్‌గా సుజాతనగర్‌లో సేవలు అందించిన కాలంలోనే ఒక్క రూపాయికి మినరల్ వాటర్ ప్రజలకు అందించాలనే సంకల్పంతో స్వచ్ఛంద సంస్థలతో మాట్లాడి సుజాతనగర్‌లో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన ప్రజావాది.

కాసానిమీద హత్యాప్రయత్నం

కాసాని మీద హత్యా ప్రయత్నం జరిగాయి. కాసాని చేస్తున్న పోరాటలో వల్ల భూస్వాములు ఆయనను హతమార్చేందుకు కుట్రలు చేశారు. కూలి రేట్లు పెరగాలని, ఇతర సమస్యల మీద ప్రజలతో మమేకమై తిమ్మారావుపేట బహిరంగ నిర్వహిస్తున్న సభలో ఆయన మీద హత్య ప్రయత్నం చేసేందుకు కుట్ర జరిగింది కానీ, దాని నుండి ప్రజలే ఆయనని కాపాడుకున్నారు. కాసాని ఆదర్శవాది అని చెప్పుకోవడానికి ఆయన ఇద్దరు సంతానానికి ఆదర్శ వివాహాలు చేసి ప్రజలకు ఆదర్శంగా నిలిచారు.

25న మృతి

జనవరి 25వ తేదీన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృతి చెందారు. ఆదివారం సుజాతనగర్‌లో సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. పలువురు హాజరుకానున్నారు.

మాస్ లీడర్‌గా గుర్తింపు తెచ్చుకున్న కాసాని

- **సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్**

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



పాత కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సీపీఐ(ఎం) పార్టీ ఉద్యమ నిర్మాణం, విస్తరణ కోసం ప్రజా సమస్యలపై పోరాటాలు చేపట్టేందుకు నిత్యం ప్రజల మధ్యనే కాసాని ఉండటం వల్లనే మాస్ లీడర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. వరంగల్ జిల్లా నుండి వలస వచ్చి ఆర్ఎంపీ వృత్తి చేసుకుంటున్న సందర్భంలో నాటి సీపీఐ(ఎం) అగ్రనేతగా ఉన్న ఓంకార్ స్ఫూర్తితో కూలీ, భూమి, వివక్షత, వేధింపులు వంటి ప్రజా సమస్యలను చాలా దగ్గరగా ఉండి చూడటం వల్ల పార్టీ ప్రజా ఉద్యమాల్లో పూర్తి కాలం పని చేయాలనే నిర్ణయం తీసుకున్నారు. కాసాని ఐదు దశాబ్దాల ఉద్యమ పయనంలో అనేక ఒడిదుడుకులను చూశారు. గ్రామాల్లోనే ప్రజల మధ్యనే ఉండి ప్రజలు పెట్టేది తింటూ ప్రజా సమస్యలపై ఉద్యమించేందుకు తగిన చైతన్యాన్ని తన మాట పాట ద్వారా తీసుకువచ్చారు. ఈ కృషిలో సహధర్మ చారిణి లక్ష్మి సహకారం మరువలేనిది. ఒక పక్క ఐలయ్య పాటలు పాడుతుంటే మరో పక్క లక్ష్మి కంజర కొట్టుకుంటూ గ్రామాలు తిరిగేవారు. ఆ సందర్భంలో నాటి భూస్వాములు, పెత్తందారులు వివిధ పార్టీల ముసుగులో కాసాని పైన హత్యాయత్నాలు కూడా చేశారు. ఇవి ఏవీ కూడా కాసానిలోని ధైర్యాన్ని తెగువని నీరుగార్చలేకపోయాయి. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పేదలకు ఇళ్ల స్థలాలు కావాలని కొత్తగూడెం పాల్వంచ పట్టణాలల్లో దశల వారీ పోరాటాలను రూపకల్పన చేసి అందుకోసం నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాల ముట్టడీలు నిర్వహించి అనేక సందర్భాల్లో పోలీస్ అక్రమ కేసులు, అక్రమ అరెస్టులకు గురై సెంట్రల్ జైలుకి కూడా పోయి వచ్చారు. తనకు ఉన్న మార్క్సిస్టు పరిజ్ఞానంతో రాజకీయ ఉపన్యాసాలు చేయడం వారి ప్రత్యేకతగా చెప్పుకోవాలి. రైతు సంఘం నాయకుడిగా గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర జిల్లా నాయకుడుగా ఆయా తరగతుల సమస్యలపై జాతాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేశారు. అనేక ప్రజా సంఘాలకు కావల్సిన అన్ని రకాల సహాయ సహకారాలను అందించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విభజన అయిన సందర్భంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీపీఐ(ఎం) మొదటి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సమయంలో ఫారెస్ట్ అధికారులతో గత ప్రభుత్వం తీవ్రమైన నిర్బంధం ప్రయోగం చేసినప్పుడు రాష్ట్రానికే ఆదర్శప్రాయంగా భారీ పోడుసాగుదారుల సమీకరణ చేసి కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం జరిగింది. సుజాతనగర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా సీపీఐ(ఎం) పార్టీ 32 సంవత్సరాల పాలన చేయగా కాసాని 22 సంవత్సరాల కాలం సర్పంచ్‌గా పని చేసి గ్రామ పంచాయతీకి వచ్చే నిధుల వినియోగం కోసం అభివృద్ధి కమిటీలు వేసి వాటి ద్వారానే నిధులను ఖర్చు చేశారు. కాసాని శాసన సభ్యులు, సర్పంచ్‌గా పోటీ చేసినప్పుడు ఓటు, నోటు అని ప్రజల దగ్గరకు వెళ్ళి చందాలు వసూళ్ళ చేసి ఆ డబ్బుతోనే ఎన్నికలలో ఖర్చు చేశారే తప్ప మరే ఇతర పద్ధతులకు పాల్పడలేదు. వ్యక్తిగతంగా శరీరంలో అనేక జబ్బులు, భంకరమైన కరోనా వచ్చినా ప్రమాదకరమైన క్యాన్సర్ వచ్చినా దీర్ఘకాలంగా మధుమేహం బీపీ వంటివి ఉన్నా కాసాని విల్ పవర్ ఆయన్ను నిలబెట్టగలిగింది. కాసానికున్న అనేక జబ్బుల కారణంగా పూర్తి విశ్రాంతిలో ఉండాలని పార్టీ నిర్ణయం చేసినా ప్రజల మధ్య ఉంటేనే నా ఆరోగ్యం క్షేణించదు. ప్రజల మధ్య లేకపోతే త్వరగా క్షీణిస్తుందని చెప్పి వారు. చనిపోవడానికి ఐదు రోజుల ముందు వరకు కొత్తగూడెం కార్పొరేషన్‌లో ఉమ్మడి సుజాత నగర్ గ్రామ పంచాయతీని విలీనం ప్రతిపాదనకి వ్యతిరేఖంగా విస్తృతంగా గ్రామాల పర్యటనలు, జీప్ జాతా, కలెక్టరేట్ ధర్నా వంటి కార్యక్రమాలకు నాయకత్వ వహించారు. రేపు చనిపోతారనగా కూడా పార్టీ రాష్ట్ర మహసభల ప్రచారంలో భాగంగా రెడ్ బేలున్స్ ఎగురవేశారు. పాత కొత్తగూడెం నియోజక వర్గ పరిధిలో వ్యవసాయ కూలీ పోరాటాలు, రైతు సమస్యలపై పోరాటాలు, కార్మిక పోరాటాలు, ఇళ్ల స్థలాల పోరాటాలుకి నాయకత్వం వహించిన కామ్రేడ్ కాసానికి నివాళులు అర్పించడమంటే నిత్యం ప్రజల మధ్య ఉండి ప్రజా పోరాటాలు నిర్మించడమే తప్ప మరొకటి కాదు.



ప్రజా పోరాటాల విప్లవ స్ఫూర్తి కాసాని

- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య**

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఎంత కష్టం వచ్చినా చివరి శ్వాస విడిచే వరకు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఒకే పార్టీలో మనుడసాగించడం అనేది నేటి స్వార్ధ రాజకీయ, వినిమయ ఆర్ధిక సంస్కృతిలో అరుదైన విషయం. అయినప్పటికీ నమ్మిన సిద్ధాంతాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి రాజకీయ వ్యూహ ప్రతి వ్యూహాలను, వ్యక్తి గత కష్టాలను అధిగమించి, అనారోగ్యంతో బాధపడుతూ, చనిపోవడానికి 24 గంటలు ముందు సైతం పార్టీ రాష్ట్ర మహాసభలు విజయవంతానికి ఆనందంతో బెలూన్‌లు ఎగురవేసిన ప్రత్యక్ష ప్రజా పోరాటాల విప్లవ స్ఫూర్తి కాసాని ఐలయ్య అని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య అన్నారు. ఈ నెల తొమ్మిదిన జరుగుతున్న ఐలయ్య సంస్మరణ సభ జరుగుతున్న సందర్భంగా పార్టీ పరంగా, వ్యక్తిగతంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని, వారితో పెనవేసుకున్న కొన్ని జ్ఞాపకాలను పుల్లయ్య నవతెలంగాణతో పంచుకున్నారు. 1989లో నేను పార్టీలో చేరినప్పటి నుండి ఐలయ్య నీతివంతమైన వ్యక్తిత్వం, నిజాయితీతో కూడిన రాజకీయ కార్యాచరణ తనకు స్ఫూర్తి నిచ్చాయి అన్నారు. ఆయన సుజాత నగర్ సర్పంచ్‌గా, వామపక్ష రాజకీయ వ్యవహారాలు అమలు చేసిన తీరు నేను సర్పంచ్ విధులు నిర్వహించడంలో తోడ్పడ్డాయని గుర్తు చేసారు. తాను జిల్లా కార్యదర్శిగా పని చేసిన కాలంలోనే, నేను డివిజన్ కార్యదర్శిగా పనిచేయడంతో ఆయన ఆదర్శవంతమైన, నిష్పక్షపాత వైఖరిని నా రాజకీయ ఎదుగుదలకు కారణ భూతమైనదని అన్నారు. తాను, తన భార్య లక్ష్మీ సైతం పార్టీకి అంకితం అయి పని చేయడం ఆదర్శనీయ మైన వ్యక్తిత్వానికి నిజరూపం అన్నారు. అనారోగ్యంతో ఉండి కూడా సీతారామ ప్రాజెక్ట్ పనులు వేగవంతానికి, నిర్మాణంలో నాణ్యతా లేమిని బహిర్గతం చేయడానికి ఆలోచించే వారని తెలిపారు. నిత్యం ప్రజల్లో ఉంటేనే పార్టీ విస్తరణ సాధ్యం అని నిరూపించిన ఆదర్శ మార్క్సిస్టు దంపతులు ఐలయ్య-లక్ష్మిలు, వీరు భవిష్యత్తు తరం పార్టీ శ్రేణులకు ఆదర్శప్రాయులుగా పార్టీ చరిత్రలో నిలిచిపోతారని అన్నారు.

మంచికంటి నగర్ నిర్మాణంలో కాసాని కీలక పాత్ర



నవతెలంగాణ-పాల్వంచ

సీపీఐ(ఎం) పోరాట ఫలితంగా పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని మంచిగనగర్ ఏర్పడింది. డివిజన్ నాయకులుగా ఉన్న కాసాని ఐలయ్య నిరుపేదలకు ఇన్ని స్థలాల కోసం పరితపించిన ఆయన మంచిగంటి నగర్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచలో నిరుపేదలు ఎక్కువగా కూలీ పని చేసుకుని బతుకే పేదలు ఉన్నారని, వారందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వడం కోసం కార్యచరణ రూపొందించి స్థానిక నాయకత్వంతో ఎప్పటికప్పుడు చర్చించి ఇండ్లస్థలాల పోరాట కమిటీ ద్వారా ఆయన దిశా నిర్దేశంతో నిరుపేదలందరినీ కలుపుకొని అనేకసార్లు పోరాటాలు నిర్వహించారు. ఆయన ప్రసంగానికి వాగ్ధాటికి పేదలు ఒకటిగా కదిలి వచ్చారు. ఇళ్ల స్థలాల పోరాట బహిరంగ సభలలో ఆయన ప్రసంగతీరు ప్రజలను ఆకట్టుకుంది. అధికారులు ఎన్ని నిర్బంధాలు పెట్టినా పోరాటం ఆగేది లేదని ప్రజలకు ధైర్యాన్నిచ్చారు. పాల్వంచ పట్టణం పారిశ్రామికంగా కేటీపీఎస్, ఎనిఎండీసీ నవభారత్ కర్మగారాలతో అభివృద్ధి చెందిన ప్రాంతం ఈ అభివృద్ధితో పాటు గ్రామీణ ప్రాంతాల నుండి జీవనోపాధి కోసం వలసలు విపరీతంగా పెరిగాయి.మున్సిపాలిటీలో నివసించేవారు ఇల్లు లేక చాలిచాలని ఇరుకు గదులు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు. ఈ సమస్యను గుర్తించిన సీపీఐ(ఎం) డివిజన్ స్థానిక నాయకత్వం అనేక సార్లు సర్వే నిర్వహించి ఇళ్ల స్థలాలు ఇల్లు లేని ప్రజలకు గుర్తించి దీంతో పార్టీ పేదలకు అందించాలని 2001లో పోరాటం ప్రారంభించింది. ఈ పోరాటంలో కాసాని ఐలయ్య ముందుండి నడిపించారు. దశలవారీగా ఈ పోరాటాన్ని ఉధృతం చేయించి ఆనాడు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ అనేక నిర్బంధాలను ఉపయోగించి పోలీసులు అనేక కేసులు నాయకులపై పెట్టింది. అయినప్పటికీ పార్టీ ఆధ్వర్యంలో పేదలు దేనికి భయపడక మరింత ముందుకు దూసుకెళ్లి 2003లో 444 సర్వే నెంబర్లు భూములను వేలాది మందితో ఆక్రమించి గుడిసెలు వేయించింది. నివాసం ఉండేలా చూసింది. ఆ ప్రాంతానికి ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు తన యావజాతిని నిరుపేదలకు దార దత్తం చేసిన త్యాగశీలి కామ్రేడ్ మంచికంటి రామకృష్ణారావు పేరుతో మంచిగంటి నగర్‌గా నామకరణ చేశారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో మంచిగంటి నగర్ వాసులపై మళ్ళీ నిర్బంధం ప్రారంభించింది. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే ఎన్నికైన ప్రజాప్రతినిధులు వారికి కనీస అవసరాలు అనే కరెంటు, మంచినీళ్లు లేకుండా ప్రభుత్వ నుండి ఏమి రాకుండా అనేక రకాల ఇబ్బందులు పెట్టారు. అయినప్పటికీ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు పెనుమల్ల మధు నిధుల నుండి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు కోసం కాసాని కృషి చేశారు. దీన్ని ప్రారంభించడానికి అనేక అడ్డంకులు కల్పించారు. అయినప్పటికీ కూడా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు.



ఇదే క్రమంలో మంచి కఠి నగర్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అనేకసార్లు ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. అప్పుడు కూడా పార్టీ నాయకులు అనేక నిర్బంధాలు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ కాసాని ఐలయ్య ఎక్కడ తగ్గకుండా 2006లో రెండవ దశ ఇళ్లస్థల పోరాటం ప్రారంబి ంచారు. పేదలందరికీ ఇవ్వాలని రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు పాల్వంచలో పోరాటం ప్రారంభమైంది. ఈ పోరాటాన్ని విక్షణం చేయడానికి కాంగ్రెస్ ప్రజా ప్రతినిధి ఆయన కుమారుడు అనేక ప్రయత్నాలు రెవిన్యూ అధికారుల ద్వారా చేయడం నాయకత్వాన్ని బెదిరించడం చేశారు. అయినా దీనికి భయపడకుండా కబ్జా చేసిన భూములను పేదలకు పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులపై కాసాని తీవ్రమైన ఒత్తిడి ఉద్యమం ద్వారా తీసుకొచ్చారు. సీపీఐ(ఎం) పట్టణం మండల కమిటీ ఆధ్వర్యంలో దీక్ష కూడా చేపట్టారు. ఈ క్రమంలో అనివార్య పరిస్థితుల్లో ప్రభుత్వం దిగివచ్చి పేదలకు 2000 మందికి ఇండ్ల స్థలాలు, పట్టాలను అందజేసింది. తద్వారా మంచిగంటి నగర్, సుందరయ్య నగర్, సోనియా నగర్లు ఏర్పడ్డాయి. పేర్లు ఏమైనాప్పటికీ కూడా సీపీఐ(ఎం) పోరాటల వల్లే పేదవాడికి సొంత ఇంటి కళా సహకారం అయింది. అక్కడ ప్రస్తుతం నివసిస్తున్న ఏ గోడను తట్టిన చెప్తాయి కాసాని ఐలయ్య చేసిన కృషి ఆ ప్రాంతవాసులు ఎవరు మరువలేరు.

పోడుభూమి, కూలి రేట్ల కోసం పోరాటం చేసిన కాసాని

- సీపీఐ(ఎం) జూలూరుపాడు మండల కార్యదర్శి యాసా నరేష్

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్



జూలూరుపాడు మండలంలో గ్రామ గ్రామాన సీపీఐ(ఎం) విస్తరణకు కాసాని ఐలయ్య ఎనలేని కృషి చేసిన నాయకుడు. ఈ ప్రాంతంలో వలస కూలీల జీవితాల్లో వెలుగు నింపడం కోసం పార్టీ నాయకత్వన్న కాసాని నేతృత్వంలో పోడు భూముల పోరాటం 1988, 1995 కాలంలోనే కొనసాగించారు. జూలూరుపాడు మండలంలో కూలీలకు ఇస్తున్న చోప్పకట్టలో నూటికి పది సొప్ప కట్టలు ఇవ్వాలని వ్యవసాయ కూలీలతో పోరాటాన్ని నిర్వహించారు.

1999-2000 కాలంలో అప్పుల బాధ తట్టుకోలేక జూలూరుపాడు పరిసర ప్రాంతాల్లో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటూ ఉంటే రైతుల కండగా పార్టీ నేతృత్వంలో అప్పులను మాఫీ చేయించడానికి పోరాటం నిర్వహించి అప్పులు మాఫీ చేయించిన ఘనత కామ్రేడ్ కాసానిధి. సూరారం, వినోబా నగర్, రామచంద్రపురం, గుండెపుడి, పాపకొల్లు, రాజారావు పేట, బేతలపాడు, గుండ్లరేవు తదితర గ్రామాల్లో పోడు భూముల పోరాటాలు నిర్వహించి భూమి సాగు చేయించి వ్యవసాయ కూలీలకే పోడు భూములు పంచి ఇచ్చిన నేత. జూలూరుపాడు మండలంలో ఒంటరిగా ఎంపీపీ, జడ్పిటిసి అత్యధిక పంచాయతీలు గెలుచుకునే దానికోసం రాజి లేని కృషి చేసిన నేత కాసాని. తన తుది శ్వాస విడిచే వరకు జూలూరుపాడు మండలంలో పార్టీని పట్టిష్టపరిచే దాని కోసం పార్టీని తిరిగి పూర్వ వైభవం తీసుకొచ్చేదానికోసం ఎనలేని కృషి చేశారు. పార్టీ జూలూరుపాడు మండల పక్షాన జోహార్లు అర్పిస్తా ఉంది.

ప్రజలలో తిరగకపోతే చచ్చిపోతాను

- గొప్ప ధైర్య శాలి కామ్రేడ్ ఐలయ్య
- న్యాయవాది జలసూత్రం శివరాం ప్రసాద్

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్



కాసాని ఐలయ్య చివరి రోజులలో చెప్పిన మాటలు నాకు నిత్యం గుర్తుకు వస్తాయి. ఆరోగ్య సమస్యల రీత్యా బయట తిరగవద్దని డాక్టర్లు చెప్పిన ప్రకారం పార్టీ ఆఫీసులో కూర్చుని సూచనలు, సలహాలు ఇవ్వండి అని నేను అంటే తిరగకపోతే నేను చచ్చి పోతాను అని చెప్పిన గొప్ప ధైర్య శాలి కామ్రెడ్ ఐలయ్య. కాసాని ఐలయ్య గొప్ప పోరాట యోధుడు. ఆయన జీవితమంతా పోరాటాల మయం. గత అయిదు సంవత్సరాలుగా అనారోగ్యంపై కూడా ఆయన పోరాటం చేస్తూనే వున్నారు. ఆ సమయంలో కూడా ప్రజల సమస్యలపై నిత్యం పోరాటం చేసిన గొప్ప విప్లవకారుడు ఐలయ్య. ఆరోగ్య పరంగా ఎంతో ఇబ్బంది పడుతున్నా చివరి వరకు ప్రజల కోసం పరితపించిన గొప్ప కమ్యూనిస్ట్ ఐలయ్య. కొత్తగూడెం ప్రాంతంలో పార్టీ ఉద్యమ నిర్మాతలలో ఒకరు. కొత్తగూడెం డివిజన్‌లో ప్రజలలో మమేకమవటంలో నాకు తెలిసి బరపటి సీతారాములు, కాసాని ఐలయ్య ఒకరికి ఒకరు తీసిపోని వ్యక్తులు. ప్రజల మధ్యనే జీవించటం, ప్రజల కోసం జీవించటం ఐలయ్యకున్న గొప్ప లక్షణం. గొప్ప మాస్ లీడర్‌గా గుర్తింపు పొందిన ఐలయ్య ఉమ్మడి సుజాతనగర్ సర్పంచ్‌గా సుమారు 20 సంవత్సరాలు పనిచేశారు. అంటే ఆయనను ఆ గ్రామ ప్రజానీకం ఎంత అభిమానించారో అర్థం చేసుకోవచ్చు. ఆరోగ్యం దెబ్బ తిన్న తర్వాత కూడా డాక్టర్లు తిరగవద్దని వారించినా వినకుండా నాలుగేళ్ల క్రితం రైతుల నుండి వరి ధాన్యం కొనుగోలు సందర్భంగా 10 నుండి 15 కేజీలు తరుగు పేరుతో వ్యాపారులు, మిల్లర్లు దోచుకున్న సందర్భంలో ఆ సమస్యను రైతు సంఘం తరపున లేవనేత్తి విచారణ జరిపేలా కలెక్టర్ నిర్ణయం తీసుకునేలా చేసిన పోరాటశీలి ఐలయ్య. అయినా రైతులకు న్యాయం జరగటం లేదని నా దగ్గరకు వచ్చి లోకాయుక్తలో కేసు తయారు చేయించి వేసిందాకా నిద్రపోలేదు. అదే విధంగా సుజాతనగర్ ఏడు గ్రామపంచాయతీలను కొత్తగూడెం కార్పొరేషన్‌లో కలపటాన్ని వ్యతిరేకిస్తూ సుజాతనగర్ మండలంలోని ప్రతి గ్రామాన్ని, తండాలని చుట్టేసి ప్రచారం చేసిన పోరాట యోధుడు కామ్రేడ్ కాసాని. కలెక్టరేట్ ఎదుట ధర్నాలో కూడా రెండు గంటల పాటు ఎండలోనే పాల్గొన్న పట్టుదల కలిగిన వ్యక్తి కామ్రేడ్ కాసాని ఐలయ్య. నెల రోజులు రాత్రి, పగలు తేడా లేకుండా నిత్యం నా వెంటపడి కార్పొరేషన్‌లో కలపటం వలన కలిగే నష్టాలపై కరపత్రం రాసిందాకా నిద్రపోలేదు. చనిపోయే చివరి క్షణం వరకు ప్రజల మధ్య ఉండి చనిపోయిన ఐలయ్య అమర జీవి. బతికుండంగా జీవితం మొత్తం ఉద్యమానికి, ప్రజలకు అంకితం చేయటమే కాకుండా మరణానంతరం కూడా తన శరీరాన్ని కూడా వైద్య విద్యార్థుల పరిశోధనలకు ఇవ్వటం ద్వారా కామ్రేడ్ ఐలయ్య ఆదర్శప్రాయంగా నిలిచారు. ఐలయ్య లాగా ప్రజల కోసమే బతకటం, ప్రజల మధ్య జీవించటం ద్వారా ఆయన దేనికోసమైతే తన జీవిత పర్యంతం పోరాడారో ఆ ఆశయాల సాధన కోసం పోరాడటమే ఆయనకు ఇచ్చే ఘన నివాళి. జోహార్ కామ్రేడ్ ఐలయ్య జోహార్ జోహార్.

నా మిత్రుడికి కన్నీటి వీడ్కోలు...

• అనుముల కొమరారెడ్డి

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్




కాసాని ఐలయ్య గురించి చెప్పాలి అంటే ఒక్క ముక్కలో మాటలు సరిపోవు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి ఒకే ఒక సీపీఐ(ఎం) ఎమ్మెల్యేగా ఓంకార్ ఉన్నారు. ఆయన శిష్యుడే కాసాని ఐలయ్య. కొత్తగూడెం మండలం, సీతంపేట పంచాయతీ, రెడ్డిపాలెం రావడం రెడ్డి పాలెంలో ఐలయ్య నేను కలిసి వ్యవసాయం ప్రారంభించాం. ఐలయ్య ఆర్ఎంపీగా ఊరూరు తిరిగి ఇంజక్షన్లు, పేద ప్రజలకు ఫ్రీగా వేసి మందు గోలీలు ఇచ్చేవాడు. ప్రజలకు సేవ చేస్తూనే కొంతకాలం గడిచిన తర్వాత తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న కొంతమంది ఉద్యమకారులని గుర్తించి ఒక దగ్గరకు చేర్చి వారి ద్వారా 1975-76 ప్రాంతంలో వ్యవసాయ కూలీ రేటు కోసం పోరాటం ప్రారంభించారు. అప్పుడు ఒక్క రూపాయి 50 పైసలు ఒకరోజు పని దినంగా వ్యవసాయ కార్మికునికి రైతులు ఇవ్వడం జరిగింది. ఈ వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ఐలయ్య ముందుకు వచ్చి తన వ్యవసాయ భూమిలో పనిచేసే కార్మికులకి రూ.2.50 పైసలు ఇచ్చి ఆదర్శంగా నిలిచాడు. కచ్చితంగా ఇదే విధంగా మిగతా రైతులను కూడా ఇవ్వవలసిందిగా ఆయన చెప్పారు. వ్యవసాయ కూలీలను సమీకరించి పోరాటం ప్రారంభించిన తర్వాత కొంత మంది రైతులు ఎదురు తిరిగి దాడి చేయడం ఇబ్బందులు గురి చేయడం జరిగింది. అయినా వెనుకడుగు వేయకుండా వ్యవసాయ కార్మికులని కూడగట్టి వ్యవసాయ కూలీరేటు పెంచాలంటూ మొట్టమొదటి పోరాటం రెడ్డిపాలెంలో ప్రారంభమైంది. ఇది మిగిలిన గ్రామాలకు వెళ్లి ప్రచారం చేసి అదే విధంగా పోరాటాలు చేశారు. సుజాతనగర్, ఏన్కూరు, జూలూరుపాడు, కేంద్రాలుగా విస్తరించి ఈ ఉద్యమం ఒక దళంగా ఏర్పడి 8 మంది సభ్యులతో సైకిలపై అద్దె సైకిళ్లు సుజాతనగర్‌లో తీసుకొని గ్రామ గ్రామాన ప్రచారం చేసి ప్రజలను చైతన్యవంతం చేశారు. ఉద్యమ సహచరులు వాంకుడోత్ లింగ, లావుడ్య భాష, అనుముల కొమరారెడ్డి, గుగులోత్ హరిలాల్, లావుడ్యాలాల్, గూగులోత్ బీలు, లావుడ్యా బిక్యా, కాసాని ఐలయ్య కలిసి గ్రామ గ్రామాన తిరిగి కూలిపోరాటాలు ప్రచారం చేసి పోరాటం చేయడం జరిగింది.

ఐలయ్యతో నాకున్న ఉద్యమ అనుబంధం విడదీయలేనిది

• సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



కామ్రేడ్ కాసాని ఐలయ్య ఉమ్మడి ఖమ్మం జిల్లాగా ఉన్నప్పుడు రైతు సంఘం బాధ్యతలు చూసే సందర్భంలో నేను భద్రాచలం డివిజన్ రైతు సంఘం కార్యదర్శిగా పనిచేశాను. ఆ విధంగా మా ఇద్దరి మధ్య ఉద్యమ స్నేహం ఏర్పడింది. రైతు సంఘంలో అనేక పోరాటాలు భద్రాచలం కేంద్రంగా నిర్వహించే సందర్భాలలో ఐలయ్య కచ్చితంగా పాల్గొని పోరాటాలు విజయవంతం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. అనంతరం జిల్లా విభజన సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొదటి కార్యదర్శిగా ఎన్నికైన ఐలయ్య భద్రాచలం నియోజకవర్గంలో జరిగే పోరాటాలలో పాల్గొంటూ ఇక్కడి సమస్యలపై పూర్తి అవగాహనతో మాట్లాడుతూ మమ్మల్ని ఆశ్చర్యపరిచారు. చాలా సాదాసీదా జీవితం గడిపిన ఐలయ్య ప్రజా పక్షాన అధికారులతో మాట్లాడే సందర్భంలో మాత్రం ముక్కుసూటిగా మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడేవారు. ముఖ్యంగా సుజాతనగర్, కొత్తగూడెం, పాల్వంచ, జూలూరుపాడు ప్రాంతాలలో జరిగిన అనేక ఇండ్లస్థలాల పోరాటాలకు నాయకత్వం వహించిన ఐలయ్య ఎంతోమంది నిరుపేదలకు ఇంటి జాగాలను సాధించి పెట్టారు. అంతేకాకుండా సింగరేణి ఉద్యోగుల సమస్యలపై ముఖ్యంగా కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాలు పోరాటాలలో భాగస్వామ్యమైన ఐలయ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించారు. వృత్తిదారుల సంఘంతో పాటు గొర్రె, మేకల పెంపకదారుల సంఘాన్ని రాష్ట్ర, జిల్లా స్థాయిలో నిర్మించి వారి ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాల నిర్వహించారు. ఆ సంఘం ఆధ్వర్యంలో ఎంతోమంది గొల్ల కురుమలకు ప్రభుత్వ గొర్రెల పథకాన్ని అందేలాగా కృషి చేయడంలో ఐలయ్య కృషి మరువలేనిది. ప్రజా సమస్యలపై అధికారులతో ఏ విధంగా అయితే ముక్కుసూటితనంగా వ్యవహరిస్తారో పార్టీ నిర్మాణ విషయంలో కూడా అంతే కచ్చితంగా ఐలయ్య కడవరకు పనిచేశారు. ఒక సందర్భంలో కరోనా సమయంలో సున్నం రాజయ్య అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆయన్ని పరామర్శించేందుకు వెళ్లే ముఖ్య టీంలో ఐలయ్య కూడా ఉన్న సందర్భంలో ఐలయ్యకున్న అనారోగ్య సమస్యల నేపథ్యంలో ఈ పరిస్థితులలో రాజయ్య వద్దకు మీరు రాకూడదని నాయకత్వం సూచిస్తే మా అందరి ముందు సరే అని మేము రాజయ్యని చూడటానికి వెళ్లే లోపే ఐలయ్య రాజయ్య అత్తి సమీపంలో కూర్చొని తన ఆరోగ్య విషయాలను చర్చిస్తూ కనిపించారు. సుదీర్ఘకాలం సుజాతనగర్ పంచాయతీ సర్పంచ్‌గా పనిచేసిన ఐలయ్య ఏ చిన్న అవినీతి ఆరోపణలు కూడా ఎదుర్కోకుండా నిస్వార్థ నిజాయితీ పాలన అందించారు. తన తర్వాత తన భార్య సైతం భర్త అడుగుజాడల్లో నడుస్తూ ఎన్నికల సందర్భంలో ప్రజల వద్ద నుండే విరాళాలు సేకరించి ఎన్నికల్లో ఖర్చు రాజకీయాలలో మార్క్సిస్టు పార్టీ కార్యకర్తల నిజాయితీని తెలియజేశారు.

బూర్జువ రాజకీయ పార్టీలు ఎన్ని ప్రలోభాలు సృష్టించినా, ఎన్ని నిర్బంధాలు కల్పించినా అదరకుండా, బెదరకుండా కడవరకు ఎర్రజెండాను వెళ్ళకుండా నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ చనిపోయే ఒక రోజు ముందు కూడా పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న ఐలయ్యతో కలిసి పని చేయటం నా రాజకీయ జీవితంలో మరువలేని ఘట్టంగా నిలుస్తుంది.

ఐలయ్యకు ఆకర్షితుడిని అయి ఉద్యమాలకు వచ్చా

• సీపీఐ(ఎం) సుజాతనగర్ మండల కార్యదర్శి వర్గ సభ్యులు నర్ర శివరామకృష్ణ

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్



1980 నుండి కాసాని ఐలయ్య నాకు పరిచయం. భూస్వామ్య ఉద్యమంలో నన్ను గుర్తించి ఉద్యమంలోకి తీసుకొచ్చారు. మాది కమ్యూనిస్టు కుటుంబం కావడంతో ఆయనకు ఆకర్షితిని అయ్యాను. పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్‌గా గెలిపించడం కోసం కృషి చేశాము. తర్వాత హమాలి ఉద్యమం, ఇళ్లస్థలాల పోరాటం కాసానితో కలిసి ముందుండి నడిచాము. సుజాతనగర్, రాఘవపురం, సీతంపేట, సింగభూపాలెం, పాత అంజనాపురంలో ఆయనతో కలిసి ఇళ్ల స్థలాలు పోరాటంలో పాల్గొన్నాను. నాకు ఆయనతో సంబంధం తాత మనవడి సంబంధం. నన్ను మనవడు అని పిలిచేవాడు. నేను తాత అని పిలిచేవాడిని. అంతా అనుబంధం ఉండేది. మా మధ్య ఆయన కోసం నేను మా సొంత ఊరు నరసింహసాగర్ అమ్మనాన్నను విడిచి వచ్చి ఆయన కోసం సుజాతనగర్‌లో నివాసం ఏర్పరచుకున్నాను. సుజాతనగర్ అయినా అక్కడ అమ్మాయిని వివాహం చేసుకొని ఇక్కడే ఉండిపోయాను. ఇల్లు కొనుక్కున్నాను. ఆయన ప్రోద్బలంతోనే పొలిటికల్ గాను పార్టీ పరంగా గాను అభివృద్ధి చెందాను. ఆయనే నాకు ఆదర్శం. కాసాని ఐలయ్య అడుగుజాడలో నడిచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఇదే నేను ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని కాసాని ఐలయ్యకు విప్లవ జోహార్లు.



తమ్మినేని, పోతినేనితో కాసాని ఐలయ్య (ఫైల్)

సమాజం కోసం జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి కాసాని

• ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ మక్కాడ్

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్



వరంగల్ జిల్లాకు చెందిన కాసాని అయిలయ్య తొలుత టెలిఫోన్ డిపార్ట్మెంట్‌లో కాంట్రాక్టు పద్ధతిన పని చేశారు. సీపీఐ(ఎం) కార్యక్రమాలకు ఆకర్షితుడై, సుజాతనగర్ ప్రాంతంలో గ్రామీణ వైద్యునిగా ఉంటూ ఈ ప్రాంతంలో వ్యవసాయ కార్మిక ఉద్యమానికి అంకురార్పణ చేశారు. భూస్వామ్య శక్తుల దాడుల నుండి అనేక సార్లు చాక చక్యంగా, ప్రజల సహకారంతో తప్పించుకున్నారు. ఆయనకున్న ప్రజా పునాది అటువంటిది. రైతు ఉద్యమానికి నాయకత్వం వహించారు. పార్టీ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. చాలా కాలం సుజాతనగర్ సర్పంచ్‌గా నిజాయితీతో గ్రామాన్ని అభివృద్ధి చేశారు. ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు సాధించారు. ఒక సారి మండల ప్రజా పరిషత్‌కు మరో సారి కొత్తగూడెం శాసన సభకు సీపీఐ(ఎం) అభ్యర్థిగా పోటీ చేశారు. జీవితం మొత్తం ప్రజలకు అంకితం చేసి ధన్యజీవి అయ్యారు. ఈ ప్రయాణంలో ఆయన సహచరి కామ్రేడ్ లక్ష్మీ సహకారం విలువ కట్టలేనిది. ఆయన అనుసరించిన రాజకీయ, జీవన, నైతిక మార్గాల్లో ఏ ఒక్కటి మనం ఆచరించినా, ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుంది. జోహార్ కామ్రేడ్ కాసాని అయిలయ్య.

కామ్రేడ్ కాసాని జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం



- **సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య**

నవతెలంగాణ-కొత్తగూడెం

ప్రజా నేత కామ్రేడ్ కాసాని అయిలయ్య గారి మరణం ఆయనతో అనుబంధం ఉన్న వారందరి హృదయాలను పిండేసింది. నమ్మినవారిని చివరిదాకా ప్రేమించే విశాల మనస్తత్వం ఆయనది. కామ్రేడ్ కాసానితో నా పరిచయం, సహచర్యం 35 సంవత్సరాలు ఇందులో కామ్రేడ్ కాసానిని చాలా దగ్గర నుంచి చూసి ఆయన మార్గదర్శకత్వంలో పని చేసిన ఎక్కువ. 1990 సంవత్సరంలో ములకలపల్లి మండలంలో పార్టీ చాలా బలహీనంగా ఉండేది. పార్టీలో ఒక నిర్మాణం సమస్య వచ్చింది. మనం బలంగా ఉన్న గీత కార్మిక కుటుంబాలను విడదీసి పోటీగా సీపీఐ సంఘం అక్కడ ప్రమోట్ చేసే ప్రయత్నం సిపిఐ నాయకత్వం చేసింది. ఈ సందర్భంగా కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులుగా ఉన్న కామ్రేడ్ కాసాని ఐలయ్య, బరపాటి సీతారాములు ఇద్దరు శాఖ సమావేశానికి హాజరై పార్టీని రక్షించుకునేందుకు మనం కూడా మన కల్లుగీత కార్మిక సంఘం నిర్మాణం చేపట్టి విచ్చినాన్ని ప్రతిఘటించాలని నిర్ణయించారు. మహాసభ జరపటం, సంఘ నిర్మాణ బాధ్యతలు నేనేచూడాలని నాకు అప్పగించారు. సంఘంలో పనిచేసే విషయంలో నాకు భిన్నమైన అభిప్రాయం వున్నా పార్టీ నాయకత్వంపై ఉన్న గౌరవం, పార్టీ శ్రేయస్సు దృశ్య ఆనాడు నేను అంగీకరించాను. నేను హాజరైన మొదటి పార్టీ మహాసభలో ఉమ్మడి కొత్తగూడెం డివిజన్ రెండుగా విడిపోయింది. కొత్తగూడెం డివిజన్‌కి కాసాని ఐలయ్య కార్యదర్శిగా ఎన్నికయ్యారు. నేను గీత కార్మిక సంఘం జిల్లా బాధ్యతల్లో ఉన్న సందర్భంలో డివిజన్లో గీత కార్మిక ఉద్యమ నిర్మాణంకు కాసాని మంచి సహకారం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మార్కం లింగయ్యను కోరి ఖమ్మం నుంచి తెచ్చి డివిజన్లో సంఘ నిర్మాణంకు ప్రత్యేక చొరవ చూపారు. ప్రజాసంఘాలను నిర్మించటంలో, స్వతంత్రంగా పనిచేయించటంలో మొదటినుంచీ కాసానిది ప్రత్యేక శైలి. 75 సంవత్సరాల జీవితంలో 50 సంవత్సరాలు పైగా తాను నమ్మిన సిద్ధాంతం, ఆశయాల కోసం ఎన్ని నిర్బంధాలు ఆటుపోట్లు ఎదురైనా ఏనాడు వెన్నుచూపని ధీరోదాత్తుడు కాసాని. 1974లో వరంగల్ జిల్లా నుంచి సుజాతనగర్ మండలంకు వలస వచ్చిన కాసాని కుటుంబం వ్యవసాయం చేస్తున్న క్రమంలో ఆ ప్రాంతంలో ఆనాడు భూస్వాములు, పెత్తందారుల, వడ్డీ వ్యాపారుల కబంధహస్తాల్లో మగ్గుతున్న పేదల జీవితాలను చూసి చలించిన కాసాని ఐలయ్య పేదల్ని సమీకరించి కూలి, దోపిడి, అరాచక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. ఆయన సహధర్మచారిని అయిన కాసాని లక్ష్మి తో కలిసి కూలీ, భూమి, కండింపులు, అధిక వడ్డీరేట్లకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పెద్దయెత్తున వర్గ పోరాటాలు నిర్మించారు. సుజాతనగర్ చుట్టూ అనేక గ్రామాలలో పార్టీ విస్తరణ జరిగింది. పార్టీని నిర్మాణ పరంగా బలంగా అభివృద్ధి చెద్దెలా పునాది వేశారు. వేగంగా పార్టీ ఉద్యమాన్ని బలోపేతం చేస్తున్న క్రమంలోనే కామ్రేడ్ కాసానిని అడ్డు తొలగించడం కోసం ప్రత్యర్థులు అనేక భౌతిక దాడులు పూనుకున్నారు. వాడన్నిటి నుంచి ప్రజలు కాసాని కంటికి రెప్పలా కాపాడుకున్నారు. 1980 మొదలుకొని 2017 వరకు 37 సంవత్సరాల పాటు సుజాతనగర్ పంచాయతీని సీపీఐ(ఎం)కు పెట్టని కోటగా మార్చడంలో కాసాని ఐలయ్య ప్రత్యేక కృషి ఉంది. 20 సంవత్సరాల తానే సర్పంచిగా కొనసాగడం, ఆ తర్వాత రిజర్వేషన్ మార్పు చెందినా ఆ తర్వాత కూడా పార్టీ అభ్యర్థులే గెలుపొందడంలో ఆయన నిర్వహించిన పాత్ర ఎలాంటిదో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వమ్ము చేయకుండా ఆదర్శంగా వ్యవహరిస్తూ, పంచాయతీని అన్ని విధాల అభివృద్ధి చేసేలా కృషి చేశారు. కామ్రేడ్ కాసాని పంచాయతీపై ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ, అభివృద్ధిపై చొరవ ఒకవైపు చూస్తూనే మరోవైపున నియోజకవర్గం, జిల్లాలో పార్టీ నిర్మాణం బాధ్యత సమర్థవంతంగా నిర్వహించారు. 16 సంవత్సరాల పాటు కొత్తగూడెం డివిజన్ కార్యదర్శిగా, జిల్లా విభజన అనంతరం ఒక సంవత్సరం ఆరు నెలల పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొదటి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. వ్యవసాయ, కార్మిక, రైతు, గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం కు సుదీర్ఘ కాలం పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి బాధ్యతలు నిర్వహించారు. పాల్వంచ నుంచి ఏన్కూరు వరకు పేదలందరిని సమీకరించి ఇళ్ల స్థలాల పోరాటాలు నిర్వహించారు. సుమారు 20వేల మందికి ఇళ్ల స్థలాలు దక్కడానికి కాసాని ఐలయ్య నేతృత్వంలో పార్టీ ఆధ్వర్యంలో జరిగిన పోరాటాల ఫలితమే. వేలాది ఎకరాల ప్రభుత్వ, అటవీ భూములపై నిర్వహించిన పోరాటాల ఫలితంగా ఈరోజు వందలాది మంది పేదలకు భూములు దక్కాయి. నేను బూర్గంపాడు, పినపాక డివిజన్లకు పార్టీ కార్యదర్శిగా పనిచేసిన సందర్భంలోపది సంవత్సరాలపాటు జిల్లా వైపు నుంచి ఇంచార్జిగా వ్యవహరించారు.కామ్రేడ్ కాసాని అనంతరం నేను 7 సంవత్సరాలు పాటు జిల్లా పార్టీ కార్యదర్శిగా పనిచేసిన సందర్భంగా కూడా ఆయన ఇచ్చిన తొడ్పాటు, పార్టీ నిర్మాణంకు చేసిన సూచనలు సదా మరపురానివి. పార్టీలో మాస్ లైన్‌ని అమలుపరచడంలో కాసానిది ప్రత్యేక శైలి.

ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం పనిచేయడం కామ్రేడ్ కాసానిని చూసి మనందరం నేర్చుకోవాల్సిన అంశం. దాదాపు 12 రకాల అనారోగ్య సమస్యలతో సుదీర్ఘకాలంగా కాసాని ఐలయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. 2017 తన సహధర్మచారిని కాసాని లక్ష్మి మరణించారు. లక్ష్మీ గారి మరణం కాసానిని బాగా కుంగదీసింది. కరోనా అనంతరం ఐలయ్య గారి ఆరోగ్య సమస్యలు తీవ్రంగా చుట్టుముట్టాయి. పార్టీ నాయకత్వం మీరు ఆరోగ్యంగా ఉండాలి. ఎక్కువ కాలం మీ సేవలు పార్టీకి అవసరం. మందులు వాడుతూ రెస్టు తీసుకోమని సలహా ఇచ్చినప్పటికీ, నాకు జనం మధ్య ఉంటేనే ఆరోగ్యం బాగుంటుంది. ఎక్కువకాలం జీవిస్తా... అంటూ ఒకవైపు తన ఆరోగ్య సమస్యపై పోరాడుతూనే ప్రజా సమస్యలపై పార్టీ వారిస్తున్నప్పటికీ పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. చివరి 20 రోజులు తాను సుదీర్ఘకాలం సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆనాటి సుజాతనగర్ గ్రామ పంచాయతీ నేడు ఏడు పంచాయతీలు మారి ప్రతిపాదిత కొత్తగూడెం కార్పొరేషన్‌లో కలపడాన్ని వ్యతిరేకిస్తూ గ్రామ, గ్రామం తిరిగి సభలు, సమావేశం నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ముట్టడిలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. వారి పట్టుదల, పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శం. కామ్రేడ్ ఐలయ్య తన జీవితాంతం ప్రజల కోసం పనిచేశారు. ప్రజల కోసం ఆలోచించారు చివరకు తాను చనిపోయాక కూడా తన భౌతికాయాన్ని వైద్య పరిశోధనలకు ఉపయోగపడాలనే నిర్ణయంతో వైద్య కళాశాలకు ఇవ్వాలని కోరారు. అలాంటి ఆదర్శ ప్రజానేతను కోల్పోవడం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉద్యమానికి తీవ్ర నష్టం. ఆయన చూపిన బాటలో పయనిస్తూ...ఆదర్శాలను సదాపాటిస్తూ ముందుకు వెళ్లడమే ఆయనకు మనం ఇచ్చే నివాళి.

ఇళ్ల స్థలాల పోరాటంలో కలిసి పనిచేశా

- **కాసాని కుటుంబంతో కొదమ సింహం పాండురంగాచార్యులు ప్రస్థానం**



కాసాని ఐలయ్యతో ఏర్పడ్డ పరిచయం ఇళ్ల స్థలాలు, కొవ్వూరు రైల్వేలైన్ ఉద్యమాలు...పోరాటంలో కలిసి పని చేశాం. పేదలకు ఇళ్ల స్థలాల కోసం కాసాని అయిలయ్య ప్రారంభించిన పోరాటాలకు రెవెన్యూ శాఖలో పనిచేసిన నా అనుభవాన్ని వారు వినియోగించుకున్నారు. ప్రభుత్వ కాళీ స్థలాలు ఎక్కడున్నాయి... అనేది నా ద్వారా సమాచారం తెలుసుకొని, పేదలకు ఇళ్ల స్థలాలు వచ్చే వరకు, ఆ స్థలాల వద్ద గుడిసెలు వేయించి పోరాటాలు చేశారు. అ పోరాటంలో నేను సైతం పాల్గొన్నాను. ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేయడంలో నా శక్తిని కూడగట్టి కాసానితో పయనించాను. ఆ పోరాటాల ద్వారా ఏర్పడ్డ కుటుంబ బంధంలో కాసాని లక్ష్మి చెల్లి, కాసాని ఐలయ్య బావగా పిలవడానికి బంధం ఏర్పడింది. ఉద్యమాలు చేస్తున్న తరుణంలో మా ఇల్లు వారికి షెల్టర్‌గా ఉపయోగపడింది. పోరాటంలో పాల్గొన్న వారికి భోజనాలు మా ఇంట్లోనే ఉండేవి. అందరికి వంటకాలు చేసి వంటలు వండించడంలో చెల్లి కాసాని లక్ష్మి ఎంతో చురుకుగా పనిచేసింది. కొత్తగూడెంలో ఇళ్ల స్థలాల కోసం ఇండస్ట్రియల్ ఏరియాలో పోరాటం చేస్తున్న తరుణంలో పోలీసులు దాడి చేసి, పేదలను, నాయకులను కొట్టి అరెస్టు చేశారు. 1/70 భూముల్లో ఇళ్ల స్థలాల పోరాటం చేయడం నేరంగా భావించి పోలీసులు అరెస్టు చేశారు. ప్రజలు తిరగబడ్డారు. అయినప్పటికీ కొంత మంది నాయకులను పోలీసులు బలవంతంగా కొట్టి అరెస్టు చేసి జైల్లోకి పంపించిన సందర్భాలు ఉన్నాయి. వరంగల్ జైల్లో 13 రోజుల పాటు కాసాని ఐలయ్యతో నేను గడిపాను. 13 రోజుల పాటు జైల్లో ఉన్నాం. జైల్లో ఉన్నప్పటికీ ఇళ్ల స్థలాల పోరాటం మాత్రం వెనకడుగు వేయకుండా నిరంతరం కొనసాగింది. కాసాని ఐలయ్య తాగుబోతుని అతను మద్యం సేవించి పోలీసుల మీద తిరగబడ్డాడని పోలీసులు తప్పుడు కేసులు పెట్టడం కోసం కుట్రపన్నారు. ఆనాటి ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శివ శంకరయ్య ద్వారా తప్పుడు ధృవీకరణ పత్రాన్ని పొందాలని విశ్వప్రయత్నం చేశారు పోలీసులు. కానీ, కాసాని మద్యం సేవించడని, ఆయన తాగుబోతని తప్పుడు మెడికల్ సర్టిఫికేట్ ఇవ్వనని డాక్టర్ శివశంకరయ్య చెప్పడంతో పోలీసులు కుట్ర పటాపంచలైంది.

కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లో వేలాది మందికి ఇళ్ల స్థలాలు, ఇళుల్ల వచ్చాయంటే గొల్లగూడెం, ప్రగతి నగర్ , మంచి కంటి నగర్, పాత కొత్తగూడెం, సుజాత నగర్‌లోని పలు ప్రాంతాలలో చేసిన కాసాని ఐలయ్య పోరాటాల ఫలితంగానే వేలాది మందికి ఇళ్ల స్థలాలు దక్కాయి. వేలాది మంది పేద ప్రజలు నేడు సొంత ఇంట్లో ఉంటున్నారంటే అది కాసాని పోరాట ఫలితం....నిర్భయంగా ఇళ్లల్లో నిద్రిస్తున్నరంటే కాసాని చేసిన త్యాగం.... ఆయన త్యాగాలు ఎప్పటికీ మర్చిపోలేనిది. కాసాని చేసిన పోరాటాంలో నేను సైతం అంటూ చెల్లి కాసాని లక్ష్మి తన వెన్నంటి అనేక ఉద్యమంలో పాల్గొన్న కమ్యూనిస్టు నాయకులు నేటి తరానికి ఆదర్శం....

త్యాగశీలి ఐలయ్య

పోరాటం ఉన్నచోటే కాసాని

- ఐలయ్య స్ఫూర్తితో ఉద్యమ నిర్మాణం
- తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి




ప్రజా ఉద్యమాలకు కాసాని ఐలయ్య మృతి తీరని లోటని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. ప్రజా ఉద్యమాల రూపకర్తగా ఆయన్ను అభివర్ణించారు. కాసాని ఐలయ్య సంస్మరణ సభ నేపథ్యంలో 'నవతెలంగాణ'తో పోతినేని ప్రత్యేకంగా మాట్లాడారు.

"ఐదు దశాబ్దాల విప్లవ జీవితంలో అన్నీ పోరాటాలే. వర్గపోరాటాలకు కాసాని బాసటగా నిలిచారు. సుజాతనగర్ వంటి పెద్ద పంచాయతీకి సర్పంచ్‌లుగా ఐలయ్య, ఆయన భార్య కాసాని లక్ష్మి 30 ఏళ్లకు పైగా పనిచేశారు. నిరంతరం ప్రజా ఉద్యమాలను నిర్మించేవారు. ఇళ్ల స్థలాల పోరాటం...భూ పోరాటం...పోడు పోరాటం...వృత్తిదారుల తరఫున పోరాటం...రైతాంగ, కూలీ పోరాటాలు ఇలా అన్నింటిలోనూ ఆయన భాగస్వామ్యం ఉంది. కొత్తగూడెం డివిజన్ సీపీఐ(ఎం) కార్యదర్శిగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా ఆయన ప్రజా ఉద్యమ నిర్మాణంలో పాలుపంచుకున్నారు. గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఉద్యమాలను నిర్మించారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా మొక్కవోని విశ్వాసంతో ముందుకెళ్లిన దీశాలి. నిరంతరం పేదల సమస్యలు గురించి ఆలోచించేవారు. సీపీఐ(ఎం) పార్టీ విస్తరణలో కీలక భూమిక పోషించారు. కొత్తగూడెం జిల్లాలో ప్రధానంగా ఉన్న పోడు భూముల సమస్య పరిష్కారం కోసం పోరాటాలు చేశారు. వేలాది మందిని సమీకరించి ఉద్యమాలు నిర్వహించారు. ఈరోజు పోడు భూములకు పట్టాలచ్చాయంటే దీనిలో ఐలయ్య కృషి ఎనలేనిది. ఐలయ్యతో పాటు ఆయన భార్య, కుటుంబం మొత్తం విప్లవపథంలోనే ఉన్నారు. ఆయన మృతి సీపీఐ(ఎం) పార్టీకే కాదు ప్రజా ఉద్యమాలకు తీరని లోటు. కాసాని నిరాడంబరుడు, త్యాగశీలి. బీజేపీ ఎదుగుతూ కమ్యూనిస్టు ఉద్యమాలపై దాడులు కొనసాగుతున్న తరుణంలో ఐలయ్య వంటి ఉద్యమ నేత లేని లోటు పూడ్చలేనిది."

ఉద్యమ నిర్మాత ఐలయ్య

- మాస్ లీడర్...రియల్ ఫైటర్
- శత్రువులతో సైతం మన్ననలు
- అఖిల భారత వ్యవసాయ కార్మికసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



ఉద్యమం లేని దగ్గర ఎలా ఉద్యమం నిర్మించాలో కాసాని ఐలయ్య నుంచి నేర్చుకోవాలని, ఆయనో సంపూర్ణమైన ఫైటర్.. జీవితాంతం వర్గ ఆలోచనకు కట్టుబడి, వర్గ శత్రువుకు వ్యతిరేకంగా పనిచేసిన గొప్ప పోరాట యోధుడని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. చనిపోయే ముందు రోజు కూడా ప్రజల కోసం నిరంతరం తపించిన అరుదైన కమ్యూనిస్టు కాసాని. అందుకే ఐలయ్య అందరివాడయ్యాడని తెలిపారు. ఐలయ్య గురించి ఇంకా మరెన్నో అంశాలు వెంకట్ మాటల్లోనే... శత్రువు కూడా అంతరంగంలో ఐలయ్య గొప్పతనాన్ని కీర్తించకుండా ఉండలేకపోయారు. అందుకు నిదర్శనమే ఐలయ్య చనిపోయినప్పుడు వచ్చిన వేలాది ప్రవాహం. ఇటీవలికాలంలో ఓ నాయకుడు చనిపోయినప్పుడు ఇంత పెద్ద సంఖ్యలో జనం రావటం అనేది అరుదుగా జరుగుతుంది. కాసానిని ఎప్పుడు ఆయన గొప్పతనం గురించి అడిగినా మార్క్సిజం, లెనినిజం నేర్పిన పాఠాలుగా చెప్పేవారు.

పోరాటానికి ప్రతిరూపం...

కాసాని ఐలయ్య పోరాటానికి ప్రతిరూపం. పీడిత ప్రజల పక్షపాతి. నన్ను ప్రారంభంలో రాజకీయాల్లోకి తీసుకొచ్చింది...నన్ను ప్రభావితం చేసిన మొదటి వ్యక్తి ఐలయ్య. నేను ఓ ధనిక రైతు కుటుంబంలో పుట్టాను. వినోభానగర్‌లో ఉన్నటువంటి ధనిక కుటుంబాల్లో మాది రెండో, మూడో కుటుంబం. కష్టాలు...ఆర్థిక ఇబ్బందులు ఎలా ఉంటాయో కూడా నాకు సరిగా తెలిసేది కాదు. ఆర్థిక ఇబ్బందులు కమ్యూనిస్టులకు ఎలా వస్తాయి? వచ్చినప్పుడు ఎలా నిలబడాలో నేర్పింది ఐలయ్య. మనకు వనరులు ఉండొచ్చు..కానీ కమ్యూనిస్టులకు ఉండాల్సింది నిరాడంబరంగా ..నిజాయితీగా ఎలా జీవించాలో ఐలయ్య జీవితం మాకు నేర్పింది. జూలూరుపాడులో నేను రాజకీయ ఓనమాలు దిద్దినప్పుడు...సామాజిక తరగతుల హాస్టల్ విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ ఉంటే...దీనికి భిన్నంగా ఏఐఎస్ఎఫ్ ఉండేది. కొత్తగూడెంలో ఎస్ఎఫ్ఐ ఉద్యమం ఎదుగుదలకు దోహదపడింది జూలురుపాడు హైస్కూల్, హాస్టల్. దానికి ప్రేరణ, రూపకల్పన మొక్కలు నాటింది కాసాని. 'మార్క్సిస్టు పెద్దలు చెప్పినట్టు ఒక విత్తనం నాటితే...అదీ గింజగా మారి..గింజలనే ఇస్తుంది' అన్నట్టు...ఐలయ్య అనేక ప్రాంతాల్లో అలాంటి గింజలు నాటారు. ఐలయ్యలోని ప్రత్యేక సుగుణాలను ఈ తరం, నాతో సహా అలవర్చుకోవాల్సిందే. ఉద్యమం లేని దగ్గర ఉద్యమం ఎలా నిర్మించాలో ఐలయ్య నిరూపించారు. మాలాంటి వాళ్లందరం ఉద్యమం నిర్మించి ఉన్నచోట నాయకులమయ్యాం. ఐలయ్య ఉద్యమాన్ని నిర్మించి నాయకులయ్యారు. వరంగల్‌లో పుట్టి ఉద్యమం కోసం సుజాతనగర్ వచ్చారు. ఆ రోజుల్లో సీపీఐ(ఎం) ఉద్యమం ఎలా ఉండేదంటే కొత్తగూడెం నుంచి అన్నారుగూడెం వరకు దాదాపు 35, 40 కి.మీ దాకా పార్టీ లేదు. అన్నారుగూడెం నుంచి ఖమ్మం దాక ఎక్కడా సీపీఐ(ఎం) ఉండేది కాదు...అంతా సీపీఐ. అప్పయ్య, లక్ష్మయ్య...ఇలా కొంతమంది వ్యక్తులు మాత్రమే ఉన్నారు. అలాంటి దగ్గర సీపీఐకి దీటుగా ఉద్యమం నిర్మించారు.

నిజాయితీ...నిరాడంబరత...

పెద్దలు ఉత్తమ కమ్యూనిస్టు ఎలా ఉంటారంటే సుందరయ్య గారని చెప్పేవారు. మేము ఎస్ఎఫ్ఐ ఉద్యమంలోకి వచ్చినప్పుడు సుందరయ్యను చూడటం తప్ప ఆయనతో పెద్దగా అనుబంధం లేదు. నాకు కమ్యూనిస్టు ఎలా ఉండాలంటే ఆరంభ రోజుల్లో నాకు కనిపించింది ఐలయ్య గారే. ఐలయ్య, ఐలయ్యగారి భార్య లక్ష్మి కంజర కొట్టుకుంటూ తిరుగుతున్న రోజులని ఇప్పటికీ మర్చిపోలేం. కమ్యూనిస్టులు ప్రజల కోసం త్యాగం, పోరాటాల్లో ముందుండాలి. నాకు తెలిసినంత మేరకు అనేక రాజకీయపార్టీలతో దాడులు, నిర్బంధాలు, హత్యలు, అవమానాలు భరించి...వాటన్నింటినీ తట్టుకొని నిలిచిన ముత్యంలాంటోడు ఐలయ్య. ఉద్యమం పెరగాలంటే ఎస్ఎఫ్ఐ ముఖ్యమని ఆయన గుర్తించారు. విద్యార్థి ఉద్యమానికి ఏ కష్టం వచ్చినా...ఏ ఇబ్బంది వచ్చినా షెల్టర్ సుజాతనగర్. ఖమ్మం లాంటి ప్రాంతంతో ఎస్ఎఫ్ఐ ఉద్యమం పోటీగా కొత్తగూడెం డివిజన్‌లో నిర్మించబడింది. ఉద్యమం పెరగటంలో నర్సిరెడ్డి గారు, కేఎల్ గారు, కంగాల బుచ్చయ్య...ఇలాంటి ఎందరో ఉన్నారు. బాబూక్యాంపు నుంచి అన్నారుగూడెం వరకూ నిర్మించిన ఓ గొప్ప ఉద్యమంలో ఐలయ్య పాత్ర ఉంది. కుటుంబపరంగా కూడా ఐలయ్య గారితో సన్నిహిత సంబంధం ఉంది. మానాన్న కాంగ్రెస్‌లో ఉన్నా మా ఇంటిని కమ్యూనిస్టుగా మార్చింది కానీ...ఏ అవసరం వచ్చినా ఐలయ్య గారితో మానాన్న చర్చించేవారు. కొత్తగూడెం నుంచి నేను ఖమ్మం వెళ్లినప్పుడు తమ్మినేని వీరభద్రం గారిని నాకు పరిచయం చేసింది ఐలయ్య. వెంకట్‌ను ఖమ్మం పంపుతున్నాం..జాగ్రత్తగా చూసుకోమన్నారు. పోరాటాల్లో ఐలయ్య ఉన్నారు. కమ్యూనిస్టు పార్టీకి ఎదురుదెబ్బలు తగిలి వెనుకపట్టు పడుతున్నప్పుడు...ఐలయ్య చూపిన బాటలో ఎలా ఉద్యమం నిర్మించాలో నేర్చుకోవాలన్నారు. మనషన్న తర్వాత కొన్ని పొరపాట్లు జరుగుతాయి. ఐలయ్యలోనూ కొన్ని నిర్మాణ లోపాలున్నాయి. ఏ వ్యక్తినైనా పరిశీలించినప్పుడు కాంట్రిబ్యూషన్ చూడాలి. లోపాలను అధిగమించేలా చేయాలి. బీజేపీకి, కార్పొరేట్ వ్యవసాయం, గుత్త సంస్థలకు వ్యతిరేకంగా నిలబడాలి. గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు అంకితమై... ఐలయ్య స్ఫూర్తితో వ్యవసాయ కార్మిక సంఘం నాయకునిగా అఖిల భారతస్థాయిలో ఉద్యమాలను మరింత ముందుకు తీసుకుపోతాం.

ఐలయ్య ఓ మాస్‌లీడర్

- దాడులు ఎదుర్కొని ప్రజా ఉద్యమ నిర్మాణం
- కొత్తగూడెం డివిజన్‌లో సీపీఐ(ఎం)కి ఆయనో పునాది
- మాస్‌లీడర్...ఆదర్శ కమ్యూనిస్టు కాసాని
- సీపీఐ(ఎం) రాష్ట్ర సీనియర్ నాయకులు పి.సోమయ్య

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కాసాని ఐలయ్య భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించారని సీపీఐ(ఎం) రాష్ట్ర సీనియర్ నాయకులు పి. సోమయ్య అన్నారు. కొత్తగూడెం డివిజన్, సుజాతనగర్, జూలూరుపాడు, ఏన్కూరు ప్రాంతంలో ఉద్యమాలను నిర్మించారని తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమంలో 1964, 1968లో చీలికలు వచ్చాయి. కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని నష్టం జరిగిందని, ఈ క్రమంలో ఉద్యమాన్ని పట్టాలు ఎక్కించి ఓ బలమైన ఉద్యమంగా నిర్మించటంలో 1970-80 దశకంలో కాసాని పాత్ర కీలకమైనదని పేర్కొన్నారు. ఆదర్శకమ్యూనిస్టు ఐలయ్య ఉద్యమ జీవిత విశేషాలను ఆయన సంస్మరణ సభ సందర్భంగా 'నవతెలంగాణ'కు వివరించారు. వివరాలు సోమయ్య మాటల్లోనే...

ఆర్ఎంపీ డాక్టర్ నుంచి ఉద్యమ నిర్మాత వరకూ...

ఐలయ్య వరంగల్ జిల్లాకు చెందిన వ్యక్తి. ఓంకార్ శిష్యుడు. బతుకుదెరువు కోసం కొత్తగూడెం మండలం సీతంపేటకు వచ్చారు. స్థానికంగా ఆర్ఎంపీ డాక్టర్‌గా పనిచేశారు. అక్కడి ప్రజలతో సంబంధాలు పెట్టుకున్నారు. వ్యవసాయ కార్మికుల తరఫున, రైతులపక్షాన పోరాటాలు నిర్వహించారు. శాఖల ఏర్పాటు జరిగింది. ఐలయ్య కృషిని చూసి ఉమ్మడి కొత్తగూడెం డివిజన్‌లో పార్టీ నాయకులుగా ఉన్న ఏలూరి లక్ష్మీనారాయణ, కొండపల్లి లక్ష్మీనారాయణ, పర్సా సత్యనారాయణ సీతంపేట నుంచి సుజాత నగర్‌కు పార్టీ ఆర్గనైజర్‌గా తీసుకొచ్చారు. 1970 దశకంలో పార్టీ హోల్‌టైమర్‌గా వచ్చారు.

ఎన్నెన్నో పోరాటాలు...

ఐలయ్య, ఆయన భార్య లక్ష్మి కిందిస్థాయి వ్యవసాయ కార్మికులు, బడుగులు, గిరిజనులు, ఆదివాసీలతో మమేకమై రైతాంగ, కూలీ, పోడు, చేతివృత్తిదారులు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్మించారు. ఒకరకంగా చెప్పాలంటే వారిది ఆదర్శ విప్లవ జంట. కంజర తీసుకొని ఏన్కూరు, జూలురుపాడు, సుజాతనగర్ మండలాల్లో తిరుగుతూ పాటలు పాడుతూ వ్యవసాయ కార్మికులను ఉత్తేజితులను చేసి పోరాటాలు నిర్మించారు. 'ఏమి తినేటట్టు లేదు...ఏమి కొనేటట్టు లేదు..నాగులో నాగన్న, ధరలిట్టా పెరగబట్టే...' ఇలాంటి పాటలెన్నో ఆలపించేవారు. ప్రజలను చైతన్యం చేశారు. భూస్వాములు వీరిని హేళన చేస్తూ మాట్లాడేవారు. ఐలయ్య దంపతులు వేసిన పునాదితోనే వ్యవసాయ కార్మికుల పోరాటాలు, వృత్తిదారుల పోరాటాలు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. 1970 దశకంలో కమ్యూనిస్టు ఉద్యమం మరింత వ్యాప్తి చెందింది. వీరి స్ఫూర్తితో అనేక మంది కార్యకర్తలు, నాయకులు పుట్టుకొచ్చారు.



ఐలయ్యపై దాడికి యత్నాలు..

ప్రజలను చైతన్య పరుస్తూ ఉద్యమాలు నిర్మిస్తున్న కాసాని ఐలయ్యపై భూస్వాములు దాడులకు యత్నించారు. అనేకమార్లు హత్యాయత్నానికి పాల్పడ్డారు. వీటి నుంచి ప్రజలు ఆయన్ను కాపాడుకున్నారు. సుజాతనగర్, జూలూరుపాడు భూస్వాములు కాసాని ఐలయ్యను చంపివేయాలని చాలా తీవ్రంగా ప్రయత్నించారు. ఆ సమయంలో సుజాతనగర్‌లో భూస్వాములు పార్టీ కార్యకర్తను చంపివేశారు. వ్యవసాయ కార్మిక ఉద్యమాలు నిర్మిస్తున్నాడని ఐలయ్యను ఎలాగైనా తుదముట్టించాలని తిమ్మారావుపేట భూస్వాములు యత్నించారు. డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చిన వేసిన దినం సందర్భంగా ఐలయ్య 'మతసామరస్యం'పై సభ ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో సభ నిర్వహిస్తుండగా భూస్వాముల దుండగులు మీటింగ్‌పై దాడి చేశారు. ఈ విషయం తెలిసి పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఏన్కూరు ఎస్సై సమక్షంలోనే భూస్వాముల దుండగులు దాడికి పాల్పడ్డారు. ఈ ప్రమాదం నుంచి ఐలయ్య తప్పించుకున్నారు. ఈ సందర్భంగా చోటుచేసుకున్న తోపులాటలో పాడుబడిన బావిలో పడి ఎస్సై మరణించారు. ఈ ఘటనకు ఐలయ్యే కారణమని ఆరోపించే యత్నం చేశారు. దీనిపై స్థానిక ప్రజలు వాస్తవ పరిస్థితులను విచారణ అధికారులకు వివరించారు. తద్వారా ఐలయ్యపై కేసు పెట్టలేకపోయారు. అణచివేయాలని ప్రయత్నించినా కొద్ది ఉద్యమం ఎగిసిపడింది.

ఆదర్శపంచాయతీగా సుజాతనగర్

ప్రజా పోరాటాల్లో విస్తృతంగా పాల్గన్న ఐలయ్య-లక్ష్మి దంపతులను ప్రజలు ఆశీర్వదించారు. సుజాతనగర్ మేజర్ పంచాయతీకి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. దాదాపు 35 ఏళ్లపాటు ఈ పంచాయతీని తీర్చిదిద్దారు. ఈ ప్రభావంతో జూలూరుపాడు ఎంపీపీని సైతం సీపీఐ(ఎం) గెలుచుకుంది. సీతారాములు ఎంపీపీగా ఎన్నికయ్యారు. జూలూరుపాడు జడ్పీటీసీగా గుగులోత్ ధర్మా విజయం సాధించారు. ఈ విజయాలన్నింటికీ ఐలయ్య నిర్మించిన ప్రజా పునాది, పోరాటాలే కారణం.

పార్టీలోనూ బాధ్యతల పెంపు...

ప్రజా సంబంధాలు, ఉద్యమాలతో పార్టీలోనూ ఐలయ్య బాధ్యతలు విస్తృతమయ్యాయి. ఉమ్మడి కొత్తగూడెం డివిజన్ పార్టీ సభ్యునిగా, కార్యదర్శిగా, జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా ఇలా ఆయన బాధ్యతలు పెరుగుతూ పోయాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీపీఐ(ఎం) తొలి కార్యదర్శిగానూ ఆయన ఎన్నికయ్యారు. రైతుసంఘం, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్రస్థాయి బాధ్యతలను సైతం చేపట్టారు.

ఆదర్శ కమ్యూనిస్టు...

ఓ మాస్ లీడర్‌గా బలమైన ప్రజాపునాదిని నిర్మించారు. ప్రజలు ఆయన్ను అపారంగా ఆదరించారు. క్రమశిక్షణ కలిగిన నాయకుడు, అంకితభావం, పట్టుదల ఉన్న నాయకుడు. నాకు అత్యంత సన్నిహితుడు. దాదాపు ఇద్దరం కలిసి సుజాతనగర్, సింగభూపాలెం, ఏన్కూరు, చంద్రుగొండ తదితర శాఖలు ఏర్పాటు చేశారు. విస్తృతంగా తరగతులు నిర్వహించాం. అనేక మంది క్యాడర్ పార్టీలో ఉన్నారంటే అదీ ఐలయ్య, లక్ష్మి దంపతుల కృషి ఫలితమే. బీజేపీ ఎదుగుతూ కమ్యూనిస్టు ఉద్యమంపై దాడులు జరుగుతున్న సమయంలో ఐలయ్య లాంటి పోరాట యోధున్ని కోల్పోవడం పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు. ప్రజా ఉద్యమాలను మరింత ముందుకు తీసుకెళ్లి...ఐలయ్య ఆశయాలను నిలపాలని పిలుపునిస్తున్నా. ఇప్పటికీ ఆయన కుమారుడు లెనిన్, కుమార్తె, కోడలు మొత్తం ఫ్యామిలీ విప్లవ కుటుంబాగానే కొనసాగుతుండటం గమనార్హం.

కాసాని ఐలయ్య... ఓ చెరగని జ్ఞాపకం

- సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

'ఏం చేయాలి?' అనే రచనలో వీఐ లెనిన్ ఓ కమ్యూనిస్టు కార్యకర్త ఎలా పనిచేయాలో వివరిస్తూ...'నిరంతర ఆందోళకారుడిగా కమ్యూనిస్టు ఉండటం ఓ గొప్ప లక్షణం' అంటారు. దీన్ని తన ఉద్యమ జీవితంలో అక్షరాలా ఆచరించిన నిరంతర ఆందోళనకారుడు కామ్రేడ్ కాసాని ఐలయ్య అని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు పేర్కొన్నారు. ఆందోళన, పోరాటాలంటే కాసానికి ఎంతో ప్రియమైనవని... వీటిని వర్ణించటం చాలా కష్టం కూడా అని తెలుపుతూ ఐలయ్య గురించి మరిన్ని వివరాలు అందించారు. సాయిబాబు మాటల్లో... కొన్ని సంవత్సరాలుగా తీవ్ర అనారోగ్యంతో ఉండి...ఓవైపు మృత్యువు వెంటాడుతున్నా తుది వరకూ పోరాటమార్గంలో పయనించిన దీశాలి. చనిపోవడానికి రెండు, మూడు రోజుల ముందు కూడా కొత్తగూడెం పట్టణ సమస్యలపై అఖిలపక్ష ఆందోళనలో ప్రత్యక్షంగా పాల్గొన్న తీరు ఎంతో ఉత్తేజమైనది. పేద ప్రజల హక్కులు, ప్రయోజనాల కోసం పోరాడుతున్న సందర్భంలో నిర్బంధం, కేసులు, అరెస్టులు, చివరికి జైలుకెళ్లటం లాంటి ఘటనలు కాసాని జీవితంలో సర్వసాధారణం.

కార్యకర్తలకు బాసట...

1980 దశకంలో మేము కొత్తగూడెంలో విద్యార్థి ఉద్యమంలో పనిచేస్తున్న సందర్భంలో ఎన్నో ఆటుపోట్లు వచ్చాయి. సంఘ విద్రోహశక్తుల నుంచి బెదిరింపులు, దాడులు ఎదురయ్యాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలకు ఎంతో మనోధైర్యాన్నిచ్చి, వారు నిలదొక్కుకొనేలా బాసటగా నిలిచిన శ్రామిక యోధుడు కాసాని. సీఐటీయూ కార్యకర్తగా నేను కొత్తగూడెంలో పనిచేసిన రోజుల్లో విద్యుత్ ఉద్యమం, ఆర్టీసీ పరిరక్షణ పోరాటం, సింగరేణి ప్రయివేటీకరణకు వ్యతిరేక సమ్మెల సందర్భంగా నాటి పాలకులు నిర్బంధాన్ని ప్రయోగించారు. ఈ పోరాటాలన్నింటిలోనూ కాసాని ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

కాసాని ఉద్యమ జీవితంలో ఎన్నో అధ్యాయాలున్నాయి. వాటిల్లో ప్రతీ పేజీ ఆందోళన, పోరాటాలతోనే నిండి ఉంటుంది. నమ్మిన ఆశయం కోసం అత్యంత మిలిటెంట్‌గా పోరాడిన ఎర్రజెండా బిడ్డ కాసాని. భౌతికంగా మరణించినా..ఉద్యమంలో ఆయనది ఎప్పటికీ చెరగని జ్ఞాపకం. అందుకో కాసాని మా విప్లవ జోహార్లు.

ప్రజా ఉద్యమ రూపకర్త కాసాని

- సమస్యలపై స్పందించే గుణం
- పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాటం
- సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు నున్నా నాగేశ్వరరావు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ప్రజా ఉద్యమాల నిర్మాణంలో కాసాని ఐలయ్య ఆయనకు ఆయనే సాటి అని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. కాసాని ఐలయ్య సంస్మరణ సభ సందర్భంగా 'నవతెలంగాణ'తో నున్నా ప్రత్యేకంగా మాట్లాడారు. ' ప్రజా ఉద్యమ నిర్మాణంలో కాసాని ఐలయ్య స్ఫూర్తిదాయకంగా వ్యవహరించారు. ప్రజా సమస్యలపై స్పందించే గుణం ఉన్న ఆయన.. ఎక్కడ జనం ఇబ్బంది పడుతున్నారంటే అక్కడ వాలిపోయేవారు. కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లో భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించారు. గిరిజన రైతాంగం కోసం పోడు ఉద్యమాలు చేపట్టారు. వత్తిదారుల కోసం పాటుపడ్డారు. విద్యార్థి ఉద్యమానికి అండగా నిలిచారు. ఎరువులు, పురుగుమందుల వ్యాపారుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారు. గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం తరఫున అనేక ఉద్యమాలు నిర్వహించారు. నీళ్లలో చేపలా ప్రజల్లో కలిసిపోయేవారు. వారికి ఏ కష్టం వచ్చిందన్నా అండగా నిలిచేవారు. ఏన్కూరు, తిమ్మారావుపేట, జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల్లో పోరాటాలు నిర్వహించారు. సీపీఐ (ఎం) బలోపేతం కోసం పాటుపడ్డారు. 50 ఏళ్ల పాటు విప్లవ బాటలో ప్రయనించి, ప్రజా ఉద్యమాలకు రూపకల్పన చేశారు. కాసాని ఐలయ్య మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు. పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆశా కిరణంలా నిలిచిన కాసాని ఆశయాలను ముందుకు తీసుకెళ్లటమే కమ్యూనిస్టుల లక్షణంగా ఉండాలి."

కాసానితో.... నా జీవిత ప్రస్థానం

● సుజాతనగర్ మండల కార్యదర్శి వీర్ల రమేష్

నవతెలంగాణ-కొత్తగూడెం



1987లో మా గ్రామంలో కరెంటు వేయించడానికి వచ్చిన కాసాని గారిని తొలిసారిగా మంచి కంటి రామ్ కిషన్ రావుగారితో కాసానిని చూశాను. అనంతరం 1995 సారా వ్యతిరేక పోరాటంలో ఆయనతో తెలిసి, తెలియని వయసులోనే ఆ పోరాటంలో పాల్గొన్నాను. 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనతో కలిసి పని చేశాను. నాలో చురుకుదనాన్ని చూసిన కాసాని నాకు 2000 సంవత్సరంలో పార్టీ సభ్యత్వం ఇచ్చారు. సుజాతనగర్ ప్రాంతంలో యువకుడుగా చురుకుగా పనిచేస్తున్న నా తీరును చూసి ఆయన మరింత ప్రోత్సహించారు. ఆకు కూరలు అమ్ముకుని జీవిస్తున్న నన్ను కమ్యూనిస్టుగా తీర్చిదిద్ది, పూర్తి కాలం కార్యకర్తగా తయారు చేశారు. 2005వ సంవత్సరంలో పూర్తి కాలం కార్య కర్తగ ఆయన వెంట 20 ఏళ్ళు కలిసి పని చేశాను. నన్ను అరే.. అని పిలిచే అంత చనువు ఉండడంతో సొంత తమ్ముడుగా చూసుకున్నారు. ఎప్పుడు నన్ను రివ్యూ చేస్తూ నాలోని లోపాలను సవరిస్తు, నన్ను తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర ఎంతో ఉంది.. ప్రతిరోజు నాకు పార్టీ సిద్దాంతం, పార్టీలైన్ చెప్పేవారు. 2010 సంవత్సరంలో లెనిన్ నగర్‌లో జరిగిన ఇళ్ల స్థలాల పోరాటంలో మొదటిసారిగా 7 రోజుల పాటు నన్ను ఆమరణ నిరాహార దీక్ష చేసే విధంగా ప్రోత్సహించారు. నా దగ్గరే ఉండి, నాతో దీక్ష చేయించడం వలన నాకు ఆత్మస్థైర్యం, పోరాటపటిమ పెరిగింది. దాని ఫలితంగా 114 మందికి ఇళ్ల స్థలాలు వచ్చాయి. వీటితో పాటు కాసాని లక్ష్మీ నగర్, రాఘవపురం, కంగాల బుచ్చయ్య నగర్, సుందరయ్య నగర్ ప్రాంతాలలో సుమారు 500 మందికి ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో దగ్గరుండి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమాలన్నిటికీ ముఖ్య నాయకుడిగా కాసాని పనిచేశారు. ఈ తరుణంలో నా మీద 5 నాన్ బెలబుల్ కేసులు నమోదు అయ్యాయి. ఆక్రమంలో రెండు రోజులు జైలుకు వెళ్లాల్సి వచ్చింది. కరోనా (కోవిడ్) సమయంలో జిల్లా వ్యాప్తంగా మొట్టమొదటి సారిగా సుజాతనగర్‌లో కాసాని ఆధ్వర్యంలో కరోనా బారిన పడి మృతి చెందిన వారికి అంత్యక్రియలు నిర్వహించడం ప్రారంభించాం. దీనితో పాటు వారికి పలు ఆరోగ్య సేవా కార్యక్రమాలు, ప్రజలకు కూరగాయలు, నిత్యవసర సరుకులు పంపకాలు చేయడం జరిగింది. కాసాని లక్ష్మీ పేరిట మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగింది.

కాసానితో చివరి పోరాటం...

సుజాతనగర్ ఏడు గ్రామ పంచాయతీలను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్తగూడెం కార్పొరేషన్‌లో విలీనం చేయడాన్ని నిలిపివేయాలని జరిగిన పోరాటంలో చివరి వరకు కాసాని వెంట ఉన్నాను. విలీన ప్రభావానికి గురిఅయ్యే..20 గ్రామాల్లో కాసాని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీటింగ్‌ల్లో పాల్గొన్నాను. జనవరి 20వ తేదీన వేలాది మందితో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జనవరి 24న రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ సుజాతనగర్ గ్రామంలో బెలూన్స్ ఎగురవేసి సంబురాలు చేశాం. కాసానితో కలిసిన నేను తొలి ఆయన చేసిన ప్రతి పోరాటంలో ఉన్నాను. కాసాని జీవితంలో తొలి నుంచి తుది పోరాటం వరకు ప్రజా పోరాటాలే నిర్వహించారు.... తుది శ్వాస వరకు ఆయన ప్రజల పక్షాన నిలబడ్డారు...కమ్యూనిస్టుగా ఆయన ఆశయాలు గొప్పవి...అని సిద్ధాంతం బలమైనది....నేటి తరం యువత ఆయనను ఆదర్శంగా తీసుకుంటే...మహా నాయకులుగా ఎదుగుతారు....ఆదే మహా నాయకుడికి మనమిచ్చే నివాళి....

ఉద్యమమే ఊపిరిగా జీవించిన నాయకుడు కాసాని...

సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మచారి



నమ్మిన సిద్ధాంతం కోసం అర్ధశదాబ్దానికై పైగా శ్రామికవర్గ పోరాలకు నాయకత్వం వహించిన ప్రజానాయకుడు కాసాని ఐలయ్య. ఉద్యమమే ఊపిరిగా జీవించిన ఉత్తమ కమ్యూనిస్టు. సిపిఐ(ఎం) విధానాలకు కట్టుబడి. రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, వృత్తి దారుల సమస్యలపై అనేక సమరశీల పోరాటాలకు నాయకత్వం వహించిన పోరాటయ్జోధుడు. కొత్తగూడెం నియోజక వర్గంలో సిపిఐ(యం), ప్రజా సంఘాల నిర్మాణానికి, ఉద్యమ విస్తరణకు విశేషమైన కృషి చేశారు. విద్యుత్ పోరాటం, సింగరేణి ప్రైవేటీకరణ వ్యతరేక పోరాటం, ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు నాయకత్వం వహించి, కార్మిక పోరాటలకు ప్రజా మద్ధతును సవీరీకరించి కార్మిక పోరాటాలకు అండగా ఉన్నారు. రాజకీయలు అంటే వ్యాపారం, సంపాదన, పదువులు అనుభవించి లబ్ధి పొందటం వంటి సంస్కృతి కొనసాగుతున్న ఈకాలంలో కూడా సుజాతనర్ సర్పంచ్ సుదీర్ఘకాలం పనిచేసి నీతివంతమైన పాలన అందించిన ఆదర్శ ప్రజా ప్రతినిధి కాసాని అయిలయ్య. కమ్యూనిస్టుగా తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితమిచ్చిన అయిలయ్య తన మరణం అనతరం కూడా తన దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనలకు ధానం చేసిన ద్గొప్ప మానవతవాది. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నమ్మిన వారు జీవించినా, మరణించినా అది ప్రజలకోసమే వారిజీవితమని నిరూపించిన అయిలయ్య జీవితం నేటితరానికి ఆదర్శం. అయిలయ్య పోరాట వారసత్వాన్ని కొనసాగించటమే అయిలయ్యకు ఇచ్చే నివాళి...జోహార్ కాసాని ఐలయ్య.

కూలి, భూమి పోరాటం అంటే కాసాని గుర్తుకు వస్తాడు...

- వర్గ పోరాటాలకు ఆయన మార్గం
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్

నవతెలంగాణ-కొత్తగూడెం



కాసాని అయిలయ్య కూలి రేట్ల పోరాటంతో ఉద్యమ జీవితం ప్రారంభించిన ఆయన జీవితం స్ఫూర్తిదాయకం. కాసాని ఉద్యమ జీవితంలో వ్యవసాయ కూలీరెట్ల పోరాటాలు, ఇళ్ల స్థలాల పోరాటాలు, ప్రముఖమైనవి. వర్గ పోరాటాల ద్వారానే సమాజం మార్పు సాధ్యమని మార్క్సిజం, లెని నిజం చెప్పిన బాటలో ఆయన అనేక పోరాటాల రూపకల్పన చేశారు. సుజాతనగర్ ప్రాంతం నుండి కొత్తగూడెం మండలంలో అనేక గ్రామాలలో కూలి రేట్ల పోరాటాలు నిర్వహించారు. అందులో ప్రాముఖ్యత కలిగిన పోరాటం చొప్ప కట్టల ఉద్యమం ముఖ్యంగా గుర్తుచేసుకోవాలి. జొన్న పంట కోతకు వెళ్లిన కూలీలకు ఇచ్చే చొప్పకట్ల సంఖ్య పెంచాలని చేసిన పోరాటం రాష్ట్ర వ్యాప్తంగా కూలీలకు పోరు మార్గం చూపింది. ఆనాటి నుండి ఆయన జీవించినంత కాలం కూలీ రేట్లు పెంచాలని పోరాటాలు, పేదలందరికీ ఇంటి స్థలం కావాలని పోరాటాలు, సాగుభూమి ఉండాలని సాగిన పోడు భూముల పోరాటాలకు నాయకత్వం వహించి పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ప్రజానాయకుడు కామ్రేడ్ కాసాని. కోయగూడెం ఓసి కేటీపీఎస్ బీపీఎల్ వంటి అనేక పరిశ్రమలలో భూములు కోల్పోయిన నిర్వాసితుల పక్షాన నిలబడి గ్రామ, గ్రామాన తిరిగి ప్రజలను చైతన్య పరిచి వారితో ఆనేక పోరాటాలకు రూపకల్పన చేశారు.

కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు

సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా



సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య మృతి చెందడం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు. సమారు 5 దశాబ్దాల కాలం నుండి ఈ ప్రాంత ప్రజల తరుపున, పేదల తరుపున, రైతంగాం, వ్యవసాయ కూలీలు, కార్మిక వర్గం, మహిళలు పేద ప్రజల తరుపున ఒక గొంతుగా ఈ ప్రాంత ప్రజల కోసం పనిచేసిన నాయకుడు. కాసాని ధైర్యంతుడు, మొండి పట్టుదల కలిగిన వ్యక్తి. కమ్యూనిస్టు పార్టీ పట్ల, సిద్ధాంతం పట్ల, ఉద్యమం పట్ల, అచంచలమైన విశ్వాసం కలిగిన వ్యక్తి. సీపిఎం పార్టీని ఈ ప్రాంతంలో నిలబెట్టడంలో, ప్రజా సంఘాలను కాపాడటంలో కాసాని ప్రధాన పాత్ర పోషించారు. సీపిఎంతో పాటు వామపక్ష పార్టీలైన సీపిఐ మధ్య ఐక్యత కోసం కృషిచేసిన వ్యక్తి. 2009, 2014, 2023 ఎన్నికల్లో ఈ నియోజక వర్గం నుండి భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా కూననేని సాంబశివరావు గెలుపులో కీలక పాత్ర పోషించారు. ఎర్ర జెండా అసెంబ్లీకి వెళ్లాలని, ప్రజల పక్షాన గళం విప్పాలని రాజకీయ లక్ష్యంలో అకుంట దీక్షతో పనిచేసిన వ్యక్తి. అనేక భూ పోరాటాలు, రైతంగా పోరాటలు, వ్యవసాయ కూలీల పోరాటల్లో మమేకైమన వ్యక్తి. జిల్లా రైతంగం, సాగునీటి కోసం నికరంగా పనిచేసిన వ్యక్తి. కాసాని లేక పోవడం సీపిఎంకే కాక వామపక్ష రాజకీయ, పార్టీలకు జిల్లా ప్రజలకు తీరని లోటు. ఆయన భౌతికంగా లేకపోయిన ఆయన ఆశయాలు, ఆలోచనలు, పట్టుదల, దీక్ష ను ముందుకు తీసుకు పోవాల్సిన అవసరం కమ్యూనిస్టులపై ఉంది.

కాసాని ఐలయ్య మరణం సీపీఐ(ఎం)కి, వామపక్ష ఉద్యమానికి తీవ్ర నష్టం

- ఐలయ్యకి విప్లవ జోహార్లు....
- ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర నాయకులు ఎంఎన్.రెడ్డి

నవతెలంగాణ-కొత్తగూడెం



కాసాని ఐలయ్య వరంగల్ జిల్లా నుండి ఈ ప్రాంతానికి వచ్చి సుజాతనగర్ పక్కన ఉన్న రెడ్డిపాలెం గ్రామంలో నివాసం ఉన్నారు. ఆ గ్రామం చుట్టూ ఉన్న గ్రామాలలో ప్రజలను చైతన్యపరిచి భూపారాటాలు చేయించారు. భూములు కోల్పోతామని భయపడ్డా ఒక డాక్టరు కొత్తగూడెం నుంచి కొంతమంది గూండాలను పంపాడు. అది తెలుసుకున్న గ్రామస్తులు ఆ గూండాలను తరిమికొట్టి ఐలయ్యను రక్షించుకున్నారు. దాంతో ఆయన మకాం సుజాతనగర్‌కు మార్చారు. కామ్రేడ్ ఐలయ్య సుజాతనగర్ వచ్చిన కాలంలో ఆ గ్రామంలో ఎర్రజెండా కట్టే ధైర్యం ఎవరు చేయలేదు... మొత్తంగా గ్రామం కాంగ్రెస్ పార్టీ ప్రలోభంలో ఉంది. అలాంటి తరుణంలో సుజాతనగర్ గ్రామంలో అన్ని వర్గాల ప్రజలను కూడగట్టి సిపిఎం పార్టీని నిర్మించారు. ఐలయ్య కృషి ఫలితంగా గ్రామం సిపిఎం పంచాయతీగా ప్రజల మనల్ని పొందింది. దాదాపు 35 సంవత్సరాలు సిపిఎం పంచాయతీగా నిలబడింది. అలాగే పార్టీ విస్తరణ సుజాతనగర్‌లో ఆగలేదు. ఐలయ్య తన సతీమణి కాసాని లక్ష్మితో కలిసి కంజర పట్టుకుని పాటలు పాడుతూ అనేక గ్రామాలు ఉన్నటువంటి పేద ప్రజలను ఉగ్రూతలు ఊగించారు. సుజాతనగర్ నుండి ఏన్కూరు దాకా గ్రామాలలో పార్టీని నిర్మించారు. ఐలయ్య ఉద్యమ నిర్మాణాన్ని చూసిన శత్రువులు భౌతిక దాడులు చేశారు. పోలీస్ కుట్ర కేసులు పెట్టించారు. కామ్రేడ్ ఐలయ్యకి మద్దతుగా ఆనాటి సిపిఎం పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శిగా ఉన్న కామ్రేడ్ ఏలూరు లక్ష్మీనారాయణ, కామ్రేడ్ మంచికంటి రాంకిషన్ రావులు శత్రుల దాడులను తీవ్రంగా ఖండించారు. సుజాతనగర్‌లో బహిరంగ సభ పెట్టి శత్రువులను హెచ్చరించారు. ఆ తర్వాత కాలంలో కొత్తగూడెం పట్టణంలో ఇళ్ల స్థలాల పోరాటాలు విజయవంతంగా నడిపారు. అలాంటి పోరాట యోధులు తీవ్రమైన జబ్బుతో అస్తమించడం బాధ కలిగించింది.... కామ్రేడ్ ఐలయ్యకి మరోసారి విప్లవ జోహార్లు అర్పించుకుంటున్నాం...

కాసాని జీవితమే ఓ కమ్యూనిస్టు ఉద్యమం

రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ

నవతెలంగాణ-కొత్తగూడెం

సహజంగా కమ్యూనిస్టు ఉద్యమాలు నాయకులు తమ పాత్రను పోషించి ఉద్యమ అభివృద్ధికి పాటుపడతారు. కానీ కాసాని ఐలయ్య గారు తన జీవితమే కమ్యూనిస్టు ఉద్యమం అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే తాను నిర్వహించిన పాత్ర కమ్యూనిస్టు ఉద్యమాన్ని సృష్టించింది. తన జీవిత చర్మాంకంలో తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి నిజాయితీగా నిక్కచ్చిగా నిలబడి పోరాడిన యోధుడు కామ్రేడ్ కాసాని. కష్టజీవుల రాజ్యం కోసం కష్టజీవులను ఐక్యం చేయడమే పరమావిధిగా పెట్టుకొని వర్గ పోరాటాలు నేర్పిన కమ్యూనిస్టు వైతాళికుడు కామ్రేడ్ కాసాని ఐలయ్య

వర్గ పోరాటాల ముగింపు...

1974 జూలై 24న బ్రతుకుతెరువు కొరకు సుజాతనగర్ పట్టణం ప్రాంతం సమీపంలోని రెడ్డిపాలెం గ్రామానికి వచ్చారు. కొత్తగూడెంలో మాత్రమే కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ లేదు. కామ్రేడ్ కాసాని వరంగల్ జిల్లాలోని, గంగదేవిపల్లిలో అప్పటికే పార్టీ సభ్యత్వం తీసుకొని ఇక్కడికి వచ్చాడు. ఆ కాలంలో ఈ ప్రాంతం అంతా భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, తప్పుడు తూనికలు చేసేవారు, ప్రజల్ని పీల్చి పిప్పి చేస్తున్న తరుణంలో కాసాని పి.ఎం.పి డాక్టర్ వృత్తి, వ్యవసాయం చేస్తూ ప్రజల్ని చైతన్య పరుస్తూ కూలీలను ఐక్యం చేసి కూలీ పోరాటాలు నిర్మించడం జరిగింది. 1976 నుండి 79 వరకు తప్పుడు తూకాలు, కూలీ రేట్లు, తునికాకు కట్టరేట్లు పెంపు వంటి పోరాటాలతో గ్రామ, ప్రాంత ప్రజలను చైతన్యం చేసి పోరాటాలు నిర్మించారు. దాని ఫలితంగా కూలీలు కష్టజీవులు అంతా ఎర్రజెండా సిపిఎం వైపు నిలబడ్డారు. 1981లో జరిగిన స్థానిక గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఎం సుజాతనగర్ ఉమ్మడి పంచాయతీని గెలుచుకోవడం జరిగింది. అదేవిధంగా దున్నేవాడికి భూమి కావాలని, తెలంగాణ పోరాట స్ఫూర్తిని, భూమిలేని పేదలకు భూమి



ఇవ్వాలని పోడు భూమి పోరాటాన్ని 1985 నుంచి 1991 వరకు మొదటి విడత ఆ తర్వాత రెండవ విడుత చంద్రుగొండ, జూలూరుపాడు, ఏన్కూరు, సుజాతనగర్, లక్ష్మీదేవి పల్లి మండలాల్లో నిర్వహించడం జరిగింది. సుమారు 15 వేల ఎకరాల భూమిని సాధించి వేలాది మందికి ఇప్పించడం జరిగింది. ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించారు. పాల్వంచ నుంచి ఏన్కూరు వరకు పెద్ద ఎత్తున ఇళ్లస్థలాల పోరాటాన్ని నిర్మించి ఆంధ్రప్రదేశ్ లోనే సమరశీల పోరాటాన్ని నిర్వహించిన చరిత్ర కామ్రేడ్ కాసాని ఐలయ్యకు ఉంది. దాని ఫలితంగా సుమారు 8000 మందికి ఇళ్ల స్థలాలు ఇప్పించడం. వేలాది మందికి ఇల్లు కట్టించడం జరిగింది.

మంచి పాలన దక్షకుడు కాసాని

1981 నుండి 2001 వరకు 20 సంవత్సరాల పాటు సుజాతనగర్ గ్రామ పంచాయతీకి సర్పంచ్‌గా ఆదర్శవంతమైన పరిపాలన చేశారు. కామ్రేడ్ కాసాని 19 గ్రామాలలో 23 మోటార్లు ఏర్పాటు చేసి మంచినీటి సౌకర్యం తొలగించారు. అన్ని గ్రామాలకు విద్యుత్ లైన్లు వేసి వీధిలైట్లు ఏర్పాటు చేయడం, రోడ్లను నిర్మించారు. పంచాయతీలో ఒక రూపాయికి మినరల్ వాటర్ సప్లై చేయడం అనేది రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పాటు చేశారు. ఇందు కోసం గ్రామాల్లో 5 సెంటర్లలో మంచినీటి కోసం ఏర్పాటు చేసి ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించారు. కాసాని అనంతరం పార్టీ జిల్లా నాయకులు కున్సోత్ ధర్మ మండల నాయకులు, గండమాల భాస్కర్, కాసాని లక్ష్మిలు సుమారు 36 సంవత్సరాలు పాటు మొత్తంగా సిపిఎం పంచాయతీ పాలన సాగించారు. దీనికి మార్గదర్శకులు కాసాని ఐలయ్య. ఒకసారి సర్పంచ్ అయితే లక్షలు, కోట్లు సంపాదించే ఈ రోజుల్లో 36 సంవత్సరాలు ఒక జనరల్ సీటులో సిపిఎంని ప్రజలు గెలిపించారంటే దానికి నాయకత్వం వహించిన కాసాని గారి గొప్పతనం. అవినీతికి తావు లేకుండా నిజాయితీగా నిస్వార్థంగా పాలన చేసిన ధీరోత్తముడు కాసాని ఐలయ్య.

కమ్యూనిస్టు విలువలకు నిదర్శనం కామ్రేడ్ కాసాని

ఒకవైపు ప్రజా ప్రతినిధిగా మరోవైపు పార్టీ ఉద్యమ నేతగా ఏకకాలంలో కమ్యూనిస్టు పనిచేసిన గొప్ప నేత కాసాని. తన జీవితంలో ప్రజలనే బిడ్డలు అని సుందరయ్య చెప్పిన మాటలు కాసాని అక్షరాల ఆచరణలో పెట్టారు. పిల్లల్ని పెద్ద చదువులు చదివించలేదు.. సాధారణ ప్రజలు జీవితాల మాదిరిగానే తాను కోటా బియ్యం తిని బతికాడు. ప్రజలను ఐక్యంచేసే క్రమంలో సైకిల్‌పై ఆయన సతీమణి లక్ష్మీ గారిని ఎక్కించుకొని, కుమారుడు లెనిన్‌ని ఎక్కించుకొని ఊరూరు తిరుగుతూ కాసాని లక్ష్మీ గారు పాటలు పాడగా, తనకుమారుడు లెనిన్ కంజరకొడుతూ ఉండేవారు. అలా ప్రజల్ని సమీకరించి చైతన్యం చేస్తూ ప్రజలు పెట్టింది తిని బతికిన నాయకుడు. కొన్ని రోజులకు తిండి దొరక్క వస్తువులు ఉండి మంచినీళ్లు తాగి బతికిన సందర్భాలు ఉన్నాయి. అటువంటి రోజులు గడిపిన కాసాని ప్రజల ఆలోచనలు త్వరగా గుర్తించి, దానికి తగిన విధంగా పోరాటాల రూపకల్పన చేయగల నేర్పరి మన కాసాని. తన జీవితాంతం కొత్త బట్టలు ఎప్పుడు కొనలేదు. ప్రజల వారి ఇళ్లల్లో శుభకార్యాలు చేసుకున్నప్పుడు తమ కుటుంబం సభ్యులుగా భావించి కాసాని కుటుంబ సభ్యులకు బట్టలు తీసుకునేవారంటే కాసాని ప్రజలతో ఎలా కలిసి పోయాడు అనేది మనకు అర్థం అవుతుంది.

పార్టీ ప్రజా సంఘాలకు నిర్మాణ కవచం కామ్రేడ్ కాసాని

1971లో సిపిఎం సభ్యుడుగా 1976లో ఎమర్జెన్సీ అనంతరం కొత్తగూడెం గ్రామీణ ప్రాంతాల్లో ఆరుగురుతో శాఖ ఏర్పాటు చేశారు. తాను వర్గ పోరాటాలు చేస్తున్న క్రమంలో నిర్మాణంపై కాసానికి పెద్దగా అవగాహన లేదు. ఈ క్రమంలో కామ్రేడ్ పి.రాజారావు గారు ఆనాడు డివిజన్ నాయకులుగా ఉండి 1984 ప్రాంతంలో శాఖను ఎలా నిర్మించాలి, కార్యకర్తలను ఎలా తయారు చేసుకోవాలి అని ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అలా ప్రజాసంఘాలను నిర్మించుకుంటూ పనిచేశారు. రెండు సంవత్సరాల పాటు అనుభవం నుండి పీ. రాజారావు గారు డైరెక్షన్‌లో నిర్మాణం పై పట్టు సాధించారు కామ్రేడ్ కాసాని. ఆ తర్వాత శాఖలను ప్రజాసంఘాలను డివిజన్ వ్యాప్తంగా నిర్మించి బలమైన పార్టీలో ఎదిగలు చేశారు. నేడు కొత్తగూడెం పట్టణం కొత్తగూడెం జిల్లాలో లోనే పార్టీ ప్రజా సంఘాలకు స్థితిలో ఉన్నాయంటే వాటికి ప్రధాన కారకులు కాసాని.

కార్యకర్తలను తమరిపై దృష్టి కార్యకర్తలని రోజువారి వస్తున్న రుగ్మతలను తొలగించడానికి నిర్మొహమాటంగా నిక్కొచ్చుగా మాట్లాడి వారిని సరిచేసి వారితో వారిలో నైపుణ్యతను వెలికి తీసి కార్యకర్తలుగా మంచి పని చేసేవాడు. వారి పని మెరుగుపరచడానికి కోర్ గ్రూపు విధానం ప్రవేశపెట్టి, వారం వారం పనిని రివ్యూ చేసేవారు. వారి బలహీనతను తెలియజేసి భవిష్యత్తు ప్రణాళికలు తమతోటి చెప్పించడం వంటివి ఏర్పాటు చేసి కార్యకర్తలని రాటు తేలేలా తయారు చేశారు.1991లో ఉమ్మడి కొత్తగూడెం డివిజన్ కార్యదర్శిగా, 2007 వరకు 16 సంవత్సరాల పాటు పని చేశాడు. 1996 నుండి 2017 వరకు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా. 2017-18 వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రథమ కార్యదర్శిగా, 2004 నుండి 2022 వరకు పార్టీ రాష్ట్ర సమితి సభ్యులుగా రాష్ట్ర కమిటీ సభ్యులు కొనసాగారు. 2009 నుండి 2011 వరకు అఖిలభారత కిసాన్ సభ సభ్యులుగా ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2020 నుండి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్నారు. ఇంతటి చరిత్ర ఉద్యమం కలిగిన కాసానితో ఉద్యమం ప్రారంభించి, మహా ఉద్యమంగా మార్చిన తీరు తన జీవితాంతం విరామం లేకుండా కృషి చేయడం మనకు ఆదర్శప్రాయుడు అనడంలో ఎలాంటి సందేహం లేదు. నాకు వ్యక్తిగతంగా 30 సంవత్సరాలుగా సంబంధాలు ఉన్నాయి. 21 సంవత్సరం ఇద్దరం కలిసి ఉద్యమాన్ని నిలబెట్టి విస్తరించారు. ఈ విధంగా అనుబంధాలు అనుభవాలు కలిసి ఉన్న జ్ఞాపకాలు ఉన్నాయి. అందుకే కాసాని అంటే వ్యక్తి కాదు... అది కమ్యూనిస్టు ఉద్యమం.

మీ పోరాట అడుగు జాడల్లో...మేముసైతం..

కడదాక పోరుబాటలో ...

నవతెలంగాణ-కొత్తగూడెం

సుజాత నగర్ గ్రామ పంచాయతీ సర్పంచ్, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కాసాని అయిలయ్యకి కాసాని లక్ష్మి తన 13వ ఏట మేనత్త కొడుకైన అయిలయ్యతో 1971 వివాహం జరిగింది. వరంగల్ జిల్లా గంగదేవి పల్లికి చెందిన సాధారణ రైతు కుటుంబం వీరిది. గంగదేవిపల్లిలో కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితులైన అయిలయ్య భూమి లేని పేదలకు భూమిపై పోరాటం చేసి విజయం సాధించారు. ఈ క్రమంలో పార్టీ కార్యకర్తగా, నాయకుడిగా ఎదుగుతున్న క్రమంలో కుటుంబ అవసరాల రీత్యా తనకున్న మూడెకరాల భూమిని అమ్ముకుని ఆ నాటి ఖమ్మం జిల్లా సుజాత నగర్ ప్రాంతంలోని రెడ్డిపాలెం గ్రామానికి వచ్చి వ్యవసాయం చేయడం ప్రారంభించారు. అప్పటికే ఈ ప్రాంతంలో కూలీరేట్లు, తప్పుడు కొలతలు, అవినీతి లాంటి సమస్యలతో ప్రజలు తీవ్ర దోపిడీకి గురవుతున్నారు. ఇది గమనించి అయిలయ్య అప్పటికే 9 ఇంక్లైన్ పార్టీ శాఖా సభ్యుడిగా ఉంటూ పార్టీ సలహా మేరకు ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై పోరుబాటను కొనసాగించాలని నిర్ణయించు కున్నారు. దానికి కాసాని లక్ష్మి మద్దతుగా నిలిచి అయిలయ్యను ప్రోత్సహించారు. ఈ క్రమంలో వ్యవసాయ కూలీ పోరాటాలు, భూమి పోరాటాలు, యువజన సంఘం పోరాటాలు, నీళ్లు, కరెంట్ వంటి సమస్యలపై పోరాటాన్ని పెద్దఎత్తున సాగించారు. జరుగుతున్న పరిణామాలను చూసి జీర్ణించుకోలేని ఆనాటి భూస్వామ్య పెత్తందారులు అయిలయ్య కుటుంబాన్ని తన్ని తరిమేయడానికి భౌతిక దాడులకు పాల్పడ్డారు. అప్పటికే పేద ప్రజలతో ఏర్పడిన సంబంధాల రీత్యా ఆ ప్రయత్నాలు అన్నింటినీ తిప్పి కొట్టగలిగారు. అయిలయ్య, లక్ష్మిల కుమారుడు లెనిన్లపై వ్యవసాయ కార్మికుల సమ్మె సందర్భంగా అక్రమ కేసులు పెట్టించారు.

1981లో సుజాత నగర్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాసాని అయిలయ్య అఖండ విజయం సాధించి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఈ క్రమంలో అయిలయ్య నివాసం ఉండటానికి ఇల్లు కూడా లేకుండా పెత్తందార్లు ఇబ్బందులకు గురిచేశారు. ఒక ఏడాదిలో ఏడు ఇండ్లను మార్చాల్సిన దుస్థితి ఆయనది. 1981 నునండి 2017 వరకు అప్పటి నుంచి 37 ఏండ్లుగా ఎర్రజెండా నాయకత్వంలో సుజాత నగర్ గ్రామ పంచాయతీ అభివృద్ధి పదంలోనే కొన సాగింది. మార్క్సిజం, లెనినిజం సిద్ధాంతాల ఆధారంగా పేదలను ఐక్యం చేసే ఎర్రజెండాను కాపాడు కుంటు అనే ఉద్యమాలను, పోరాటాలను చేశారు కాసాని.

సుజాతనగర్ గ్రామ పంచాయతీలోని ప్రజలకు అయిలయ్య కుటుంబాన్ని విడదీయ లేని బంధం ఏర్పడింది. ముఖ్యంగా లక్ష్మి ప్రతి కుటుంబంలో ఒక సభ్యులుగా అమ్మ, అక్క, చెల్లి, అన్న, బాబాయి, తమ్ముడు అంటూ వరసలు పెట్టి పిలవడంతో వారి కుటుంబానకి ఆ ప్రజలు మమేకమైనారు. ప్రజలతో ఉన్న ఆ సన్నిహిత సంబంధంతో కాసాని లక్ష్మి 1995లో ఎంపీటీసీగా, 2014లో జరిగిన సర్పంచ్ ఎన్నికలలో ఓటు, నోటు అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లగా ఓటు. వేసి-నోటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించారు. కాసాని అయిలయ్య భార్య కాసాని లక్ష్మి అయాన కష్టాల్లో పాలు పంచుకుంటునే 1985లో పార్టీ సభ్యత్వం తీసుకుని ఆనాటి ఉమ్మడి కొత్తగూడెం డివిజన్ మహిళా సంఘం బాధ్యతలు చేపట్టారు. డివిజన్‌లో మహిళా ఉద్యమాలు నిర్మించడంలోనూ, మహిళా సమస్యలపై పోరాటంలోనూ, సారా వ్యతిరేక ఉద్యమాలలో, అక్షర దీపం ఉద్యమంలోను ముందుడి పని చేసిన చరిత్ర లక్ష్మికి ఉంది.

సుజాత నగర్ పరిసర ప్రాంత ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చిన దగ్గరుండి పరిష్కరించడం కాసాని నైజం. ముఖ్యంగా కుటుంబ సభ్యుల మధ్య వచ్చే భూ సమస్యలు, ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలలో మధ్యవర్తిత్వం వహించి ఎన్నో కుటుంబాలను కలిపిన చరిత్ర కాసానికి ఉంది. ఆర్థిక సమస్యల పట్ల మేలు జరిగిన వారు ఎంతో కొంత ఆయనకు ఆర్థికంగా మేలు చేయాలని ప్రయత్నం చేసినప్పటికీ ఒక్క రూపాయి కూడా ఆశించని వ్యక్తి కాసాని, ఆయన వ్యక్తిత్వానికి ఆకర్షితులైన ఆయా గ్రామాల ప్రజలు ఆయన్ని గుండెల్లో పెట్టుకుని చూసుకున్నారు. అందుకే ఆయన చిరస్థాయిగా నిలిచిపోయిన నాయకుడిగా ఉన్నారు. సుజాతనగర్‌లో స్థిరపడి వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందిన వారు అనేక మంది ఉన్నారు. దానికి ప్రధానంగా అయిలయ్య అందించిన పూర్తి సహాయ సహకారాలేనని ఆయా వ్యాపార వర్గాల వారు నేడు గర్వంగా చెప్పుకుంటున్నారు.

పోరాటాల చుక్కాని...కాసాని

- ఉద్యమాలే ఊపిరిగా తుదివరకు పోరాటాలే
- "పోరాడితే పోయేది ఏముంది..బానిస సంకెళ్లు తప్ప" అని నమ్మిన మాస్ నాయకుడు

నవతెలంగాణ-కొత్తగూడెం

కామ్రేడ్ కాసాని ఐలయ్య నిస్వార్థ ప్రజా నాయకుడు. ఆయన 50 సంవత్సరాలకు పైగా రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు అట్టడగువర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడు...

యువకుడిగా ఎర్రజెండాను చేత బట్టిన కామ్రేడ్ కాసాని ఐలయ్య తుదిశ్వాస వరకు కమ్యూనిస్ట్ బాటలో కొనసాగారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్టు) ఆధ్వర్యంలో కూలి రేట్లు పెంపు కోసం, ఇల్లు, ఇంటి స్థలాలు, సారా వ్యతిరేక ఉద్యమాలకు పురుడు పోసాడు కామ్రేడ్ కాసాని ఐలయ్య. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పోడు భూముల రక్షణ, పంట గిట్టుబాటు ధరల కోసం, సాగునీటి ప్రాజెక్టు సాధన కొరకు, ధాన్యం కొనుగోలులో జరిగిన అవినీతికి వ్యతిరేఖంగా అనేక సమరశీల పోరాటాలకు ముందు భాగనా నిలబడి సారథ్యం వహించారు. మాటతప్పని, మడమతిప్పని పోరాట యోధుడిగా అర్థశతాబ్దంపైగా ప్రజాసేవకు అంకితమైన ప్రజల మనిషి కామ్రేడ్ కాసాని ఐలయ్య. కమ్యూనిస్టు ఉద్యమం యోధుడుగానే కాకుండా ప్రజా పాలనలో ప్రజలకు సేవలు అందించడంలో ప్రజా ప్రతినిధులు ఎలా ఉండాలి అనేదానికి నిలువెత్తు నిదర్శనంగ కాసాని అయిలయ్యను నిలువెత్తు ఆదర్శంగా చెప్పవచ్చు.



ఒక్కసారి సర్పంచ్ అయితేనే కోట్లు కూడబెట్టుకుంటున్న ఈ రోజుల్లో 37 సంవత్సరాల పాటు సిపిఎం ఆధ్వర్యంలో సుజాతనగర్ గ్రామ పంచాయతీకి మచ్చలేని సుపరిపాలన అందించిన ఆదర్శ ప్రజా ప్రతినిధి కాసాని. ఉమ్మడి రాష్ట్రంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులుగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మొదటి కార్యదర్శిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముఖ్యంగా కొత్తగూడెం డివిజన్‌లో సీపీఐ(ఎం) నిర్మాణం కొరకు ఎన్ని ఆటంకాలు, నిర్బంధాలు, భౌతిక దాడులు ఎదురు పడ్డా, వాటిని సైతం ఎదుర్కొని జీవితాంతం కృషి చేశారు. "పోరాడితే పోయేది ఏమూంది....బానిస సంకెళ్ల తప్ప" అని నమ్మిన ఆయన పోరాటాలతోనే ఏదైనా సాధించవచ్చునని నిరూపించిన పోరాట యోధుడు కాసాని. ఇళ్ళులేని నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని చేసిన పోరాటంలో కాసాని జైలుకు సైతం వెళ్ళాడు. పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని తన ప్రాణాలకు తెగించి ఆమరణ నిరహారదీక్ష చేసి 15 వేల మందికి ఇళ్ళ స్థలాలు ఇప్పించిన గొప్ప ప్రజా నాయకుడు కాసాని.

రాజకీయాలు అంటే వ్యాపారం, పదువులే ధ్యేయంగా మారిన నేటి సమాజంలో రాజకీయాలు అంటే నిస్వార్థ ప్రజాసేవ అని దోపిడీకి, అన్యాయానికి గురవుతున్న శ్రామిక ప్రజలు, దళితులు, గిరిజనులు, మహిళల హక్కుల కోసం పనిచేయటం అని భావించి మనుషులంతా సమానంగా గౌరవించబడే కులం, మతం, లింగ వివక్షత లేని ఆదర్శవంతమైన అభ్యుదయ నవ సమాజం కోసం జీవితాన్ని త్యాగం చేసి నిక్కచ్చిగా ప్రజల కోసం పరితపించిన నేత కామ్రేడ్ కాసాని ఐలయ్య. తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం ఇచ్చిన కామ్రేడ్ కాసాని మరణం తర్వాత కూడా తన శరీరాన్ని సమాజానికి ఉపయోగపడాలని ముందుగానే నిర్ణయించుకున్నారు. వైద్య విద్యార్థుల పరిశోధన కొరకు మెడికల్ కళాశాలకు ఇచ్చిన గొప్ప మానవతావాది. అమరజీవి కామ్రేడ్ కాసాని చేసిన పోరాటాలను స్మరించుకుంటూ భవిష్యత్ తరాలకు కాసాని వారసత్వాన్ని అందించాలని ఆదర్శ నాయకుడికి ఘనంగా నివాళులు అర్పించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ భావించింది. అందుకే మార్చి 9వ తేదీన ఆదివారం సంస్మరణ సభను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం, సుజాతనగర్ నడిబొడ్డున నిర్వహిస్తున్నారు.

గొర్రెల మేకల పెంపకం దారుల రక్షణకై పోరాడిన నేత

- గొర్రెలు మేకల పెంపకం దారుల గుండె ధైర్యం కామ్రేడ్ కాసాని
- గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాట్రాల తిరుపతిరావు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గొర్రెలు మేకలు పెంచుతూ జీవిస్తున్న పెంపకం దారుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకిస్తూ పెంపకం దారులను చైతన్య పరచడం కోసం గ్రామ గ్రామాన యాత్రలో నిర్వహించారు కాసాని ఐలయ్య. గొర్రెల మేకల పెంపకం దారులపై భూస్వాములు, ఫారెస్ట్ అధికారులు చేస్తున్న దాడులను తిప్పికొట్టి వారికి అండగా నిలిచారు. జిఎల్‌జి గ్రూపులు ఏర్పాటు చేసి రూ.3కోట్లు ఇప్పించడంలో విశేషమైన కృషి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గొర్రెల



పంపిణీ పథకం ద్వారా ప్రతి పెంపకం దారుడికి గొర్రెలు ఇవ్వాలని పెద్ద ఎత్తున పోరాటం నిర్వహించారు. ఆయన నేర్పిన బాటలో, ఆయన ఇచ్చిన స్ఫూర్తితో గొర్రెల మేకల పెంపకం దారులను ఐక్యం చేయడానికి పూనుకుంటామని ప్రతిజ్ఞ చేస్తున్నాం.

నన్ను నాయకుడిగా తీర్చిదిద్దిన కాసాని

- సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి లిక్కిబాలరాజు

కామ్రేడ్ కాసాని ఐలయ్య 2005లో నేను ఇంటర్ చదువుతూ విద్యార్థి ఉద్యమంలో పనిచేస్తున్న క్రమంలో పరిచయం అయ్యారు. మొదట మాది కాంగ్రెస్ కుటుంబం అయినప్పటికీ ఎస్ఎఫ్ఐలో పనిచేయడం ద్వారా సిపిఎం పార్టీ సభ్యత్వం తీసుకున్నాను. ఆనాటి నుండి నేను నాయకుడిగా వ్యక్తిగతంగా అభివద్ధి కావడానికి కాసాని తోడ్పడ్డాడు. 2010 సంవత్సరంలో సుజాతనగర్ కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆమర నిరాహార దీక్ష తలపెట్టినప్పుడు ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడిగా నన్ను ఆ దీక్షలో పాల్గొనే లాగా ప్రోత్సహించారు. ఆనాటి దీక్షల ఫలితంగా నూట యాభై మందికి ఇళ్ల స్థలాలు, సుజాతనగర్ కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పదవ తరగతి పరీక్ష కేంద్రం సాధించాము. ఈ పోరాటం నాకు స్ఫూర్తినిచ్చింది. ఈ పోరాటం తర్వాత నన్ను పూర్తిగాలం కార్యకర్తగా రావాలని కాసాని అడిగాడు, కాసాని మా ఇంటికి వచ్చి నీ బిడ్డను నాకు ఇవ్వాలమ్మ అని అడగగా మా అమ్మ ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా మాకు ఏమీ తెలియదండి రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం మీరు ప్రయోజకుని చేస్తానంటున్నారు. మీ ఇష్టం అని చెప్పింది. ఆ క్షణం నాకు ఆశ్చర్యం వేసింది. ఒక నాయకుడి మాటకి ఇతర పార్టీల కుటుంబంలో కూడా ఇంత విలువ ఉందా అని. 2012 సంవత్సరంలో నేను ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా ఖమ్మం వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. కాసాని ససేమీర ఒప్పుకోలేదు, ఎట్టి పరిస్థితుల్లో వెళ్లడానికి వీలులేదు అని నువ్వు ఇక్కడే ఉండి పనిచేయాలని మాస్ లీడర్‌గా స్థానికంగా ఎదగాలన్నారు. ఆఖరికి జిల్లా పార్టీ నిర్ణయం చేసి ఖమ్మం పంపించాలని చెప్పడంతో ఒక్క సంవత్సరం ఖమ్మంలో ఉండి తిరిగి కొత్తగూడెం రావాలి అని నాకు చెప్పి మరి ఖమ్మం పంపించారు. మన పని ప్రణాళిక బద్ధంగా ఉండాలని నిరంతరం ప్రజలతో మమేకమై జీవించాలని నాకు హితబోధ చేసేవాడు. నా పెళ్లి విషయంలో కూడా తానే బాధ్యత



తీసుకున్నాడు. కమ్యూనిస్టులంగా మనం ఆదర్శంగా ఉండాలని అలా ఉన్నప్పుడు మాత్రమే ఎదుటివారికి చెప్పగలుగుతామని నాకు చెప్పి కట్నం తీసుకోకుండా ఆదర్శ వివాహం చేసుకోవాలని చెప్పి అందుకు మా కుటుంబాన్ని కూడా ఒప్పించి నాకు ఆదర్శ వివాహం చేపించారు. కార్యకర్తకు కష్టం వస్తే పరిష్కారం అయ్యేవరకు వదిలిపెట్టకుండా పని చేసేవాడు. నాయకుడంటే సూపర్వైజింగ్ చేయడం, ఉపన్యాసాలు చెప్పడం కాదని క్షేత్రస్థాయిలో వెళ్లి ప్రజలతో పని చేయాలని చెప్పేవారు. అలా చేసి చూపించిన మహానేత కాసాని. తనకన్నా చిన్నవారినైనా సరే పేరు పెట్టి కామ్రేడ్ అని పిలిచేవాడు. నేను ఎప్పుడూ సార్ అని పిలిచేవాడిని, కానీ అది కాసానికి ఇష్టం ఉండేది కాదు... పదేపదే నాకు చెప్పాడు నన్ను సార్ అనకు ఏదో ఒక వరుస పెట్టి పిలువమని అడిగేవాడు. ఎలా పిలవాలో నీకు తెలియకపోతే నన్ను మామ అని పిలువు బాగుంటుంది అని చెప్పాడు. కానీ ఎందుకో నేను అలా పిలవలేకపోయాను. పార్టీలో నా అభివృద్ధి పట్ల కాసాని వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడం వలన నేను నాయకుడిగా ఎదిగానని చెప్పక తప్పదు. ఒక నాయకుడిలా కాకుండా స్నేహితుడా లాగా నన్ను దగ్గరకు తీసుకున్నాడు. నిరంతరం ఒకరి ఆలోచనలు ఒకరం పంచుకునే వాళ్ళము.

నేను 2016లో కొత్తగూడెం వచ్చిన దగ్గర నుండి మేము ఇద్దరం కలవని రోజు, కనీసం ఫోన్లోనైనా మాట్లాడిన రోజు లేదు. కాసాని చనిపోయే రోజు మాత్రమే అతనిని చూడటం కానీ ఫోన్లో మాట్లాడటం కానీ జరగలేదు. కానీ అదే మేము మాట్లాడుకోని చివరి రోజు అయింది.

కాసానితో నాకున్న బంధం గురించి నేను చెప్పిన విషయాలు రేఖామాత్రమే.. కమ్యూనిస్టు ఉద్యమానికి పూర్తికాలం కార్యకర్తలుగా వచ్చాము కాబట్టి ఎన్ని కష్టాలు ఆటంకాలు ఎదురైనా పార్టీలో చివరిదాకా నిలబడాలని, ఊగిసలాటలు ఉండకూడదని నాలో చైతన్యాన్ని నింపిన కాసాని స్ఫూర్తితో ఎప్పటికీ ఎర్రజెండా బాటలోనే పయనిస్తాను.

ఉద్యమ సూర్యుడు కాసాని...

- పేదల పక్షాన పోరాటాలు చేసిన ఉద్యమ కారుడు

నవతెలంగాణ-కొత్తగూడెం

పేదల పక్షన నిలబడి, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసిన ఉద్యమ కెరటం కాసాని అయిలయ్య (75) మృతి చెందారు. ఆయన భార్య కాసాని లక్ష్మి 4 మే 2017లో సుజాతనగర్ సర్పంచ్‌గా సేవలందిస్తు ఆకాల మరణం చెందారు. కాసాని అయిలయ్య వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గందేవి పల్లి గ్రామంలో 1950 జూలై 8వ తేదీన కాసాని భూమమ్మ మల్లయ్య దంపతులకు జన్మించారు. అనంతరం గంగాదేవి పల్లి గ్రామాల్లో ప్రాథమిక విద్యను అభ్యసించి, కాజీపేటలో మేనమామ ఇంటి వద్ద నుండి పియూసీ అభ్యసించాడు. అనంతరం 1970 సంవత్సరంలో వరంగల్ జిల్లాలోని ఆయన గురువు ఓంకార్ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాల్లో పాల్గొని సీపీఎం పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. 1971వ సంవత్సరం తన మేనమామ కూతురు లక్ష్మితో వివాహం జరిగింది. అనంతరం ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటూనే 1974 మార్చి 31వ తేదీన ప్రస్తుత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్



మండలం రెడ్డిపాలెం గ్రామానికి బ్రతుకు తెరువు కోసం వచ్చారు. గంగదేవిపల్లిలో అమ్ముకున్న భూమికి ఇక్కడ పదిహేను ఎకరాలు కొనుగోలు చేసి వ్యవసాయం చేయడం ప్రారంభిచారు. ఐలయ్య తండ్రి మల్లయ్య, వారి కుటుంబ సభ్యులందరూ ఇక్కడే వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని కొనసాగించుకుంటూ వచ్చారు. ఈ క్రమంలో ఇక్కడ జరుగుతున్న పేద ప్రజలు, రైతు కూలీల నుండి అధిక వడ్డీ వసూళ్ల దోపిడీలు, ప్రజల ఇబ్బందులు, కూలీ ఇవ్వకుండా వెట్టి చాకిరితో ఇబ్బంది పడుతున్న ప్రజల్ని ఆదుకొనటానికి కుటుంబం నుండి బయటకు వచ్చి ఆర్ఎంపీ వైద్యులుగా ప్రజలకు సేవలందిస్తు, ప్రజల్ని చైతన్యం చేసే క్రమం 1978 దాకా కొనసాగించారు. 1978లో పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా వచ్చి ఒకవైపు తన భార్య లక్ష్మిని, పిల్లల్ని తన సైకిల్‌పై ఎక్కించుకొని ఊరూరా తిరుగుతూ ప్రజల్ని ఐక్యం చేస్తూ, చైతన్యాన్ని నింపుతూ, వర్గ పోరాటాలు కొనసాగిస్తూ, కూలి పోరాటాలని పెద్ద ఎత్తున రగిలించి, విజయం సాధించారు.

భూస్వాములపై కూలి పోరాటాలు చేస్తున్న క్రమంలో కాసాని మీద పెద్దఎత్తున హత్యా ప్రయత్నాలకు కుట్రలు సాగాయి. సుజాతనగర్ పరిసర ప్రాంతాల్లో కూలీ రేట్ల పెంపుకోసం అనే పోరాటాలు చేసిన అనంతరం పంచాయతీ ఎన్నికల్లో 1981లో సుజాతనగర్ పంచాయతీకి పోటీ చేసి సర్పంచ్‌గా విజయం సాధించారు. అనంతరం అప్పటి నుండి 2001 వరకు 20 సంవత్సరాలు పాటు సర్పంచిగా గెలుపొందుతూనే వచ్చారు. ఈ క్రమంలో సీపీఎం పార్టీ నిర్వహించిన కూలి పోరాటాలకు రైతాంగ పోరాటాలకు ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పాల్వంచ నుంచి ఏన్కూర్ వరకు సుమారు 8000 ఇళ్ల స్థలాలు పేదలకు ఇప్పించిన చరిత్ర ఆయనకు ఉంది. తునికాకు కట్ట రేటు కోసం ఆర్గనైజ్ చేస్తూ పెద్ద పోరాటాన్ని కొనసాగించిన చరిత్ర ఉంది. వ్యవసాయ కూలీ పోరాటాల్లో తన భూమిలో వ్యవసాయ కూలీలకు అధిక రేటు ఇచ్చి మిగతా కూలీలకి మిగతా కూలీలకి రేటు పెంచాలని పోరాటాలు కొనసాగించారు. ఈ క్రమంలో 23 సార్లు జైలుకి వెళ్లారు. ఒకవైపు ప్రజా ఉద్యమంలో కొనసాగుతూనే తన కుటుంబాన్ని సైతం ప్రజా ఉద్యమానికి అంకితం ఇచ్చిన మహానేత. కాసాని ఐలయ్య భార్య లక్ష్మి 2017లో మే4వ తేదీన సుజాతనగర్ సర్పంచ్‌గా సేవలందిస్తూ అకాల మరణం చెందారు. వారికి కుమారుడు లెనిన్, కోడలు పావని, కుమార్తె జ్యోతి అల్లుడు కృష్ణ ఉన్నారు. ఇద్దరు సంతానానికి ఆదర్శ వివాహాలు చేశారు. గత 10 సంవత్సరాల నుండి అనారోగ్యానికి గురైనప్పటికీ శరీరంలోని రుగ్మతలతో అనుక్షణం పోరాడుతూనే... చివర శ్వాస వరకు ప్రజా సమస్యలపై పోరాటం సాగించారు.... అన్ని వర్గాల ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచారు.... చివరి వరకు సిపిఎం పార్టీ ఎర్రజెండా, నమ్మిన సిద్ధాంతం విడవకుండా, ప్రజా సంక్షేమం కోసం పాటుపడిన మహోన్నత నాయకుడు కామ్రేడ్ కాసాని అయిలయ్య.

కాసాని ప్రస్థానంలో కున్సోత్ ధర్మ..

పోరాట యోధుడు.... పేదలను తన సొంత బిడ్డల్లా చూసుకునే కాసాని అయిలయ్య జీవన ప్రస్థానంలో ఆయనతో కలిసి ఎన్నో పోరాటాలు కార్యక్రమంలో పాల్గొన్నాను....ఆయనతో పనిచేయడం వలన ఎన్నో నేర్చుకున్నాను...

1978లో కాసానితో తొలిసారి పరిచయం ఏర్పడింది. గుగులోత్ ధర్మా సొంత బంధువు కావడంతో ఆయన ద్వారా కాసాని అయిలయ్య గారితో పరిచయం ఏర్పడింది. 1981 గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సుజాతనగర్ గ్రామ పంచాయతీ ఎన్నికలో కాసానికి వ్యతిరేకంగా వార్డు నెంబర్ నిలబడి గెలిచాను. సర్పంచ్‌గా ఓడిపోయాను. 1981 గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తొలిసారి పంచాయతీ సర్పంచ్‌గా కాసాని ఐలయ్య ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్‌గా మండే వీరహనుమంతరావు గెలుపొందారు. వార్డు మెంబర్‌గా గెలిచిన నేను ఆయనతో కలిసి పని చేశాను. ఆ రోజు నుంచి ఆయనతో ఏర్పడిన అనుబంధం చివరి క్షణం వరకు కొనసాగింది. సుజాతనగర్ పంచాయతీ ఇల్లందు సమితిలో ఉన్నది. సమితి మీటింగ్‌లకు కాసానితో పాటు ఇల్లందు వెళ్లే వాళ్లం. వెళ్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికి సమితి అధికారులతో, ప్రజా ప్రతినితో మాట్లాడి నిధులు మంజూరు చేయించుకునేవాళ్లం. అప్పటి వరకు సుజాతనగర్ పంచాయతీలో ఉన్న నీటి సమస్య పరిష్కారానికి ఎవరు ప్రయత్నించలేదు. మొట్ట మొదటి సారిగా కాసాని అయిలయ్య సర్పంచ్‌గా ఎన్నిక అయిన తరువాతనే గ్రామంలో బోర్లు వేయడం ప్రారంభించారు. అలా అభివృద్ధి పయనం ప్రారంభం అయింది. ఆ తర్వాత సుజాతనగర్‌లో స్కూల్ బిల్డింగ్



సమకూర్చుకోవడం, పాఠశాలకు సంబంధించి టీచర్ పోస్టులు తీసుకు రావడం జరిగింది. కాసాని అయిలయ్య పార్టీలకు అతీతంగా ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితుగా మారాను. అప్పటి వరకు కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన నేను సిపిఎం పార్టీలోకి రావడం జరిగింది.

కాసాని చేసే ప్రజా సేవా, పార్టీతో ఏర్పడ్డ అనుబంధం సిపిఎంలోకి వచ్చేలా చేసింది. సిపిఎం ద్వారా గ్రామ పంచాయతీలు, గ్రామాల అభివృద్ధికి కాసానితో కలిసి పనిచేశా...నాతో పాటుగా సుమారు ఆనాడు వందలాది మంది సిపిఎం పార్టీలో చేరడం జరిగింది. ఆనాటి సుజాతనగర్ పంచాయతీలోని లక్ష్మీదేవిపల్లిలో ఉన్న అనే కుటుంబాలు సీపీఎంలోకి వచ్చాయి. మళ్లీ తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాసాని సర్పంచ్ ఎన్నిక కావడం, నేను వార్డు మెంబర్‌గా ఎన్నికవ్వడం జరిగింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కాసాని సర్పంచ్‌గా నేను ఉపసర్పంచ్‌గా పనిచేస్తాం. అనంతరం గ్రామ పంచాయతీ పునర్విభజన కార్యక్రమంలో సుజాతనగర్ గ్రామ పంచాయతీ ఎస్టీ రిజర్వ్ చేయడం జరిగింది. 2001లో సిపిఎం పార్టీ ఆదేశాల మేరకు కాసాని ప్రోత్సాహంతో నేను సర్పంచ్‌గా నిలిబెట్టి గెలిపించారు. అప్పటి వరకు వార్డు మెంబర్‌గా నేను పది, ఇరవై ఓట్లతో గెలిచిన నేను సర్పంచ్‌గా నిలపెట్టిన నేను 720 ఓట్ల మెజార్టీతో సర్పంచ్‌గా గెలిచేలా చేశారు.

ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసిన కాసాని కఠిక పేదరికం అనుభవించారు. కోటా బియ్యం తిని కుటుంబాన్ని నడిపారు. ఏనాడు కమ్యూనిస్టు సిద్ధాంతం, భావాలను, ఆశయాలను విడిచిపెట్టలేదు. పేదలకు ఎలాంటి అన్యాయం జరిగిన, బలహీనులకు అన్యాయం జరిగిన వెంటనే వారి సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నం చేసేవారు. ఏ పార్టీ అని చూడకుండా ఆ గ్రామాలలో ఉన్న ప్రజలందరినీ సొంత మనుసుగా ప్రేమించే వారు

డివైఎఫ్ఐ, రైతు సంఘం, సిపిఎం డివిజన్ కమిటీ, నాయకులుగా, డివిజన్ సెక్రెటరీగా ఆయన ఆధ్వర్యంలో పనిచేయడం జరిగింది. 1979లో రైతు సంఘం జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన నేను చివరి వరకు 2025 వరకు కాసాని గారితో పనిచేశాను. చివరి క్షణంలో ఆయన పక్కన లేకపోవడం తీవ్రంగా కలిచివేసింది. నిబద్ధత కలిగిన నాయకుడిగా, ఎలాంటి విమర్శలకు తావులేని, కల్మషంలేని నాయకుడిగా కాసాని ప్రజాసేవకు అంకితమైన గొప్ప వ్యక్తి. నేటితరం నాయకులు ఆయన జీవితాన్ని, పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలి.... ఆయన ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లాలి...

కాసాని ఐలయ్య కాదు త్యాగాల ఐలయ్య


- సీపీఐ(ఎం) అంటే ఐలయ్య....ఐలయ్య అంటే సీపీఐ(ఎం) అని మా చిన్ననాటి నుండి వినేవాళ్ళం..
- మా ఊర్లో ఐలయ్య వచ్చారు అని అంటే ఊరు జనాలందరూ పోగయ్యేవారు
- కాళంగి హరికృష్ణ

ఐలయ్య గారు విద్యార్థి యువజన ఉద్యమాలలో అనేకమందిని ప్రోత్సహించేవారు, కమ్యూనిస్టు పార్టీలో పనిచేయడం అంటేనే ఐలయ్య గార్ల బతకడం అని అర్థమయ్యే రకంగా జీవించేవారు. త్యాగపూరిత జీవితమంటే ఐలయ్య గారిని చూసి నేర్చుకోవాలని అనే రకంగా ఉండేవారు. ఊర్లలో జనాల్లో నానుడు ఉండేది కాసాని చిన్నప్పటినుండి ఏమీ సంపాదించుకోలేదని, కానీ ఆయన సంపాదించుకున్నది జనం మదిని అని ఆ జనాలకి ఆయన చనిపోయినాకే తెలిసింది.

విద్యార్థి సంఘంలో పనిచేసే నాడు వెంట పెట్టుకొని ఊరు ఊరు తిప్పేవారు. యువజన ఉద్యమంలో కార్యకర్తలని గుర్తించడం కోసం ప్రతి గ్రామానికి వెంటపెట్టుకొని మరి తీసుకెళ్లేవాడు. త్యాగం చేయని వాడు కమ్యూనిస్టు కాదు అని చెప్తూ త్యాగపూరిత జీవితం జీవించి త్యాగాల ఐలయ్యగా పేరు గణించి ప్రజలను వదిలి వెళ్ళిన ఆ అమరుడు అమరజీవి జీవితం కమ్యూనిస్టు పార్టీ త్యాగాలకు చిరునామాగా నిలుస్తారు.



యువకులు రాజకీయాల్లోకి వచ్చి ప్రజల పక్షాన పోరాటాలు చేస్తే ప్రజలు కూడా ఎలా ఆదరిస్తారు ఐలయ్యని చూస్తే అర్థమవుతుంది. ప్రాంతంతో పని లేకుండా ప్రజల పక్షాన ఎలా పోరాడాలో యువకులకి రాజకీయంగా ఐలయ్య జీవితం ఆదర్శప్రాయంగా నిలబడుతుంది. యువకుడిగా ఉన్న రోజుల్లోనే అద్భుతమైన పోరాటాలు సృష్టించి అటు ఎన్నికల్లోను కూడా బూర్జువా పార్టీల ఎత్తుగడలను చిత్తు చేస్తూ, అతి తక్కువ వయసులోనే గ్రామ పంచాయతీ రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగిన ఐలయ్యగారి జీవితం పోరాటాల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని నేటి యువత కూడా ప్రజల పక్షాన పోరాటాలకు సన్నద్ధం కావాలని, ప్రత్యక్ష రాజకీయాలకు రావాలని, త్యాగ పూరిత జీవితం గడిపి ప్రజల కోసం అనునిత్యం కొట్లాడే కమ్యూనిస్టు పార్టీ జెండా మోయడానికి ఐలయ్య స్ఫూర్తితో సిద్ధపడాలి.






CPI(M)
కొత్తగూడెం పట్టణ కమిటీ




CPI(M)






భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)









కా॥ కాసాని అయిలయ్య గారికి

అశ్రునివాళి



మీరు చూపిన ఆత్మీయత,అనురాగం,
మా అభివృద్ధికి వేసిన పూబాట...
మీరు భౌతికంగా దూరమైనా
మా చెంత ఉన్నట్లే ఉంది...
ఏమిచ్చి రుణం తీర్చుకోము
మా యదలోతుల్లోని భావాలను
అక్షర రూపంలో నివేదించడం తప్ప..
మీ జ్ఞాపకాలతో...

ప్రజా నాయకుడు సీపీఎం రాష్ట్ర నేత

కామ్రేడ్ కాసాని అయిలయ్య గారు

మరణం : 25-01-2025

గ్రామ శాఖలు
సుందరయ్యనగర్ - సుజాతనగర్

సింగభూపాలం గ్రామ శాఖ
సుజాతనగర్ మం॥

శ్రీ సాయి కిరణ్ సిమెంట్, ఐరన్ & హార్డ్‌వేర్
ప్రొ॥ వీర్ల ముత్తయ్య, సెల్ : 9100570866
బొడ్రాయి సెంటర్, సుజాతనగర్

విజయదుర్గ హోల్‌సేల్ రైస్ షాప్
పశువుల దాణా లభించును
ప్రొ॥ గంగాధర కోటేశ్వరరావు (రైస్ కోటి)
సుజాతనగర్. సెల్ : 9247888618,

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-కొత్తగూడెం

మహిళా సాధికారత, మహిళ అభ్యున్నతి కోసం ప్రజా ప్రభుత్వం, రేవంత్ రెడ్డి సర్కార్ నిరంతర కృషి చేస్తుందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవి ప్రసన్న అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా విద్యానగర్‌లోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో మహిళాదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆళ్లమురళి, వూకంటి గోపాలరావు, నాగ సీతారాములు, సొసైటీ చైర్మెన్ మండే వీర హనుమంతరావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ వై.శ్రీనివాస్ రెడ్డి, చింతలపూడి రాజశేఖర్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు బాలిశెట్టి సత్యభామ మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు కొల్లు పద్మ, రుక్మిణి, భద్రమ్మ, తాటి పద్మ, అనూష, రమాదేవి, హేమ, వాణి రెడ్డి,పుష్ప, స్వాతి రెడ్డి, దివ్య, సుప్రియ, విద్య, విజయలక్ష్మి, పుష్ప, శాంతి ఉమా, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్ పాల్గొన్నారు.

బాబూ క్యాంప్ పాఠశాలలో

ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా బాబూ క్యాంప్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నీరజ అధ్యక్షతన ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొక్కల రాజశేఖర్ పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు నీరజ మాట్లడుతూ మహిళలు, బాలికలు, పసి పిల్లలపై జరుగుతున్న అనేక అమానుషపు హింస దాడులను ప్రభుత్వాలు అరికట్టాలని, చట్టాలను కఠినతరం గా రూపొందించి అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో పనిచేస్తున్న 16 మంది మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చందర్ రావు, దస్తగిరి, వెంకటేశ్వర్లు, భీమా, మహిళా ఉపాధ్యాయులు సునందిని, రమాదేవి, సౌందర్య, సరోజినీ, పుష్పరాణి, సీత, సాలుకు, శైలజ, వెంకట లక్ష్మీ, తిరుపతి, స్టెల్లా, సత్యవేణి, సింధు, నాగమణిలు పాల్గొన్నారు.



మణుగూరు : శ్రామిక భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మహాత్మ సావిత్రిబాయి పూలే, చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో సీఐటీయూ, ఐద్వా నాయకులు నూతి శైలజా, తోట పద్మలు మాట్లాడారు. నవభారత నిర్మాణంలో మహిళలు విద్యావంతులుగా ఎదగాలని మహాత్మ సావిత్రిబాయి పూలే ఆలోచన విధానాలను స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు పిట్టల నాగమణి, గిరిజన సంఘం మండల అధ్యక్షురాలు కొండ్రు గౌరీ, బత్తుల రమాదేవి, జల్లా జయ, కౌశల్య, శ్రీలత కారం నాగేంద్ర, మడకం అరుణ, నాగలక్ష్మి, నరసమ్మ, సరిత, విజయ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం మణుగూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో క్లబ్ ప్రెసిడెంట్ నల్లగట్ల సత్య ప్రకాష్, చార్టర్ ప్రెసిడెంట్ పిల్లారిశెట్టి హరిబాబులు మాట్లాడారు. సమాజంలో విభిన్న వృత్తులలో విశిష్ట సేవలందిస్తున్న మహిళా మణులకు సత్కారం చేశామన్నారు. లాయర్స్ నుంచి కవిత, పోలీసు నుంచి ఏఎస్ఐ వాసి శాంతి, లెక్చరర్స్ నుంచి తెలుగు లెక్చరర్స్ గాజుల శ్రీదేవి, జే.గీత, టీచర్స్ నుంచి తోట విజయలక్ష్మి, డాక్టర్స్ నుంచి జయశ్రీ, సామాజిక సేవ విభాగంలో దండ రాధా, నాగుల జ్యోతి, కాలేజీ అటెండర్ సుజాతలను ఘనంగా శాలువాతో సన్మానించి బహుమతులతో సత్కరించారు. క్లబ్ సెక్రెటరీ షేక్ మీరా హుస్సేన్, సమాజ అభివృద్ధిలో స్త్రీ పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు గాజుల రమేష్, కముజు చంద్రమోహన్, డాక్టర్ దుస్సా సమ్మయ్య, నాగేశ్వరరావు, ఆడబాల నాగేశ్వరరావు, సురేష్, ఇంటర్, డిగ్రీ విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ వాకర్స్ ఆధ్వర్యంలో....

మహిళ మణులు స్ఫూర్తినిచ్చే ఘణులని, నేల నుండి నింగికెగిరే వరకు మహిళలు రాణిస్తున్నారని శ్రీ భార్గవ ఆటోమొబైల్స్ అధినేత ఎన్.విజయ భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రావులపల్లి రామూర్తి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ కో ఎడ్యుకేషన్ హై స్కూల్లో నేతాజీ వాకర్స్ టీమ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జెడ్పి కో ఎడ్యుకేషన్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జి.నాగలక్ష్మి, రామానుజవరం జెడ్పి హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు యశోద, మిషన్ భగీరథ ఏఈ అరుంధతి, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ అంజిత, ఏఎస్ఐ శాంతి, సాంబయిగూడెం జెడ్పి హై స్కూల్ ఉపాద్యాయురాలు సుజాత, మణుగూరు ప్రైమరీ స్కూల్ ఉపాద్యాయురాలు స్వరూపారాణి, రాధిక కాన్సెప్ట్ స్కూల్ ఉపాధ్యయురాలు సంధ్యలకు నేతాజీ వాకర్స్ పుష్పగుచ్చాలు అందించి శాలువతో సత్కరించారు. అనంతరం మహిళలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి యాదగిరి గౌడ్, వడ్డాణం రమేష్, వెంకటేశ్వరరావు, గోల్డ్ షాప్ శంకర్, శ్రీనివాసరావు, రామిరెడ్డి, తిరుపతిరావు, ప్రసాద్, రమేష్, భద్రు తదితరులు పాల్గొన్నారు.



చర్ల : చర్ల మేజర్ గ్రామపంచాయతీలో విధులు నిర్వహిస్తున్న మహిళా పారిశుద్ధ కార్మికులను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో-కన్వీనర్ అయినవోలు పవన్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఉద్యమ నాయకురాలు బీర జయమ్మ, మాజీ ఎంపీపీ సోయం కృష్ణవేణి, మాజీ సర్పంచ్లు కుంజ కమల, బెండ బోయిన లక్ష్మి, వార్డు మెంబర్లు పోలూరు సుజాత, కూర సుజాత, పార్టీ మండల మహిళా కార్యదర్శి చందుమల్ల వాణి ఉపాధ్యక్షురాలు కుప్పాల సౌజన్య, తదితరులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దొడ్డి తాతారావు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షులు సోయం రాజారావు, బీసీ సెల్ మండల అధ్యక్షులు గోరింట్ల వెంకటేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు పంజా రాజు, కాకి అనిల్, తడికల బుల్లేబ్బాయి, గాదంశెట్టి కిషోర్, సృజన్, సాయి, పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



పినపాక : మహిళలు ఆత్మగౌరవంతో బతికేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని జాతీయ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా నాయకులు రామకృష్ణ దొర అన్నారు. మండలంలోని జగ్గారం గ్రామపంచాయతీలో సెక్రటరీ నాగిని ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన హాజరయ్యారు. మహిళా ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ మహిళా సిబ్బంది, అంగన్‌వాడీ, పార్టీ మహిళా నాయకులను శాలువాతో సత్కరించారు.



దుమ్ముగూడెం : దేశంలో రోజు, రోజుకు మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, దాడులను అరికట్టేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టలు తీసుకురావాలని ఐద్వా మండల కార్యదర్శి మీడియా జయ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్న నల్లబల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్ళు పూసం రత్నవల్లి, మిడియం సమ్మక్క, కణితి రాధ, తెల్లం చెల్లమ్మ, అన్నపూర్ణ, అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు : మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ముందుగా స్థానిక మార్కెట్ యార్డ్‌లో మహిళలకు మ్యూజికల్ చైర్స్, టబ్ అండ్ బాల్ స్కిప్పింగ్, లేమన్ అండ్ స్పూన్ ఆటలు ఆడించారు. గెలిచిన మహిళలకు యూత్ ఫర్ కాంపిటేటివ్ అండ్ హెల్త్ సొసైటీ ప్రతినిధి సేవాలాల్, ఎస్బిఐ సారపాక బ్రాంచ్ మేనేజర్ విజయ్ రాజ్, ఫీల్డ్ ఆఫీసర్ తంబి కుమార్, ఎస్బిఐ బూర్గంపాడు మేనేజర్ కాకర్ల ప్రద్యుమ్న, ఫీల్డ్ ఆఫీసర్ మురళీధర్ రావు, టి జి బి రెడ్డిపాలెం మేనేజర్ రాచకొండ నరేష్, మో రంపల్లి బంజర్ మేనేజర్ నడిగోట రాజు, టీజిబి సారపాక మేనే జర్ జాటోత్ శివకుమార్, టిజిబి బూర్గంపాడు మేనేజర్ బాణోత్ ప్రసాద్‌ల సౌజన్యంతో గిఫ్టలు అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మాజీ జెడ్పిటిసి బట్టా విజయ గాంధీ, ప్రముఖ కాంట్రాక్టర్ బొల్లు రవి, ఐటిసి ఐజిటి బ్యాచ్ వారు సహకరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై ఉత్సాహంగా అటల పోటీలలో పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగానే జూనియర్ కాలేజి ఏర్పాటు

- **ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు**





నవతెలంగాణ-కొత్తగూడెం

ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగానే సుజాతానగర్‌లో జూనియర్ కాలేజి ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మందా నాగకృష్ణ, బయ్యా అభిమన్యులు స్పష్టం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్థానిక మంచికంటి భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మట్లాడారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సుజాతనగర్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. సుజాతనగర్ మండలంలో జూనియర్ కాలేజి ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ ఎన్నో దశలవారి పోరాటాలు నిర్వహించిందన్నారు. 2010లో ఆనాడు ఎస్ఎఫ్ఐ కొత్తగూడెం డివిజన్ అధ్యక్షులుగా ఉన్న లిక్కి బాలరాజు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, 10వ తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష సైతం చేశారన్నారు. వీలైనంత తొందరగా కాలేజీ నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తిచేసేలా చర్యలు తీసుకొని మండల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

లోక్ అదాలతే అంతిమ తీర్పు

- **ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి**



నవతెలంగాణ-ఇల్లందు

లోక్ అదాలతో రాజీ పడినట్లయితే ఇరువర్గాలు గెలిచినట్టే అని తద్వారా ఎంతో విలువైన కాలాన్ని డబ్బుని ఆదా చేసుకున్న వారు అవుతారని, అంతిమ తీర్పుని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి అన్నారు. శనివారం ఉదయం ఇల్లందు కోర్టు ఆవరణంలో ఇల్లందు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఇల్లందు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ మాట్లాడారు. కోర్టు ఆవరణంలో శరత్ మ్యాక్స్ ఐ కేర్ విజన్ నిర్వహించిన ఉచిత నేత్ర పరీక్షలు కార్యక్రమాన్ని రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించి నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం కక్షిదారుల కోసం చేసిన పులిహోర పొట్లాలు జడ్జి చేతుల మీదుగా పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమాల్లో జడ్జితో పాటు ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూకే రవికుమార్ నాయక్, ప్రధాన కార్యదర్శి కె.ఉమ మహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కీర్తి కార్తిక్, సీనియర్ న్యాయవాదులు జూనియర్ న్యాయవాదులు, బ్యాంకు సిబ్బంది, ఇల్లందు డిఎస్పి, సిఐ, పోలీస్ సిబ్బంది, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పొద్దుటూరు నాగేష్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి : అమరేందర్



నవతెలంగాణ-అశ్వాపురం :

మండలంలో గత మూడు రోజుల నుండి కొన్ని గ్రామాలలో మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని నీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేంద్ర యాదవ్ అన్నారు. శనివారం అయిన విలేకరులతో మాట్లాడుతూ అసలే ఎండాకాలం మొదలైన నేపథ్యంలో ప్రజలు నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారన్నారు. సంబంధిత మిషన్ భగీరథ అధికారులు ఎంపీడీవో ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్ళు అందజేయాలని డిమాండ్ చేసారు. లేని పక్షాన బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

రాంపురం అడవుల్లో పేలిన ఐఈడీ

- **కుంజ పాండే అనే యువతికి తీవ్ర గాయాలు**



నవతెలంగాణ -చెర్ల

సరిహద్దు చతిస్గడ్ బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీసు స్టేషన్ పరిధిలోని రాంపురం అడవుల్లో ఐఈడి పేలి రాంపురం గ్రామానికి చెందిన కుంజా పాండే అనే యువతీ తీవ్రంగా గాయాల పాలయింది. భద్రతా బలగాలే లక్ష్యంగా జవాన్లకు హాని కలిగించే విధంగా మావోయిస్టులు అమర్చిన ఐఈడీ బాంబు పేలుడు ఘటన అమాయక అదివాసీ యువతి గాయాల పాలైంది. చర్ల ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స జరిపి మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం



నవతెలంగాణ-అశ్వాపురం

మండలంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. మండల విద్యాశాఖ, అనంతపురంలోని గ్రామపంచాయతీ, రవీంద్ర పబ్లిక్ స్కూల్లో ఈ వేడుకలను నిర్వహించారు. మహిళలకు శాలువాలు కప్పి సన్మానం చేసి మిఠాయిలు తినిపించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కళా ప్రదర్శనలు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కుటుంబ నిర్వహణ తోపాటు అంతరిక్షంలో పరిశోధన వరకు తమ గొప్పతనాన్ని ప్రదర్శిస్తున్నారు అన్నారు. నేడు ప్రపంచంలో మహిళలు అన్ని రంగాలలో కీలక పాత్ర పోషించి వారి గొప్పతనాన్ని చాటుకుంటున్నారని పలువురు అన్నారు. ఈ కార్యక్రమంలో సూది రెడ్డి గోపాలకృష్ణారెడ్డి, దొడ్డ రమేష్, యోగితా రాణి, శంకర్, నరసయ్య, కడారి నవీన్, కందాల వీరస్వామి పాల్గొన్నారు.



ఎస్సై లక్ష్మీ భార్గవికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

నవతెలంగాణ-మధిర

ప్రపంచ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మధిర రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీ భార్గవిని కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించిన మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ ఐలూరు సత్యనారాయణరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నిడమానూరు వంశీకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అద్దంకి రవికుమార్, బాణావత్ రమణా నాయక్, ఐఎన్‌టియుసి అధ్యక్షులు కోరంపల్లి చంటి, రావిరాల సత్యనారాయణ, సాకే దుర్గా తదితరులు పాల్గొన్నారు.

వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఉమెన్స్ డే సెలెబ్రేషన్స్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక వేముల ఫంక్షన్ హాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల శశికళ, చౌడవరపు సీతామహాలక్ష్మీ, కోశాధికారి బుద్ధ శ్రీదేవి, యర్రం సుజాత, మొహనదాసు, వాసవి వనిత క్లబ్ మాజీ అధ్యక్షురాలు ప్రతాపని శైలజ, దేవరశెట్టి శైలజ తదితరులు పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో మహిళలు వివిధ ఆట పాటలతో ఒకరికొకరు కేక్ తినిపించుకున్నారు. హెూటల్ సత్యవైభవ్, హెుటల్ సత్యకొనార్క్ యజమానులు ప్రతాపని శైలజ గిఫ్ట్ కూపన్లు అందించారు.

కేశవరావుకు మట్టా దయానంద్ పరామర్శ

నవతెలంగాణ-వేంసూరు

మండల పరిధిలోని లింగపాలెం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సింగపోగు కేశవరావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నారు. శనివారం లింగపాలెంలో కేశవరావు నివాసంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ ఆయనను కలిసి పరామర్శించి ఆరోగ్య వివరాలు, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గన్నేని సురేష్, ఎర్ర సత్యనారాయణ, ఎర్ర వెంకటేశ్వరావు, చంటి, అశోక్, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు సండ్ర పరామర్శ

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన కోట శ్రీనివాసరావు మాతృమూర్తి ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య శనివారం పరామర్శించారు. అదేవిధంగా జెట్టి శంకర్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నల్లగట్ల వెంకటేశ్వరరావు, బీరవెల్లి వీరయ్య, బీరవెల్లి వీరప్ప, మోహన్‌రావు, నరసింహారావు కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు కట్టా అజయ్ కుమార్, మాజీ ఎంపీపీ రఘు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పోట్రు కిరణ్, గ్రామశాఖ అధ్యక్షులు కొమ్మినేని నరసింహారావు, మాజీ సర్పంచ్ సింగిశాల ప్రసాద్, పుసులూరి శ్రీనివాసరావు, కొంగల లేహం, పోట్రు రామకృష్ణ, కాకర్ల రామకృష్ణ, నల్లగట్ల ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం

-ఏడీఈ సతీష్

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని, నారాయణపురం, కుర్నవల్లి గ్రామాలలో, వేసవి ఎద్దడిని తట్టుకునేందుకు 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్లు శనివారం ఏర్పాటు చేశామని ఏడిఈ సతీష్ తెలిపారు. తల్లాడ ఏఈ రాయల ప్రసాద్, కుర్నవల్లి ఏఈ ఈదర కృష్ణకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

తడికమెళ్ళ రాధమ్మకు సండ్ర పరామర్శ

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని బిల్లుపాడు గ్రామానికి చెందిన తడికమళ్ళ రాధమ్మ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య శనివారం రాధమ్మను, పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేతినేని చలపతిరావు, నల్లగర్ల కృష్ణయ్య, దొమ్మరపాటి బాబు, జగ్గంపూడి నాగేశ్వరరావు, దొడ్డ వెంకటప్పయ్య, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

- ఎంఈఓ డి.రమణయ్య

నవతెలంగాణ-ముదిగొండ

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి డి.రమణయ్య అన్నారు. మండల పరిధిలో మల్లన్నపాలెం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ సభ, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యా రంగానికి కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతుందని, ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలలలో పిల్లలను చేర్పించాలని గ్రామస్తులను ఆయన కోరారు. గ్రామస్తులు ఉపాధ్యాయులు సహకారంతో ప్రభుత్వ బడులను అభివృద్ధిలోకి తీసుకురావాలని ఆయన చెప్పారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై చిన్నారుల ప్రతిభను వీక్షించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఇవి.రామిరెడ్డి, ఎన్వికె ప్రసాద్, కె.శాంతికుమారి, గ్రామ మాజీ సర్పంచ్ చిలకల విజేతరామకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ ఎస్కె.రహీంతుల్లా, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మెన్ కోనంగి నాగమణి, ఉపాధ్యాయులు టి.సుబ్బారావు, రామకృష్ణ, ఎస్కే. నాజర్, పాఠశాల ఉపాధ్యాయులు ఉషశ్రీ, లలిత, నరసింహారావు, పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ పరిశ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ముదిగొండ ఎస్సైగా కృష్ణప్రసాద్ బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-ముదిగొండ

ముదిగొండ ఎస్ఐ 2గా కృష్ణప్రసాద్ శుక్రవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్ ఎస్‌హెచ్ఓ మురళిను ఎస్సై కృష్ణప్రసాద్ కలిసి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎస్ఐ గజ్జెల నరేష్ బదిలీపై వెళ్లారు. ఆఎస్ఐ స్థానంలో కృష్ణప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. దీంతో ఇద్దరు ఎస్సైలు స్టేషన్ విధుల్లో కొనసాగనున్నారు.

జవహర్ లాల్ మృతి పట్ల మాజీ ఎంపీ నామ సంతాపం

నవతెలంగాణ-ఖమ్మం

వైరా మాజీ ఎమ్మెల్యే బాణోత్ మదన్ లాల్ సోదరుడు, మేడ్చెల్ జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్, డీఎస్పీ బాణోత్ జవహర్ లాల్ శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు . అయన మృతికి బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

త్రివేణిలో ఘనంగా మహిళా దినోత్సవం

నవతెలంగాణ-ఖమ్మం



మహిళా దినోత్సవం సందర్భంగా త్రివేణి పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ యలమూడి కావ్య చంద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ ,పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న ,ముస్తఫా, అశోక్ ,క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- పలువురు మహిళలకు సన్మానాలు
- ఎమ్మెల్యే మట్టా రాగమయ

నవతెలంగాణ-కల్లూరు



మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ మగవారికి ఏవిధంగా తక్కువ కాదని వారి కంటే కూడా పనిలో ఎక్కువ శ్రద్ధ పెట్టేది మహిళలేనని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ అంగన్వాడి ప్రాజెక్టు సిడిపిఒ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పాల్గొని జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పనిలో ప్రతిభ చాటిన మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, ఎమ్మెల్యేకి మహిళలకు శుభాకాంక్షలు తెలిపి మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, ప్రముఖ స్త్రీ నిపుణుల వైద్యురాలు మాధవి, సిడిపిఓ నిర్మల జ్యోతి, ఎండిఓ డి.చంద్రశేఖర్, ఆర్యవైశ్య సంఘ నాయకులు సంక రాంబాబు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక గ్రామపంచాయతీలో పనిచేస్తున్న మహిళలకు ఎండిఓ డి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా నారాయణపురం గ్రామంలో జామ కార్యదర్శి ఆధ్వర్యంలో మహిళలను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

పారిశుద్ధ్యం హస్తవ్యస్తం..

- పట్టించుకోని పంచాయతీ కార్యదర్శులు

నవతెలంగాణ-వేంసూరు



గ్రామాలలో పారిశుద్ధ్యం హస్త వ్యస్తంగా మారి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉండకపోవటం, సమస్యలపై స్పందించకపోవడంతో గ్రామాలలో సమస్యలు రోజురోజుకీ ఎక్కువైపోతున్నాయి. సంబంధిత శాఖ అధికారి పర్యవేక్షణ లేకపోవడం, దీనికి తోడు ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ఆడింది ఆట పాడిందే పాట అన్న విధంగా సాగుతుంది. మర్లపాడు పాత పంచాయతీ కార్యాలయం వద్ద ఇళ్ల నుండి వచ్చే మురికి నీరు నిల్వచేరి దోమల బారిన పడి ఆ వీధిలో ఉన్నవారు అనారోగ్యాలకు గురవుతున్నారు. అమ్మపాలెం మరికొన్ని గ్రామాల్లో చెత్త కూడా ఎత్తిన దాఖలాలు లేవని, స్థానికులు ఎవరైనా ప్రశ్నిస్తే నిధులు లేవు ఎక్కడి నుండి తేవాలి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ప్రజలు తెలుపుతున్నారు.

ప్రకటనలకే పరిమితమవుతున్న మహిళా సాధికారిత

నవతెలంగాణ-కారేపల్లి



మహిళ సాధికారిత పాలకులు ప్రకటనలతోనే సరిపుచ్చుతున్నారని కారేపల్లి మండలం సీఐటీయు కన్వీనర్ కే.నరేంద్ర, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్, ఐద్వా నేతలు ఎస్.నాగమణి, కే.ఉమావతిలు అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం కారేపల్లి భాగం రామనర్సయ్య భవన్‌లో సురబాక ధనమ్మ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈసదస్సులో వారు మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులు, లక్షాధికారులను చేస్తామంటూ ప్రకటనలు గుప్పిస్తున్న పాలకులు ఆచరణలో చూపటం లేదన్నారు. సేవా రంగాలలో పనిచేస్తున్న అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజనం వర్కర్లకు ప్రభుత్వాలు కనీస వేతనం ఇవ్వక గంపెడు చాకిరి చేయిస్తుందన్నారు. శ్రామిక మహిళలు ఐక్యమై తమ హక్కుల సాధనకు నడుం బిగించాలన్నారు. మహిళా ఉద్యమాలతోనే సమాజం ముందుకు పోతుందని, మహిళా సాధికారిక సాధ్యమవుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఈకార్యక్రమంలో మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి మేదరి మంగతాయి, ఆశ వర్కర్ యూనియన్ మండల అధ్యక్షురాలు వాంకుడోత్ కమల, మాజీ సర్పంచ్ కరపటి రాంబాయమ్మ, ప్రజాసంఘాల నాయకురాళ్లు బచ్చల బుజ్జమ్మ, భవాని, మేదరి కుమారి, ఆదెర్ల దేవకరుణ, రజియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో వ్యవసాయ రంగం

- రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి
- జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు

నవతెలంగాణ-వైరాటౌన్



భారతదేశంలో వ్యవసాయ రంగం ఎప్పుడు ఎన్నడు లేని విధంగా సంక్షోభంలో ఉందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు అన్నారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో గోడ పత్రిక ఆవిష్కరణ చేసిన అనంతరం గోవిందరావు మాట్లాడారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో అనుసరించవలసిన విధివిధానాలు, పోరాటాల రూపకల్పనకు, వైరాలోని కమ్మవారి కల్యాణ మండపంలో మార్చి 20వ తేదీన తెలంగాణ రైతు సంఘం 21వ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు అడపా రామకోటయ్య, సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్చార్జి యర్రా బాబు, మండల కార్యదర్శి యమాల గోపాలరావు, గారపాటి అశోక్, షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత లింగా వెంకటనారాయణకు మాతృవియోగం

- నివాళులర్పించిన పలు పార్టీల నాయకులు...

నవతెలంగాణ-ఖమ్మం రూరల్





మండలంలోని పల్లెగూడెం గ్రామానికి చెందిన సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు లింగా వెంకటనారాయణ మాతృమూర్తి లింగా మల్లమ్మ (85) గుండెపోటుతో మృతి చెందారు. సీపీఐ నాయకులు భాగం హేమంతరావు, మౌలానా, సురేష్ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో మల్లమ్మ మృతదేహంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. లింగా వెంకటనారాయణ కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతురాలికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మల్లమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, సీపీఐ(ఎం) నాయకులు ఉరడీ సుదర్శన్‌రెడ్డి, నండ్ర ప్రసాద్, మొరబోయిన పుల్లయ్య, వడ్లమూడి నాగేశ్వరరావు, నందిగామ కృష్ణ, లాల్ బాబు, ఆంటోనీ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటరెడ్డి, కేతినేని వేణు, బిఆర్ఎస్ నాయకులు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, మండలాధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, మాజీ జెడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, సీపీఐ నాయకులు మండల కార్యదర్శి సుధాకర్, చిన్న వెంకటరెడ్డి, కమలాకర్, వెంపటి సురేందర్, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు గుర్రం అచ్చయ్య, మలీదు నాగేశ్వరావు, బందెల వెంకయ్య తదితరులు ఉన్నారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోండి

- హక్కుల సాధనతో వివక్ష రూపుమాపు
- మహిళా దినోత్సవ సభలో న్యాయవాది పద్మావతి

నవతెలంగాణ-ఖమ్మం



మహిళా చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని చట్టాల రక్షణతో జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించవచ్చునని ప్రముఖ సీనియర్ న్యాయవాది పొలిశెట్టి పద్మావతి తెలిపారు. హక్కుల సాధన చైతన్యంతో వివక్షను రూపుమాపవచ్చునన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్లో మహిళా దినోత్సవ సభ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా పొలిశెట్టి పద్మావతి మాట్లాడుతూ మారిన సామాజిక పరిణామాలకు అనుగుణంగా అనేక మహిళా చట్టాలు రూపొందించబడ్డాయన్నారు. గృహ హింస మొదలు మహిళలు ఎదుర్కొనే ప్రతి సమస్యకు చట్టంలో పరిష్కారం ఉందని ఆమె తెలిపారు. మహిళల్లో చట్టాల ద్వారా వివక్షను ఎదుర్కొనే చైతన్యం రావాలన్నారు. ఆధునీక సమాజంలోని మహిళలు వివక్షను, ఇబ్బందులను ఎదుర్కొవడం శోచనీయమన్నారు. ప్రముఖ న్యాయవాది ఓరుగంటి శేషగిరిరావు మహిళా చట్టాలు వినియోగం అనే అంశంపై ప్రసంగించగా, పరిణామ క్రమం - మహిళా చైతన్యంపై ఎడ్యుకేషన్ సబ్ కమిటీ బాధ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి ప్రసంగించారు. సభకు ముందు మహిళా సమాఖ్య పతాకాన్ని పోటు కళావతి ఆవిష్కరించారు. ఈ సభలో మహిళా సమాఖ్య గౌరవాధ్యక్షురాలు తాటి నిర్మల, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి లతాదేవి, మహిళా సమాఖ్య బాధ్యులు దండి రాజేశ్వరి, బాగం అహల్య, జమ్ముల -లక్ష్మి, కె.ఉష, సరోజినమ్మ, మేళ్లచెరువు లలిత, లక్ష్మి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉమెన్ ఎంప్లాయిగా డోలమైట్ ఉద్యోగి

- అభినందించిన సీఐటీయు

నవతెలంగాణ-కారేపల్లి



కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన మహిళలు ఇచ్చే జాతీయ స్థాయి అవార్డును విశాఖ స్టీల్ ప్లాంట్ అనుబంధ సంస్థ మాధారం డోలమైట్ మైన్స్ ఉద్యోగి రేష్మ సుల్తానా ఎంపికైంది. డోలమైట్ మైన్స్‌లో సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న రేష్మసుల్తానా విధి నిర్వహణలో చూపిన అంకుటిత దీక్షకు ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్ ఎక్సలెంట్(డబ్ల్యూఐపీఎస్) అవార్డును అందుకున్నారు. సీఐటీయు సభ్యురాలైన రేష్మసుల్తానాను శనివారం జరిగిన కార్యక్రమంలో డోలమైట్‌మైన్స్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయు) అధ్యక్ష, కార్యదర్శులు గుంపెనపల్లి నర్సింహరావు, గుర్రం వెంకటేశ్వర్లు, నాయకులు ఆర్.యేసయ్య, బీ.రమేష్, బీ.లింగయ్యలు శాలువ కప్పి సన్మానించి అభినందలు తెలిపారు. సీఐటీయు కేంద్ర కమిటీ సభ్యులు వైటీదాస్, అయోధ్యరామ్, కారేపల్లి సీఐటీయు కన్వీనర్ కే.నరేంద్రలు రేష్మసుల్తానాకు ఫోన్‌లో అభినందలు తెలిపారు.



బషీర్ మాతృమూర్తికి జర్నలిస్టులు నివాళి

నవతెలంగాణ-ఖమ్మం

ఈనాడు చీఫ్ ఫోటో గ్రాఫర్ బషీర్ మాతృమూర్తి ఆషాబీ అకాలమరణం పట్ల ఖమ్మం జర్నలిస్టులు సంతాపం తెలిపారు. ఖమ్మం రహ్మత్ నగర్‌లో నివాసం ఉంటున్న బషీర్ ఇంటికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు. నివాళులు అర్పించిన వారిలో జర్నలిస్టులు సయ్యద్ ఖదీర్ , చిర్రా రవి , దువ్వా సాగర్ , కూరాకుల గోపి, యాకేష్ , కొత్త పల్లి శ్రీనివాస్ రెడ్డి , హెచ్‌ఎంటీవీ మానుకొండ రవి కిరణ్, ఆవుల శ్రీనివాస్ , కూరాకుల గోపి, వేగినాటి మాధవ్, కొమెర వెంకటేశ్వర్లు, జాని పాషా , జనం సాక్షి సుభాన్ , స్వేఛ్చా సాగర్ , కేవీ , గరిడేపల్లి వెంకటేశ్వర్లు , రామచంద్ర మూర్తి, మధు శ్రీ, యాకూబ్ పాషా, హర్షద్, మధు శ్రీ పాల్గొన్నారు.



మహిళా జర్నలిస్టుకు సన్మానం

నవతెలంగాణ-ఖమ్మం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాత్రికేయురాలు మధు శ్రీని జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. మధుశ్రీ ఉన్నత విద్య పూర్తి చేసి... హిందీ దినపత్రికలో జర్నలిస్టుగా పనిచేస్తుండడం గర్వకారణం అని.. తోటి జర్నలిస్టులు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ సన్మానించిన వారిలో సీనియర్ జర్నలిస్టులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, దువ్వా సాగర్, మానుకొండ రవికిరణ్, యాకేష్, సుభానీ, జాని, మూర్తి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా కార్మికులకు సన్మానం

నవతెలంగాణ-కారేపల్లి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం సింగరేణి గ్రామపంచాయతీ పరిధిలోని మహిళ కార్మికులను ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్ సన్మానించారు. సమాజాభివృద్ధికి మహిళలు మార్గదర్శకులని ఎంపీవో కొనియాడారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి టీ.నిరంజన్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాశ్, సీపీఐ జిల్లా నాయకులు తాత వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు

నవతెలంగాణ- సత్తుపల్లి

సత్తుపల్లిలోని కొత్త కొమ్మేపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ కాలనీలో సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న మసీదు, ప్రార్థన మందిరాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ జేవీఆర్, కిష్టారం ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్లు ప్రహ్లాద్, ఎంవీ నరసింహారావు కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, ఎండీ కమల్ పాషా, మానుకోట ప్రసాద్, పింగుల సామేలు, జేవీఆర్ ఓసీ సంక్షేమ అధికారి దేవదాసు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సిబ్బందికి సన్మానం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఘనంగా పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ యొక్క ప్రాధాన్యతను తెలియజేస్తూ... మహిళలకు చదివేందుకు అనుకునే రోజుల్లో మహిళలు ఉన్నత విద్యను అభ్యసించి టీచర్లు గా రాణిస్తూ ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారని వారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చావా జ్యోతి, రేణుక, కుమారి, తదితరులను ఘనంగా సత్కరించారు.

మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి

- ఎంపీడీవో ఎం.ఎర్రయ్య

నవతెలంగాణ-నేలకొండపల్లి

మహిళలు స్వశక్తితో రాణిస్తూ ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఎంపీడీవో ఎం ఎర్రయ్య అన్నారు. శనివారం స్థానిక నేలకొండపల్లి మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ మహిళ సిబ్బందిని శాలువతో సన్మానించి, చీరలు పంపిణీ చేశారు. అంగన్వాడి ఆశ వర్కర్లు, ఏఎన్ఎం, గ్రామ దీపికలకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ పావురాల శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంని కలిసి నూతన మార్కెట్ కమిటీ పాలక వర్గం

నవతెలంగాణ-మధిర

మధిర మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని నియమించినందుకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు ఆర్థిక ప్రణాళిక మరియు విద్యుత్ శాఖ మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్కని శనివారం హైదరాబాద్ ప్రజాభవన్ లో మర్యాదపూర్వకంగా మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సూరం శెట్టి కిషోర్ నేతృత్వంలో మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కలిసి కృతజ్ఞతలు తెలుపుతూ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణ రెడ్డి ,డైరెక్టర్లు అద్దంకి రవికుమార్ ,బానోత్ రమణా నాయక్ ,వేల్పుల చెంచు ,షేక్ షన్ను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు పాల్గొన్నారు.

మహిళలపై చులకన భావం సమాజం విడనాడాలి

నవతెలంగాణ-సత్తుపల్లి

సమాజంలో మహిళల పట్ల చులకన భావం ఉందని, ఆ భావాన్ని సమాజం విడనాడాలని పట్టణానికి చెందిన వైద్యులు వసుమతీదేవి, నవ్య అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నవభారత్ డిగ్రీ కళాశాలలో అధ్యక్షురాలు పాకలపాటి ఝాన్సీ అధ్యక్షతన మహిళా దినోత్సవ వేడుకను నిర్వహించారు. ఈ వేడుకలో డాక్టర్లు వసుమతీదేవి, నవ్య ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. వివిధ రంగాల్లో మహిళలు ముందుకు సాగుతున్న క్రమంలో వారికి చేయూతను అందించాలన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆయా కుటుంబాలు కూడా ఆరోగ్యంగా ఉంటాయన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా హక్కులను కాపాడేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. మహిళలు స్వయం సాధికారత సాధించాలని, చట్ట సభల్లో మహిళలకు చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణ ఐద్వా ఆధ్వర్యంలో వసుమతీదేవి, నవ్యలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి చెరుకు రత్నకుమారి, చావా కవిత, పుష్పవల్లి, బసవమ్మ సత్యవతి, ప్రభావతి, కొచ్చర్ల జ్యోతి, కుమారి, కొచ్చర్ల శ్రీనివాసరావు, నవభారత్ డిగ్రీ కళాశాల చైర్మెన్ గాదె నరసింహారెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, రైతుసంఘం జిల్లా నాయకులు రావుల రాజబాబు, పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, భాస్కర్ పాల్గొన్నారు.

సాయిస్ఫూర్తిలో...

సత్తుపల్లి మండలం గంగారం సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, బీటెక్ అన్ని బ్రాంచిలు, డిప్లొమో, ఎంబీఏ, మహిళా సాధికారత సంస్థ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఊటుకూరి శేషారత్నకుమారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకరరెడ్డి, సాధికారత సంస్థ కన్వీనర్ రాచమళ్ల శ్రీదేవి, సభ్యులు లీలావతి, ప్రతిమ, సుధారాణి, సత్యవేణి, నాగలక్ష్మి రాణి పాల్గొన్నారు.

'మిస్ట్' కళాశాలలో...

సత్తుపల్లిలోని మదర్ థెరెసా ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకను నిర్వహించారు. మిస్ట్ ఉమెన్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ తులసి బిక్కు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ, ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో...

యూటీఎఫ్ డివిజన్ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని జరిపారు. ఉపాధ్యాయురాలు కిశోరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నిర్మలకుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మహిళా నాయకురాళ్లు కనకదుర్గ, పుష్ప, శిరీష, భారతి పాల్గొన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయిని ఉమాసుందరిని సన్మానించారు.

పెనుబల్లి : మండలంలో ప్రపంచ మహిళ దినోత్సవం పెనుబల్లి ఐద్వా మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. టేకులపల్లి, లంక సాగర్ క్రాస్ రోడ్‌లోని సీడ్స్ ఫ్యాక్టరీలు మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 33% మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గాయం తిరుపతిరావు, ఐద్వ మండల నాయకులు మిట్టపల్లి నాగమణి, నాగేశ్వరి, ప్రజా సంఘాల నాయకులు తడికమల చిరంజీవి రామచంద్రుడు పాల్గొన్నారు.

బోనకల్ : మండల పరిధిలో గోవిందపురం ఎల్ గ్రామంలో ఐద్వా ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జెండాను ఐద్వా మండల కార్యదర్శి జొన్నలగడ్డ సునీత ఎగురవేశారు. ఈ సందర్భంగా జొన్నలగడ్డ సునీత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెం : మహిళా దినోత్సవం సందర్భంగా కోయచెలక గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మాదంశెట్టి హనుమంతరావు ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ మహిళా కార్మికులకు, పోస్టల్ సమస్త, గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న వారిని సన్మానించారు. గతంలో 100 మంది మహిళలకు ఆడబిడ్డలుగా భావించి, సత్కారం అందచేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకుడు చెరుకూరి పూర్ణచంద్రరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సీతారాములు, పూర్ణ, చెరుకూరి ముత్తయ్య, కృష్ణారావు, లక్ష్మణ్, శేషయ్య, యేసు, శేషగిరి పాల్గొన్నారు.

ముదిగొండ : నెహ్రూ యువ కేంద్రం, ప్రజ్వల యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీ శక్తి భవనంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు మూడు రకాల ఆటలు ర్యాలీ నిర్వహించారు. 1(వక్తృత పోటీలు 2)మ్యూజికల్ చెర్స్,3) బేలన్స్4) డాన్స్ పోటీలు నిర్వహించి గెలుపొందిన మహిళలకు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం తహశీల్దార్ సునీత ఎలిజిబెత్ మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వాలూరి కల్పన, ప్రజ్వల యువజన సంఘం అధ్యక్షులు చింతమాల పాపయ్య, మండల సమాఖ్య సభ్యులు, వివోఏ సభ్యులు, గ్రామ దీపికలు, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో...

ఐద్వా ఆధ్వర్యంలో మండల పరిధిలో చిరుమర్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా మండల కార్యదర్శి కోలేటి అరుణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చావగాని లలిత, ఐద్వా నాయకురాళ్లు బండి నాగమణి, వినుకొండ రాణి, పల్లపాటి శాంతమ్మ ధనమ్మ, ఉమ, కందుల పద్మా, వడ్డే భారతమ్మ, మారనేని లక్ష్మీ, మండేపూడి పద్మ, అనిత, స్వాతి, ఉన్నం లక్ష్మీ, కేతినేని లక్ష్మి, నర్రా నాగమణి, నల్లగొండ శ్రీవిద్య, ముక్కు సత్యవతి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి రూరల్ : 15వ ప్రత్యేక పోలీసు పటాలము బి.గంగారంలో ఘనంగా ప్రపంచ మహిళాదినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ పీజేపీసీ చటర్జీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.శ్రీధర్‌రాజా, మహిళా సిబ్బంది, పటాలపు ఆసుపత్రి మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సత్తుపల్లి


ముదిగొండ


సత్తుపల్లి


ముదిగొండ


సత్తుపల్లి


సత్తుపల్లి రూరల్


బోనకల్


రఘునాథపాలెం

ప్రతిఒక్కరూ దయ హృదయం కలిగి ఉండాలి...

- విద్యుత్ ఏఈ జిల్లా ప్రభాకర్ రావు...

- దివ్యాంగుల సమక్షంలో కుమార్తె పుట్టినరోజు వేడుకలు...

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



ప్రతి ఒక్కరూ దయా హృదయాన్ని కలిగి ఉండాలని విద్యుత్ ఏఈ జిల్లా ప్రభాకర్ రావు అన్నారు. మండలంలోని మద్దు లపల్లి సబ్ స్టేషన్ ఏఈ గా విధులు నిర్వహిస్తున్న జిల్లా ప్రభాకర్ రావు తమ కుమారుడు,కుమార్తె మానస్,మాన్విత ఐదవ పుట్టినరోజు వేడుకలను పెద్దతండాలోని మేఫీ మానసిక వికలాంగుల కేంద్రంలో దివ్యాంగుల సమక్షంలో శనివారం నిర్వహించారు.చిన్నారులతో దివ్యాంగులకు అన్నదానం చేపించారు.ఈ సందర్భంగా ప్రభాకర్ రావు మాట్లాడారు...మానసిక,శారీరక వికలాంగుల పట్ల ప్రతి ఒక్కరు దయా హృదయాన్ని కలిగి ఉండాలని,మానవసేవే మాధవసేవ అని విద్యార్థులకు,చిన్నారులకు చిన్నప్పటి నుంచే నేర్పాలని తల్లితండ్రులకు సూచించారు. చిన్నప్పటి నుంచే సేవ గుణం అలవాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు జిల్లా జ్యోతి,బంక లాలమ్మ,అశోక్,విద్యుత్ శాఖ సిబ్బంది ప్రసాద్,మేఫీ నిర్వాహకురాలు ప్రమీల,ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక మహిళలు ముందు తరాలకు ఆదర్శంగా ఉండాలి

- టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఖమ్మం

ఆధునిక మహిళలు ముందు తరాలకు ఆదర్శంగా ఉండాలని టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. శనివారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు . తొలుత అధ్యక్షులు జి ఉషశ్రీ, కార్యదర్శి పి సుధారాణి ,టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాలలో రాణిస్తున్నారని సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ఉద్యోగ సంఘాలలో కూడా మహిళలు పాల్గొంటున్నారని ,గెజిటెడ్ విభాగంలో మహిళ విభాగం ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేసినందుకు మహిళా విభాగ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ డాక్టర్ పి శ్రీజ మాట్లాడుతూ మహిళా గెజిటెడ్ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. ఖమ్మం జిల్లా పరిపాలన నిర్వహణలో మహిళల



భాగస్వామ్యం ఎక్కువగా ఉందని, రాష్ట్రంలోని అతిపెద్ద జిల్లాలోని రెండవ జిల్లాగా ఖమ్మం జిల్లా మహిళలు పరిపాలనలో తమదైన పాత్రతో ముందుకు పోతున్నారని అభినందించారు. అనంతరం 22 విభాగాలలో నిర్వహించిన క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను విజేతలకు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ ,కార్యదర్శి మోదుగు వేలాద్రి, ట్రెజరర్ శేషు ప్రసాద్, హౌస్ బిల్డింగ్ సొసైటీ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి విజయ్ కుమార్, జిల్లా ట్రెజరర్ రమేష్ ,జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి శ్రీనివాస్ ,మహిళా కార్యదర్శి పి సుధారాణి, జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ బాబు రత్నాకర్, జి రమేష్, వెటర్నరీ వెటర్నరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మన్యం రమేష్ బాబు, జిల్లా బాధ్యులు డాక్టర్ హరీష్, శ్రీనివాస రావు , కిషోర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు వెంకట పుల్లయ్య , కార్యదర్శి మహేష్ , ప్రసాద్ అధ్యక్షులు సునీల్ రెడ్డి , కార్యదర్శి పుల్లయ్య , యూటీఎఫ్ రంజాన్ , దేవరకొండ సైదులు , ఎస్ టి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాస్ , కొణిదెన శ్రీనివాస్ కార్యదర్శి ,పి ఆర్ టి యు అధ్యక్షులు వై వెంకటేశ్వర్లు , కనపర్తి వెంకటేశ్వర్లు, సతీష్ రెడ్డి వీరస్వామి , జహీరుద్దీన్, డాక్టర్ సైదులు, డాక్టర్ రాజశేఖర్ గౌడ్, మహమ్మద్ గౌస్, మోహన్, కృష్ణార్జున రావు, బాలాజీ ,జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణశ్రీ, అరుణకుమారి, వై మంజుల, నాగేంద్ర కుమారి, శారద, డాక్టర్ సుజాత, హిమ సమీరా, ప్రమీల , వాసవి రాణి, రాజ్యలక్ష్మి , శైలజ, లావణ్య, లలిత, అరుణ, రమాదేవి, విజయ్ కుమారి, తదితరులు పాల్గొన్నారు.